www.telugutrack.in

# తెలుగు ట్రాక్

TELUGU TRACK

APTEL 16257

Coming Soon
www.FlatSmart.in
Find Your Dream Home in online,get complete details @free
FlatSmart

Volume : 1 :: Issue : 41 | WEEKLY | MONDAY | 2 October 2023 | Pages 16 | Rs.10/- | VIJAYAWADA

# ఏపీ భవిష్యత్తు కోసమే

**తెలుగు ట్రాక్, అవనిగడ్డ**

ఆంధ్రప్రదేశ్ ప్రజల భవిష్యత్తు బాగుండాలనే మంచి ఆలోచనతోనే తెలుగుదేశం పార్టీతో కలిసి పోటీ చేస్తున్నామని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. అవనిగడ్డలో వారాహి యాత్ర నాల్గవ విడతలో భాగంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. సభలో ఆయన మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి చేసిన అవినీతి ,ఇసుక దోపిడీ గురించి ప్రధాని చెప్పాలని అనుకుంటున్నట్లు తెలిపారు. ఇటీవల విద్యాశాఖలో ప్రవేశ పెట్టిన బైజూస్ ద్వారా బత్తాయి రసంలా పిండేసి కుంభకోణానికి పాల్పడ్డాడని ఆరోపించారు. ప్రధానికి కూడా జగన్ చేస్తున్న అవినీతి గురించి తెలుసనీ,ప్రజల చేత ఎన్నుకోబడ్డ ప్రభుత్వం కాబట్టి,సమాఖ్య స్పూర్తితో ఎదురుచూస్తున్నట్లు ఆయన తెలిపారు. ఏపీ లోని అన్ని వర్గాలను పట్టి పీడిస్తున్న వైసీపీ మహమ్మారికి ఏకైక విరుగుడు వ్యాక్సిన్ తెలుగుదేశంతో కూడిన ప్రభుత్వంతో వస్తుందని అన్నారు.



## తెరపైకి మరోసారి ఓటుకు నోటు

తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించిన 'ఓటుకు నోటు' కేసు మరోసారి సుప్రీంకోర్టు ముందుకు విచారణకు వచ్చింది. ఇప్పుడిదే తెలుగు రాష్ట్రాల్లో బిగ్ డిస్కషన్‌గా మారింది. 2014 తర్వాత తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన ఓటుకు నోటు కేసులో కదలిక వచ్చింది. ఈ నెల 4న సుప్రీం కోర్టు ఈ పిటిషన్ ను విచారణ చేయనుంది. ఓటుకు నోటు కేసులో చంద్రబాబును కూడా ముద్దాయిగా చేర్చాలని వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామక్రిష్ణా రెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను 4వ తేదీన జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ సంజయ్ కుమార్ ధర్మాసనం విచారణ చేయనుంది. ఓటుకు నోటు కేసును తెలంగాణ ప్రభుత్వం తగిన విధంగా దర్యాప్తు చేయడంలేదని, సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ ఎమ్మెల్యే ఆళ్ల రామక్రిష్ణారెడ్డి పిటిషన్ దాఖలు చేశారు.స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసు సహా వరుస కేసులతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న చంద్రబాబు నాయుడికి ఇప్పుడు ఈ కేసు కూడా తోడైంది. ఈ కేసు ఆయనకు మరింత సంకట స్థితిని కలిగించనుంది.

# తెలంగాణకు వరాలు



నిజామాబాద్ లో జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రధాని మోడీ ప్రకటించారు. గత ఎన్నికల్లో తమ పార్టీ ఇచ్చిన హామీ మేరకు పసుపు రైతులకు మేలు చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ములుగు లో సమ్మక్క సార్క పేరిట గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం 900 కోట్ల రూపాయల నిధులను వెచ్చించనున్నట్లు తెలిపారు. తెలంగాణాలో 13545 కోట్ల రూపాయల విలువైన పనులకు ప్రధాని ప్రారంభోత్సవం చేశారు. పాలమూరులో ప్రజాగర్జన పేరిట ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. రైతుల కోసం ప్రధాన మంత్రి కిసాన్ ఇప్పటికే పదివేల కోట్ల రూపాయలను వెచ్చించినట్లు తెలిపారు. పీఎం విశ్వకర్మ యోజన క్రిందచేతి వృత్తుల వారికి మార్కెటింగ్ సదుపాయం,ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. తెలంగాలో రాబోయే ఎన్నికల్లో అవినీతికి తావులేని ప్రభుత్వం కావాలంటే బీజేపీని ఎన్నుకోవాలని కోరారు.




## అరెస్టుకు నిరసనగా దీక్ష

9లో





### జాతీయ రహదారులపై

# గొయ్యిలు లేని రోడ్లు



తెలుగు ట్రాక్,ముంబై

ఇండియా రోడ్లపై 'గొయ్యి' సమస్య ఇప్పటిది కాదు! ఈ గొయ్యిలతో ప్రజలు నిత్యం ఇబ్బంది పడుతూనే ఉంటున్నారు. ఈ పాత్‌హోల్స్.. అనేక సందర్భాల్లో ప్రమాదాలకు కూడా కారణమవుతున్నాయి. ఈ వార్తలు ఎప్పుడు బయటకి వచ్చినా.. ప్రభుత్వంపై విమర్శలు వినిపిస్తూనే ఉంటాయి. ఇక ఇప్పుడు వీటిని కేంద్రం సీరియస్?గానే తీసుకున్నట్టు కనిపిస్తోంది. ఈ విషయంపై కేంద్ర రోడ్డు రవాణా- జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఏడాది చివరి నాటికి.. దేశవ్యాప్తంగా ఉన్న జాతీయ రహదారులపై ఉన్న గొయ్యిలను పూడ్చేస్తామని స్పష్టం చేశారు.కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశంలో 1.46లక్షల మేర జాతీయ రహదారి నెట్‌వర్క్ ఉంది. ఈ ఏడాది డిసెంబర్? నాటికి.. రహదారులపై గొయ్యి సమస్య ఉండదని అంటున్నారు గడ్కరీ. ఈ మేరకు.. షార్ట్ టర్మ్ కాంట్రాక్ట్స్ ఇస్తున్నట్టు స్పష్టం చేశారు.దేశ జాతీయ రహదారులపై ఎలాంటి గొయ్యిలు ఉండకుండా చూసుకునేందుకు కేంద్రం ఓ పాలసీని రూపొందిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద జాతీయ రహదారుల నెట్?వర్క్?.. ఇండియా సొంతం. కాంట్రక్టర్స్ సాయంతో ఈ నెట్?వర్క్?ను ఎన్‌హెచ్ఏఐ (నేషనల్? హైవే అథారిటీ ఆఫ్? ఇండియా) నిర్మిస్తుంది, నిర్వహిస్తుంది," అని నితిన్? గడ్కరీ అన్నారు.ఈ గొయ్యిలు.. రోడ్ల నిర్మాణంలో ఉపయోగించే పద్ధతి బట్టి ఉంటాయి. ఇండియాలో హైవేలను మూడు పద్ధతుల్లో నిర్మిస్తారు. బీఓటీ (బిల్ట్-ఆపరేట్- ట్రాన్స్‌ఫర్), ఈపీసీ (ప్రొక్యూర్మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్), హెచ్?ఏఎం (హైబ్రీడ్? యాన్యుటీ మోడల్). ఈపీసీ మార్గంలో రూపొందించిన రహదారులను కేంద్రం నిర్వహిస్తుంది. టోల్‌ను కలెక్ట్ చేస్తుంది.

"బీఓటీ రోడ్లు చాలా పర్ఫెక్ట్‌గా ఉంటాయి. వాటి గురించి పెద్దగా ఆలోచించాల్సిన అవసరం లేదు. ఈపీసీ మార్గంలో రూపొందించే రోడ్లను ఎప్పటికప్పుడు మెయిన్?టైన్? చేస్తూ ఉండాలి. అందుకే వీటి నిర్వహణ కోసం షార్ట్? టర్మ్? కాంట్రాక్ట్? ఇవ్వాలని చూస్తున్నాము," అని నితిన్? గడ్కరీ అన్నారు.ఈ వార్త విన్న నెటిజన్లు.. 'మాములు రోడ్లను కూడా బాగు చేస్తే బాగుండు!' అని అంటున్నారు. మరి మీరేమంటారు? ఏడాది చివరి నాటికి.. జాతీయ రహదారులపై ఉన్న 'గొయ్యి' సమస్యను పరిష్కరించడం సాధ్యమేనా?

# బీజేపీకి చుట్టుకొంటున్న బాబు అరెస్ట్

తెలుగు ట్రాక్,హైదరాబాద్

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు 14 ఏళ్లు సీఎంగా చేశారు. ప్రతిపక్ష నేతగా ఉన్నారు. జడ్ ప్లస్ సెక్యూరిటీలో ఉన్నారు. అలాంటి నేతను ఎఫ్ఐఆర్‌లో పేరు లేకుండా అరెస్ట్ చేయడం సాధ్యమా అరెస్టు చేసేటప్పుడు ఏ కేసో కూడా చెప్పకుండా నోటీసులు ఇచ్చి అరెస్టు చేశారు. 73 ఏళ్ల వయసులో ఉన్న ఆయనను పన్నెండు గంటల పాటు రోడ్లపై జర్నీ చేయించి.. మరో పన్నెండు గంటల పాటు నిద్ర కూడా పోనివ్వకుండా విచారణ జరిపి.. మరో పదహారు గంటల పాటు కోర్టులో కూర్చోబెట్టారు. దేశంలోని అత్యంత సీనియర్ లీడర్లలో ఒకరు అయిన చంద్రబాబుపై ఇంత క్రూరత్వం ఎందుకు చూపించారు ? ఇలాంటివి కేంద్రం మద్దతు లేకుండా జరుగుతాయా ?. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో కనీస ఆధారాలు లేవని తెలుస్తున్నా కోర్టుల్లోనూ చంద్రబాబుకు ఊరట దక్కకపోవడం .. రాజమండ్రి సెంట్రల్ జైల్లో పాతిక రోజులుగా ఉండటం సాధ్యమేనా ? అన్న ప్రశ్న వినిపిస్తోంది.ముఖ్యమంత్రి, మంత్రులు పాలసీలు చేస్తారు. వాటిని లోపాల్లేకుండా అధికారులు అమలు చేస్తారు. ప్రజాస్వామ్యంలో ఇది మొదటి పాఠం. మరి ఇక్కడ అధికారులు అందరూ సేఫ్ గా ఉన్నారు. కానీ ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబును మాత్రమే ఎందుకు అరెస్టు చేసి జైలుకు పంపించారు ? ఇది సామాన్యుడికే కాదు.. రాజకీయంగా ముఖ్య నేతలకూ వస్తున్న సందేహం. న్యాయస్థానాల్లోనూ ఎందుకు ఊరట దక్కడం లేదన్నది సామాన్యుడికి పెద్ద మిస్టరీగా మారింది. ప్రభుత్వం కొన్ని వివరాలు చెబుతోందని..అత్యధిక సమాచారం దాచి పెడుతోందని ఆరోపణలు వస్తున్నా కేంద్రం వైపు నుంచిపెద్దగా స్పందన ఉండటం లేదు. ఓ ప్రతిపక్ష నేతను అరెస్టు చేశారు. అప్పుడే ఆయన కుమారుడ్ని కూడా అరెస్టు చేస్తామని వైసీపీ నేతలు బెదిరిస్తున్నారు. ఒకటికి నాలుగు కేసులు పెట్టారు. ఆ కేసులపై ప్రజల్లో ఇప్పటికే విస్తృత చర్చ జరుగుతోంది. డాక్యుమెంట్లు అన్నీ పబ్లిక్ డొమైన్‌లో ఉన్నాయి. అదే సమయంలో నారా భువనేశ్వరి, బ్రాహ్మణిలను కూడా అరెస్టు చేస్తామని సోషల్ మీడియాలో వైసీపీ నేతలు బెదిరిస్తున్నారు. పవన్ కల్యాణ్ పేరునూ అరెస్టయ్యే వారి జాబితాలో తెచ్చారు. ఏపీలో ఇలాంటి పరిస్థితులు ఉన్నప్పుడు కేంద్రం ఎందుకు మౌనంగా ఉంటుందని ఎక్కువ మందికి వస్తున్న సందేహం. రాష్ట్రంలో పరిస్థితుల గురించి తెలిసి కూడా మౌనంగా ఉంటోందా లేకపోతే.. రాజకీయ కారణాలతో ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డికి పూర్తి మద్దతుగా నిలుస్తోందా అన్న సందేహాలు వస్తున్నాయి. అందుకే ఇలాంటి కీలక పరిణామాలు బీజేపీకి తెలియకుండా జరగవని.. ఖచ్చితంగా బీజేపీ మద్దతుతోనే జరుగుతోందన్న భావనకు వస్తున్నారు. చంద్రబాబు అరెస్టును ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి ముందుగానే ఖండించారు. తర్వాత తెలంగాణ నేతలు కిషన్ రెడ్డి, బండి సంజయ్, కే లక్ష్మణ్ ఖండించారు. రాజకీయ కక్ష సాధింపుల అరెస్టేనని మండిపడ్డారు. అయితే వీరి స్పందనలు ప్రజల్లో నమ్మకాన్ని కలిగించలేదు. జాతీయ నాయకత్వం వైపు నుంచి ఎవరూ స్పందించలేదు. రాష్ట్ర పరిణామాల పట్ల అసలు తమకేమీ తెలియదన్నట్లుగా ఉన్నారు. దీంతో తెలుగుదేశం పార్టీని లేకుండా చేయడానికి చంద్రబాబుతో పాటు ఆయన కుటుంబసభ్యులందర్నీ అరెస్టు చేయడానికి ప్లాన్ చేసుకున్నారని..ఇదంతా బీజేపీ కనుసన్నల్లో వైసీపీ చేస్తోందన్న అభిప్రాయానికి రాజకీయవర్గాలు వస్తున్నాయి. ఇది రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ బీజేపీకి ఇబ్బందికరంగా మారుతుందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

# కమలం ఎందుకిలా ?

తెలుగు ట్రాక్,హైదరాబాద్

భారతీయ జనతా పార్టీ అంతరంగం అంతుచిక్కడం లేదు. తెలుగు రాష్ట్రాల్లో బిజెపి వైఖరి సొంత పార్టీ శ్రేణులను విస్మయ పరుస్తోంది.తెలంగాణలో దూకుడుగా ఉన్న బండి సంజయ్ నాయకత్వాన్ని మార్చారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఈటెల రాజేందర్ కు సైతం కీలక పదవి ఇచ్చారు. ఎన్నికల సమీపించే కొద్దీ పార్టీ పరిస్థితి తీసికట్టుగా మారుతోంది. ఇక ఏపీలోనూ అదే పరిస్థితి. అదే కన్ఫ్యూజన్. రెండు చోట్ల అధికార పార్టీతో లోపాయికారీ ఒప్పందం చేసుకున్నట్టు ఆరోపణలు వినిపిస్తోంది.తెలంగాణలో బండి సంజయ్ మార్పు తర్వాత అద్భుతాలు జరుగుతాయని చెప్పుకొచ్చారు. అధికార బి ఆర్ ఎస్, విపక్ష కాంగ్రెస్ నుంచి బడా నేతలు క్యూ కడతారని ప్రచారం చేసుకున్నారు. కానీ మూడు నెలలు అవుతున్నా ఒక్కడంటే ఒక్క పెద్ద నేత సైతం చేరలేదు. గ్రౌండ్ లెవెల్ లో ఇతర పార్టీల్లో అవకాశం దక్కని వారు మాత్రమే బిజెపిలోకి వస్తున్నారు. అన్నింటికీ మించి బిజెపి నుంచి కీలక నాయకులు కాంగ్రెస్ వైపు చూస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కనీసం తెలంగాణలో రెండో స్థానం వస్తాది అనుకున్నారు.. కానీ కనీసం మూడో ప్లేస్ లో ఎక్కడ ఉంటుందో తెలియని స్థితిలో బిజెపి ఉంది. ఈ తరుణంలో తెలంగాణ ఎన్నికల కోసం ఓ జంబో కమిటీని ఏర్పాటు చేశారు.వివిధ రాష్ట్రాలకు చెందిన బిజెపి కీలక నాయకులు, కేంద్ర మంత్రులతో బిజెపి హై కమాండ్ ఓ కమిటీని ఏర్పాటు చేసింది. తెలంగాణ ఎన్నికల్లో అనుసరించాల్సిన తీరు, అభ్యర్థుల ఎంపిక, ఎలక్షన్ క్యాంపెయిన్ వంటి వాటిపై ఈ కమిటీ దృష్టి పెట్టనుంది. ఏపీ నుంచి బిజెపి మాజీ అధ్యక్షుడు సోమ వీర్రాజుకు ఈ కమిటీలో స్థానం దక్కడం విశేషం. అటు కర్ణాటక, తమిళనాడు, గోవాల నుంచి బిజెపి నాయకులకు ఈ కమిటీలో స్థానం దక్కింది. తెలంగాణ ఎన్నికల కమిటీలు ఇతర రాష్ట్రాల నాయకులకు చోటు ఇవ్వడం ఏమిటి అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.తెలంగాణ బిజెపి అధ్యక్ష బాధ్యతల నుంచి బండి సంజయ్ ని తప్పించారు. ఆయన హయాంలో భారతీయ జనతా పార్టీ తెలంగాణలో బలోపేతం అయిందని ఒక టాక్ ఉండేది. వచ్చే ఎన్నికల్లో అధికారానికి వచ్చే అవకాశం ఉందని.. లేకుంటే ప్రధాన ప్రతి పక్ష స్థానం అయినా దక్కే ఛాన్స్ ఉందని టాక్ నడిచింది. కానీ అనూహ్యంగా బండి సంజయ్ ను తప్పించి జాతీయ కార్యవర్గంలోకి తీసుకున్నారు. ఏపీ అధ్యక్షుడుగా ఉన్న సోము వీర్రాజును తప్పించారు. ఆయనకు మాత్రం మొండి చేయి చూపారు. ఇప్పుడు తెలంగాణ ఎన్నికల కమిటీలో సోము వీర్రాజుకు తీసుకున్నారు. బండి సంజయ్ ను ఎలా వినియోగించుకుంటారో తెలియడం లేదు. ఈ తరుణంలో తెలుగు రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ వ్యూహాత్మక తప్పిదానికి పాల్పడుతోందని విశ్లేషణలు వెలువడుతున్నాయి



# ఇప్పుడూ జమిలీ లేనట్టే

వన్ నేషన్ వన్ ఎలక్షన్‌కు అందరూ రెడీ అయిపోయారు. కానీ కేంద్రం మాత్రం వెనుకడుగు వేసింది. ఇప్పుడల్లా సాధ్యం కాదని లా కమిషన్ నివేదిక సిద్ధం చేసినట్లుగా ప్రకటించేసింది. ఇప్పటికిప్పుడు దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం కష్టమే అని రామ్ నాథ్ కోవింద్ కమిటీకి నివేదిక సమర్పించే అవకాశం ఉందని చెబుతున్నారు. జమిలి ఎన్నికలపై రిపోర్ట్ తయారు చేసి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంది. ఒకే దేశం, ఒకే ఎన్నిక పై లా కమిషన్ సెప్టెంబర్ 27న సమావేశమైంది. లా కమిషన్ ఛైర్మన్ జస్టిస్ రీతూరాజ్ అవస్తి నేతృత్వంలో ఈ భేటీ జరిగింది. ఢిల్లీ వేదికగా జరిగిన ఈ సమావేశంలో జమిలి ఎన్నికల సాధ్యాసాధ్యాలపై చర్చించారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో 8 మంది సభ్యులతో కూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది కేంద్రం. జమిలి ఎన్నికల సాధ్యాసాధ్యాలపై ఈ కమిటీ చర్చిస్తోంది. ఈ కమిటీ ఇచ్చే రిపోర్ట్ ఆధారంగానే కేంద్రం తదుపరి కార్యాచరణ ఉండనుంది. అయితే ఈ కమిటీకి కాలపరిమితిలేదు. అందుకే ఎప్పుడు నివేదిక ఇస్తుందో స్పష్టత లేదు. అసెంబ్లీ, పంచాయతీలు, మున్సిపాలిటీలు, లోక్‌సభ ఎన్నికలు ఒకేసారి నిర్వహించడం సాధ్యమవుతుందా లేదా ఈ కమిటీ నిర్ణయించనుంది. ఈ కమిటీకి లా కమిషన్ చేసే సిఫార్సులు కీలకం కానున్నాయి. ఏకకాల ఎన్నికలపై లా కమిషన్ నివేదిక 2024 ఎన్నికలలోపు వెలువడుతుందని భావిస్తున్నారు. భారతదేశంలో వన్ నేషన్, వన్ ఎలక్షన్‌ను ఒకే చేసేందుకు లా కమిషన్ రాజ్యాంగ సవరణలను సూచించనుంది. 2024 ఎన్నికలకు ముందు ఒకే దేశం, ఒకే ఎన్నికలను తీసుకురావడం సాధ్యం కాదని కమిషన్ అంటోంది. అసెంబ్లీ ఎన్నికల నిర్వహణపై సూచనలను పొందుపరిచేందుకు ఓ రిపోర్ట్‌ను తీసుకురావాలి.



వన్ నేషన్ వన్ ఎలక్షన్‌పై లా కమిషన్ నివేదిక ప్రత్యేకంగా లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించినది. అన్ని స్థాయిల ఎన్నికలు ఒకే సారి నిర్వహించాలంటే లెక్కలేనన్ని సమస్యలు ఉన్నాయి. వాటికి పరిష్కారాలు చూపడం అంత తేలిక కాదన్న వాదన వినిపిస్తోంది. వన్ నేషన్, వన్ ఎలక్షన్‌పై లా కమిషన్ ఇలా చెప్పింది.. "వన్ నేషన్, వన్ ఎలక్షన్‌పై నివేదికను ఖరారు చేయడానికి సంబంధించి సంప్రదింపుల కోసం మరికొన్ని సమావేశాలు అవసరం. కొన్ని రాజ్యాంగ సవరణలు చేయాల్సి ఉంటుంది. ఇవన్నీ వన్ నేషన్, వన్ ఎలక్షన్ ప్రక్రియను సులభతరం చేస్తాయని తాము నమ్ముతున్నాము.." అంది."వన్ నేషన్, వన్ ఎలక్షన్ ప్రధాన ప్రయోజనాల్లో ఒకటి, ప్రజలు తమ నాయకులను మరింత తెలివిగా ఎన్నుకుంటారు. ఎందుకంటే ఎన్నికలు తగినంత సమయం తర్వాత జరుగుతాయి. అందువల్ల ప్రజలు పెద్ద సంఖ్యలో ఓటు వేయరు.. బదులుగా, మేము దీన్ని మరింత అవగాహనతో చేస్తాములోక్‌సభ, అన్ని అసెంబ్లీలు, స్థానిక పంచాయతీలు, మున్సిపాలిటీలకు కూడా ఒకేసారి ఎన్నికలు నిర్వహించే అంశాలపై చర్చించేందుకు మోదీ ప్రభుత్వం సెప్టెంబర్ 2న ఒక కమిటీని ఏర్పాటు చేసింది.ఇందులో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఈ కమిటీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, లోక్‌సభలో కాంగ్రెస్ నాయకుడు అధీర్ రంజన్ చౌదరి, కేంద్ర మాజీ మంత్రి గులాం నబీ ఆజాద్, 15వ ఆర్థిక సంఘం మాజీ చైర్మన్ ఎన్‌కే సింగ్, లోక్‌సభ మాజీ ప్రధాన కార్యదర్శి సుభాష్ ఉన్నారు. కశ్యప్, సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే, మాజీ చీఫ్ విజిలెన్స్ కమిషనర్ సంజయ్ కొఠారి. ఈ కమిటీ తొలి సమావేశం సెప్టెంబర్ 23న జరిగింది. ఈ సమావేశంలో ఇతర పార్టీల అభిప్రాయాలను సేకరించాలని నిర్ణయించారు. దేశంలో ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించే అంశంపై సూచనలు చేసేందుకు గుర్తింపు పొందిన జాతీయ పార్టీలు, రాష్ట్రాల్లోని అధికార పార్టీలు, పార్లమెంట్‌లో ప్రాతినిథ్యం ఉన్న పార్టీలు, ఇతర గుర్తింపు పొందిన ప్రాంతీయ పార్టీలను ఆహ్వానించాలని కమిటీ నిర్ణయించింది.ఏదైనా ఒక్క సారే ఎన్నికలు పెట్టగలరు కానీ.. తర్వాత మళ్లీ.. మధ్యలో ఎన్నికలు పెట్టాల్సిన పరిస్థితి వస్తుందని.. భారత ప్రజాస్వామ్యంలో ఉపఎన్నికలు? మధ్యంతర ఎన్నికలు.. ప్రభుత్వాలు కూలిపోవడం వంటివి కామన్ అని చెబుతున్నారు. అందుకే జమిలీ ఎన్నికలపై బీజేపీ మరోసారి గెలిస్తే కొత్త ప్రయోగాలు చేసే అవకాశం ఉంది.

### చంద్రబాబు స్పెషల్ లీవ్ పిటిషన్‌పై

# విచారణ మూడో తేదీకి వాయిదా



తెలుగు ట్రాక్,న్యూ ఢిల్లీ

;స్కిల్ డెవలప్‌మెంట్ స్కీం కుంభకోణం కేసు నమోదు చేయడాన్ని సవాల్ చేస్తూ టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌పై దేశ అత్యున్నత న్యాయస్థానం విచారణను అక్టోబర్ మూడో తేదీకి వాయిదా వేసింది. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ కింద గవర్నర్ అనుమతి తీసుకోకుండా తనపై ఏపీ సీఐడీ అధికారులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ చంద్రబాబు సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పీ దాఖలు చేశారు. అంతకుముందు చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను తిరస్కరిస్తూ గత వారం హైకోర్టు జస్టిస్ కే శ్రీనివాసరెడ్డి తీర్పు ఇచ్చారు. హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పీ దాఖలు చేశారు.తొలుత చంద్రబాబు పిటిషన్‌పై విచారణ చేపట్టడానికి సుప్రీంకోర్టు జస్టిస్ ఎస్వీఎన్ భట్టి విముఖత ప్రదర్శించారు. దీంతో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ వద్ద చంద్రబాబు క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి ఆయన తరఫు న్యాయవాది సిద్ధార్థ లుథ్రా ప్రస్తావించారు. తక్షణం కేసు లిస్టింగ్ చేయాలని కోరారు. చంద్రబాబు బెయిల్ కోరుకుంటున్నారా అని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రశ్నించినప్పుడు.. తాము బెయిల్ కోరుకోవడం లేదని లుథ్రా అన్నారు.'చంద్రబాబు దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను త్వరితగతిన కేసు లిస్టింగ్ చేయాలని మా తొలి అభ్యర్థన. మధ్యంతర రిలీఫ్ కల్పించాలని రెండో అప్పీల్. అవినీతి నిరోధక చట్టంలోని 17ఏ సెక్షన్ అంటే కేసు మూలాలపై చర్చించాల్సిన అంశం. ఎఫ్ఐఆర్ ప్రకారం చంద్రబాబును కస్టడీలో పెట్టదగిన కేసు కాదు. మేం బెయిల్ కోరుకోవడం లేదు' అని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు సిద్దార్థ లుథ్రా తెలిపారు.'దిగువ కోర్టు న్యాయమూర్తిని సంయమనం పాటించాలని చెప్పలేం. జడ్ క్యాటగిరీ, ఎన్ఎస్‌జీ సెక్యూరిటీ గల వ్యక్తిని ఇలా ట్రీట్ చేస్తారా.. ఇది పూర్తిగా వ్యక్తిగత స్వేచ్ఛతో కూడిన అంశం. యశ్వంత్ సిన్హా కేసులో వ్యక్తి స్వేచ్ఛపై అన్ని విషయాలు చేర్చారు. కానీ ఈ కేసులో చంద్రబాబును కస్టడీకి అప్పగించాలని ఏపీ సీఐడీ పోలీసులు కోరుతున్నారు. దాని నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నాం' అని లుథ్రా వాదించారు.

# అంగుళ్ల కేసులో తీర్పు రిజర్వ్

తెలుగు ట్రాక్,విజయవాడ

చంద్రబాబునాయుడు చిత్తూరు జిల్లా పర్యటన సందర్భంగా అంగళ్లలో జరిగిన ఘర్షణల్లో చంద్రబాబుపై హత్యాయత్నం కేసు నమోదయింది. ఈ కేసులో బెయిల్ కోసం చంద్రబాబు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ పూర్తయింది. తీర్పును రిజర్వ్ చేశారు. అంగళ్ల కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ చంద్రబాబు నాయుడు ముందస్తు బెయిల్ కోసం పిటీషన్ దరఖాస్తు చేసుకున్నారు. రెండు వారాలుగా వాయిదా పడుతూ వస్తున్న కేసులో ఎట్టకేలకు వాదనలు పూర్తయ్యాయి. చిత్తూరు జిల్లా అంగళ్లలో చంద్రబాబు పర్యటన సందర్భంగా పెద్దయెత్తున ఘర్షణలు చెలరేగాయి. ఈ ఘర్షణలో పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు. దీనిపై చంద్రబాబుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటికే అనేక మంది టీడీపీ నేతలు అరెస్ట్ అయి జైలుకు వెళ్లారు. పుంగనూరు నియోజకవర్గంలోని అంగళ్లు కేసులో 79 మంది టిడిపి నేతలకు ఎపి హైకోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. టిడిపి ఎంఎల్‌సి రామ్ గోపాల్ రెడ్డిని తదుపరి విచారణ వరకు అరెస్ట్ చేయవద్దని ఆదేశించింది. బెయిల్ వచ్చిన వారు ప్రతి మంగళవారం నాడు పోలీస్ స్టేషన్‌కు హాజరు కావాలని ఆదేశించింది. ఇదే కేసుల్లో మరో 30 మంది టిడిపి నేతలు ముందస్తు బెయిల్ కోసం ఎపి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే తదుపరి ఆదేశాలు వచ్చే వరకు వీరిని అరెస్ట్ చేయవద్దని హైకోర్టు ఆదేశించింది. పుంగనూరు అంగళ్లు కేసులో అరెస్టైన టిడిపి నేతలు, కార్యకర్తలను చిత్తూరు, మదనపల్లె, కడప జైలులో ఉన్నారు. హైకోర్టు వీరికి బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుండి వీరంతా విడుదల అయ్యారు. ఆగస్టులో సాగునీటి ప్రాజెక్టులను ప్రభుత్వంనిర్లక్ష్యం చేసిందని ప్రాజెక్టుల టూర్‌కు చంద్రబాబు వెళ్లారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చంద్రబాబు పర్యటన సందర్భంగా అంగళ్లు, పుంగనూరులో అల్లర్లు జరిగాయి. టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. తంబళ్లపల్లి నియోజకవర్గంలోని అంగళ్లులో జరిగిన అల్లర్లకు సంబంధించి చంద్రబాబుపై ముదివేడు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఏ1గా చంద్రబాబు, ఏ2గా దేవినేని ఉమాలను చేర్చారు. టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టారంటూ వీరిపై కేసులు పెట్టారు. ఐపీసీ 120 బీ, 147, 148, 153, 307, 115, 109, 323, 324, 506 ఆర్/డబ్ల్యూ, 149 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. వైసీపీ వాళ్లు అల్లర్లు చేస్తే చంద్రబాబుపై కేసులు పెట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నాయి. కాగా, పుంగనూరులో ఇప్పటి వరకు 74 మంది టీడీపీ నేతలు, కార్యకర్తలను అరెస్ట్ చేశారు. అమర్ నాథ్ రెడ్డి, నల్లారి కిశోర్ కుమార్ రెడ్డిలతో పాటు మరి కొందరిపై కేసులు నమోదు చేశారు. వీరిలో దేవినేని ఉమ సహా పలువురికి హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.

# స్కిల్ డెవలప్ మెంట్ కేసులో మరో పిల్

తెలుగు ట్రాక్,విజయవాడ

చంద్రబాబు నిందితుడిగా ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌పై కోర్టులో పిటిషన్ల మీద పిటిషన్లు దాఖలువుతున్నాయి. అటు ఏపీ హైకోర్టు.. ఇటు విజయవాడ ఏసీబీ కోర్టులోనూ చంద్రబాబు తరపు లాయర్లు పిటిషన్లు వేస్తూనే ఉన్నారు. క్వాష్ పిటిషన్లు, బెయిల్ పిటిషన్లు, ముందస్తు బెయిల్ పిటిషన్లు.. ఇలా కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఇవి చాలవన్నట్టు.. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ కూడా స్కిల్ స్కామ్ కేసుకు సంబంధించిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ఏపీ హైకోర్టులో దాఖలు చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసును సీబీఐకి అప్పగించాలని పిల్ వేశారు. అయితే ఈ పిల్‌పై విచారణ జరిపేందుకు హైకోర్టు సీజే బెంచ్ అభ్యంతరం తెలిపింది. మరో బెంచ్‌కు బదిలీ చేయాలని ఆదేశించింది. దీంతో ఉండవల్లి అరుణ్‌కుమార్ వేసిన పిల్ మరో బెంచ్‌కు బదిలీ అవుతోంది.స్కిల్ డెవలప్‌మెంట్ కేసును సీఐడీతో కాకుండా సీబీఐతో విచారణ జరిపించాలని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ ఈనెల 22న ఏపీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఇవాళ ఏపీ హైకోర్టులో విచారణ జరగాల్సి ఉంది. దీంతో.. ఈ పిటిషన్ హైకోర్టు సీజే బెంచ్ ముందు వచ్చింది. కానీ... సీజే బెంచ్‌లోని జస్టిస్ రఘునందన్‌రావు నాట్ బిఫోర్ మి అన్నారు. దీంతో.. మరో బెంచ్‌కు బదిలీ చేయాలని రిజిస్ట్రార్‌కు ఆదేశాలు జారీ చేశారు సీజే. దీంతో.. పిల్ మరో బెంచ్‌కు బదిలీ కాబోతుంది..స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించింది మాత్రమే కాదని... రెండుమూడు రాష్ట్రాలకు విస్తరించి ఉన్నాయని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అంటున్నారు. ఆర్థిక పరమైన నేరంతోపాటు జీఎస్టీ ఎగవేత, నిధుల దుర్వినియోగం వంటి ఆరోపణలు ఉన్నాయన్నారు. ఈ కేసును ఇప్పటికే ఈడీ విచారిస్తున్న విషయాన్ని కూడా తన పిటిషన్‌లో పేర్కొన్నారు ఉండవల్లి అరుణ్‌కుమార్. ఇది.. పెద్ద స్కామ్ కనుక సీఐడీతో కాకుండా... సీబీఐతో ఎంక్వైరీ చేయించాలని ఆయన కోరుతున్నారు.స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ చంద్రబాబును ఈనెల 9న అరెస్ట్ చేసింది ఏపీ సీఐడీ. ప్రస్తుతం ఆయన రిమాండ్ ఖైదీగా రాజమండ్రి జైల్లో ఉన్నారు. అక్టోబర్ 5వ తేదీ వరకు చంద్రబాబుకు జ్యూడీషియల్ రిమాండ్ విధించింది

# ఆచితూచి టీడీపీ అడుగులు...

తెలుగు ట్రాక్,గుంటూరు

రాజకీయంగా ఎలా ముందుకెళ్లాలో తెలియక తెలుగుదేశం పార్టీ సతమతమవుతోంది.చంద్రబాబు చూస్తే జైల్లో ఉన్నారు. ఎన్నికలు చూస్తే సమీపిస్తున్నాయి. అటు కేంద్ర పెద్దల నుంచి సానుకూలత రావడం లేదు. అటు రాష్ట్ర బిజెపి సైతం ఒక ప్రకటన ఇచ్చి ఊరుకుంది. పోనీ బిజెపితో తెగ తెంపులు చేసుకుందామంటే దాని పర్యవసానాలు ఎలా ఉంటాయో అన్న భయం. దీంతో కక్కలేక మింగలేక తెలుగుదేశం పార్టీ శ్రేణులు సతమతమవుతున్నాయి.తెలుగుదేశం పార్టీ నాయకత్వం మాత్రం గుంభనంగా ఉంటోంది.ప్రస్తుతం భారతీయ జనతా పార్టీ దేశంలో స్ట్రాంగ్ గా ఉంది. పేరుకే ఎన్డీఏ సంకీర్ణ ప్రభుత్వం కానీ భాగస్వామ్య పక్షాల కంటే బిజెపికే అధిక ప్రాధాన్యం దక్కుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే అసలు ఎన్డీఏలో భాగస్వామ్యమైన పెద్ద పార్టీ అంటూ ఒకటి లేదు. కేవలం భవిష్యత్తు అవసరాలకే అన్నట్టు.. రాష్ట్రాల్లో చిన్నాచితక పార్టీలను బిజెపి చేరదీసింది. దీంతో ఎన్డీఏలో బిజెపి తప్పించి మరో స్ట్రాంగ్ పక్షం కనిపించడం లేదు.అందుకే ఎటువంటి భయం లేకుండా.. మిత్రపక్షాల నుంచి ఇబ్బందులు లేకుండా బిజెపి పాలన సాగించగలుగుతోంది.గతంలో వాజపేయి హయాంలో భారతీయ జనతా పార్టీ నేతృత్వంలో ఎన్డీఏ పాలక పక్షంగా ఉన్నా.. భాగస్వామ్య పార్టీల మాటే చెల్లుబాటు అయ్యేది. అప్పట్లో ఎన్డీఏ కన్వీనర్ హోదాలో చంద్రబాబు చక్రం తిప్పిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం నాటి పరిస్థితులను టిడిపి శ్రేణులు గుర్తు చేస్తున్నాయి. నాడు వాజపేయి ప్రభుత్వానికి సుస్థిరత కల్పించడంలో చంద్రబాబు క్రియాశీలక పాత్ర పోషించారని.. నాడు చంద్రబాబు ఆదుకోకుంటే బిజెపి అనేది ఒకటి ఉంటుందా? అని టిడిపి శ్రేణులు ప్రశ్నిస్తున్నాయి. అందుకే తక్షణం బిజెపి పెద్దలు కలుగజేసుకుని చంద్రబాబును రిలీజ్ చేయించాలని కోరుతున్నారు.అయితే నాటి పరిస్థితుల్లో బిజెపి ఉన్నట్టు.. ఇప్పుడు ఉందా అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ప్రధాని మోదీ నేతృత్వంలో బిజెపి బలీయమైన శక్తిగా మారింది. మోడీ శక్తిని అంచనా వేయడంలో ఫెయిల్ అయిన చంద్రబాబు గత ఎన్నికల్లో.. బిజెపికి ఎదురుగా నిలిచారు. మూల్యం చెల్లించుకున్నారు. ఇప్పటి పరిస్థితి కూడా అదే కారణం. అందుకే చంద్రబాబుతో పాటు టిడిపి శ్రేణులు సైతం బిజెపి విషయంలో ఒకటికి రెండు సార్లు ఆలోచన చేస్తున్నాయి. ఎదురుగా ఇండియా కూటమి కనిపిస్తున్నా.. బిజెపి పెద్దలనుంచి ఆదరణ లేకున్నా రాజకీయ నిర్ణయం తీసుకోలేకపోతోంది.






# టీడీపీ గూటికి బైరెడ్డి



తెలుగు ట్రాక్, కర్నూలు

వైసీపీకి మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర రెడ్డి ఫీవర్ పట్టుకుంది. మళ్లీ ఆయన టీడీపీ గూటికి చేరనున్నారు. ఇప్పటికే లైన్ క్లియర్ అయిపోయిందని పార్టీ శ్రేణులు చెబుతున్నారు. స్కిల్ డెవలప్ మెంట్ కేసులో చంద్రబాబు అరెస్టు కావడంతో ఆయన అధికారికంగా చేరిక ఆగిపోయింది. ఆయన బయటకు రాగానే, పార్టీ కండువా కప్పుకుంటారనే ప్రచారం జరుగుతోంది. దీంతో వైసీపీకి గడ్డు పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని తీవ్ర చర్చ సాగుతోంది.ఉమ్మడి కర్నూలు జిల్లా రాజకీయాల్లో శాసించిన కుటుంబాల్లో బైరెడ్డి కుటుంబం ఒకటి. మాజీ ఎమ్మెల్యే రాజశేఖర రెడ్డికి రాయలసీమలో మంచి ఫాలోయింగ్ ఉంది. నందికొట్కూరు సెగ్మెంట్‌లో 1994, 1999లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2004లో ప్రత్యర్థి గౌరు చరితా రెడ్డిపై పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో నందికొట్కూరు ఎస్సీకి రిజర్వ్ అయ్యింది. దీంతో బైరెడ్డి, గౌరు చరితా రెడ్డిలు పాణ్యంలో పోటీ పడ్డారు. కొన్ని అనివార్య కారణాల వల్ల 2012లో టీడీపీని వీడి ప్రత్యేక రాయలసీమ గళం అందుకున్నారు. ఆ సమయంలోనే రాయలసీమ పరిరక్షణ సమితిని స్థాపించారు.రాష్ట్ర విభజనను తీవ్రంగా వ్యతిరేకించి ప్రత్యేక రాయలసీమ కోసం పోరాటం అందుకున్నారు. రాష్ట్ర విభజన కారణంతో 2019 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. మిత్ర శత్రువులైన బైరెడ్డి, గౌరు వెంకటరెడ్డి పార్టీ కోసం కలిసి పని చేశారు. ఆ తర్వాత తన కుమార్తె డాక్టర్ బైరెడ్డి శబరితో పాటు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు.

# లైసెన్సులు మరో ఏడాది




తెలుగు ట్రాక్,విజయవాడ

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలోనే మద్యం షాపుల గడువు ముగియనుంది.. అక్టోబర్‌తో మద్యం దుకాణాల గడువు ముగుస్తుంది.. అయితే.. షాపులకు కాలాన్ని మరో ఏడాది పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది ఏపీ ప్రభుత్వం.. మద్యం షాపుల కాలపరిమితిని మరో ఏడాది పొడిగిస్తున్నట్టు జీవో ఎంఎస్ నెంబర్ 466ను జారీ చేశారు అబ్కారీ శాఖ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ రజత్ భార్గవ.. ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ ప్రతిపాదనల మేరకు ఈ ఏడాది కూడా గతేడాది లాగే 2,934 షాపులను కొనసాగిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.కాగా, ఎన్నికలకు ముందు వైఎస్ జగన్ ఇచ్చిన హామీ దశలవారీగా మద్యపాన నిషేధం.. కానీ, అది కార్యరూపం దాల్చలేదనే విమర్శలు గున్నాయి.. ఇదే సమయంలో.. ప్రైవేటు దుకాణాలను మూసి వేయించిన జగన్ సర్కార్.. నూతన లిక్కర్ పాలసీ తీసుకువచ్చి.. ప్రభుత్వమే మద్యం దుకాణాలు నడుపుతోంది.. అనేక రకాల నూతన బ్రాండ్ ల మద్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. మద్యం సామాన్యులకు దూరం చేయాలన్న ఆలోచనా..? ప్రభుత్వ ఆదాయం పెంచుకోవాలన్న తపనా..? అనే చర్చ తర్వాత విషయం.. కానీ.. ప్రభుత్వం మద్యం ధరలను అమాంతం పెంచేసింది.. బెల్టు షాపులను రద్దు చేసింది. విడతల వారీగా మద్యం దుకాణాలను, మద్యం విక్రయాలను తగ్గించడమే తమ టార్గెట్‌గా చెబుతున్నారు.. ప్రతి ఏటా 25 శాతం మద్య దుకాణాలను ఎత్తివేసే ప్రణాళికలను రూపొందించిన ప్రభుత్వం.. ఇప్పుడు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.. ఈ ఏడాది కూడా గతేడాది లాగే 2,934 షాపులను కొనసిగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొనడంపై విమర్శలు వినిపిస్తున్నాయి

# కడుతున్నారు-కూలుస్తున్నారు

## దుర్గగుడిలో అధికారుల వింత పోకడలు



తెలుగు ట్రాక్,విజయవాడ

అమ్మలగన్న అమ్మ కనకదుర్గమ్మ ఇంద్రకీలాద్రిపై కొలువై భక్తులపాలిటి కొంగు బంగారంగా పూజలను అందుకుంటుంది. కృష్ణాతీరంలో వేసిన దుర్గాదేవిని తెలుగు రాష్ట్రాలతో పాటు అమ్మవారి భక్తులు దర్శించుకుంటారు. దసరా ఉత్సవాల కోసం దుర్గమ్మ ఆలయం రెడీ అవుతుంది. అయితే కోట్లు ఖర్చు పెట్టి కట్టడం..కూల్చడం. దుర్గ గుడి అధికారుల తీరుపై జనం మండిపడుతున్నారు. ఓవైపు దసరా ఉత్సవాలు దగ్గర పడుతున్నాయి. మరోవైపు కొండచరియలు కూలి పడుతున్నాయి. వీటి సంగతి చూడకుండా..ఈ అనవసరపు పనులు, ఖర్చులు ఏంటని భక్తులు ప్రశ్నిస్తున్నారు.

రాజుల సొమ్ము రాళ్ల పాలు అంటారు. ఇప్పుడు బెజవాడ దుర్గమ్మ సొమ్ము కూడా రాళ్ల పాలవుతోంది. కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి కట్టిన రాతి కట్టడాలను కూల్చివేయడంలో దుర్గ గుడి అధికారులు బిజీబిజీగా కాలం గడుపుతున్నారు. ఎలాంటి ప్లాన్ లేకుండా 2016లో దుర్గ గుడి ఇంజినీరింగ్ విభాగం ఈ రాతి కట్టడాలను పెద్దఎత్తున కట్టించింది. ఇప్పుడు వాటిని కూల్చివేయిస్తున్నారు అధికారులు. దుర్గ గుడి మాస్టర్ ప్లాన్‌లో భాగంగానే పెర్గోలను కూల్చివేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. అప్పట్లో తొమ్మిది కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి మరీ విలువైన రాళ్లతో ఈ పెర్గోలను కట్టించారు అధికారులు. కట్టినప్పటి నుంచి ఈ పెర్గోలు నిరుపయోగంగానే పడి ఉన్నాయని చెబుతున్నారు. వీటి వల్ల ఏ ఉపయోగం లేదని, తాజాగా కూల్చివేత కార్యక్రమం ప్రారంభించారు అధికారులు.మాస్టర్ ప్లాన్‌లో భాగమే ఇదంతా అంటున్నారు వాళ్లు. వీటిని కూల్చడానికి మరో కోటి రూపాయలు ఖర్చయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. అప్పుడు కోట్ల రూపాయలు ఖర్చు చేసి వాటిని ఎందుకు కట్టారో, ఇప్పుడు మళ్లీ దుర్గమ్మ నిధులు భారీగా వెచ్చించి మరీ వీటిని ఎందుకు కూలుస్తున్నారో అంటూ భక్తులు మండిపడుతున్నారు. దసరా ఉత్సవాలు దగ్గర పడుతున్న సమయంలో ఏర్పాట్లపై కాకుండా కూల్చివేతలపై అధికారులు దృష్టి పెట్టడం విమర్శలకు తావిస్తోంది.మరోవైపు ఇంద్రకీలాద్రి దిగువన హైదరాబాద్ హైవేపై కొండ చరియలు విరిగిపడ్డాయి. వరుసగా రెండు రోజుల పాటు భారీగా కొండచరియలు విరిగిపడడంతో భక్తులతో పాటు ప్రజలు కూడా భయభ్రాంతులకు లోనయ్యారు. ఈ సంఘటన జరిగి 20 రోజులైనా భద్రతా పనులు ఇంకా పూర్తి కాలేదు. కొండ చరియలు విరిగిపడకుండా భద్రతా చర్యలు తీసుకోవడంతో పాటు, అమ్మవారి కొండ మీద అంగరంగ వైభవంగా జరిగే దసరా ఉత్సవాల ఏర్పాట్లపై దుర్గ గుడి అధికారులు దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

==

# అవినీతికి తావు లేకుండా పాలన



తెలుగు ట్రాక్,విజయవాడ

వరుసగా ఐదో ఏడాది ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి వాహన మిత్ర నిధులను విడుదల చేశారు. విజయవాడలో బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారు. ఈక్రమంలోనే ఆటో డ్రైవర్లు అందజేసిన ఖాకీ చొక్కాను ధరించారు. బతుకు బండిని లాగడానికి ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల కోసమే ఈ పథకం ప్రారంభించినట్లు చెప్పారు. వాహనం ఇన్సూరెన్స్, ఇతర ఖర్చుల కోసమే వైఎస్సార్ వాహన మిత్ర అని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగానే సీఎం జగన్ మాట్లాడుతూ.. ఈ పథకం ద్వారా ఇచ్చిన డబ్బులను దేనికోసమైనా వాడుకోవచ్చని చెప్పారు. కానీ వాహనాల ఫిట్ నెస్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్ రెన్యూవల్ మాత్రం చేయించుకొని దగ్గర ఉంచుకోవాలని తెలిపారు. ఈరోజు మొత్తం రూ. 276 కోట్ల రూపాయలు జమ చేశామని దీని ద్వారా ఒక్కొక్కరికీ రూ.50 వేలు లబ్ధి జరుగుతోందన్నారు. వైఎస్సార్ వాహన మిత్ర పథకం అమలు చేస్తున్నందుకు గర్వపడుతున్నామని వెల్లడించారు. ఇది జగనన్న ప్రభుత్వం కాదని.. ఇది మీ అందరి ప్రభుత్వం అని వివరించారు. ఎంతో మంది ప్రయాణికులకు సేవలు అందించే ఆటో, క్యాబ్ డ్రైవర్లకు వైసీపీ సర్కారు ఎప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అలాగే పథకాలు అన్నీ అత్యంత పారదర్శకంగా అమలు చేస్తున్నామని సీఎం జగన్ తెలిపారు. అవినీతికి తావు లేకుండా వాలంటీర్ వ్యవస్థతో పాలనను ప్రజలకు చేరువ చేశామన్నారు. ఆర్బీకేలతో రైతులకు అండగా నిలిచామని.. పాదయాత్రలో మీ అందరి కష్టాలు చూశానంటూ చెప్పుకొచ్చారు. మీ సమస్యలకు పరిష్కారంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. రైతన్నకు రూ.30,985 కోట్లు వైఎస్సార్ రైతు భరోసా సాయం అందిస్తామన్నారు. మత్స్యకార కుటుబాలకు కూడా అండగా నిలిచామన్నారు. వాయిస్ ఆఫ్ వాయిస్ లెస్ అంటే పేదల గొంతుకై నిలబడిన ప్రభుత్వం తమదంటూ వివరించారు. చిరు వ్యాపారులకు రూ.2,965 కోట్లు సాయం అందించామన్నారు. అలాగే వైఎస్సార్ కాపు నేస్తంతో రూ.2,029కోట్లు, వైఎస్సార్ ఈబీసీ నేస్తంతో రూ.1257 సాయం అందించామని గర్వంగా తెలిపారు. మరోవైపు మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీఎం జగన్ హయాంలోనే విజయవాడ నగరం అభివృద్ధి చెందిందని చెప్పా?. రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టడం వల్ల వేలాది కుటుంబాలు నిశ్చితంగా ఉంటున్నాయని వివరించారు. అలాగే అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు, పార్కులు నిర్మించడం వంటి ఎన్నెన్నో అభివృద్ధి పనులు చేస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు

## రీ యాక్టివేషన్‌పై

# సన్నగిల్లుతున్న ఆశలు



తెలుగు ట్రాక్,బెంగళూరు

చంద్రునిపై రాత్రివేళ దగ్గర పడుతున్న కొద్ది భారత్ ప్రయోగించిన చంద్రయాన్-3 రీయాక్టివేషన్ ఆశలు సన్నగిల్లుతున్నాయి. సెప్టెంబరు 30న చంద్రుడిపై రాత్రి ప్రారంభం కానుంది. ఈ క్రమంలో అంతరిక్ష నౌకతో ఇస్రో మళ్లీ కమ్యూనికేషన్ ఏర్పాటు చేసుకునే అవకాశంపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్‌లతో కూడిన అంతరిక్ష నౌక సెప్టెంబర్ 2 నుంచి స్లీప్ మోడ్‌లో ఉంది. 14 రోజుల తరువాత చంద్రుని దక్షిణ ధ్రువంపై సూర్యోదయం అయింది. అప్పటి నుంచి స్లీప్ మోడ్‌లో ఉన్న రోవర్ ప్రజ్ఞాన్, లాండర్ విక్రమ్‌తో శాస్త్రవేత్తలు అనుసంధానమయ్యేందుకు అన్ని ప్రయత్నాలు చేశారు. శివశక్తి పాయింట్ వద్ద సూర్యకాంతి రాకతో వాటిని తిరిగి కార్యాచరణలోకి తీసుకురావడానికి ఇస్రో ప్రయత్నాలు చేసింది. అయితే అవేవీ ఫలితాన్ని ఇవ్వలేదు.శివ్‌శక్రి పాయింట్‌పై సూర్యకాంతి తిరిగి వచ్చినప్పటి నుండి ఇస్రో ల్యాండర్-రోవర్ ద్వయంతో కనెక్ట్ అవ్వడానికి ప్రయత్నిస్తోంది, కానీ ప్రయత్నాలు ఫలితాన్ని ఇవ్వలేదు. గతంలో ఇస్రో శాస్త్రవేత్త మాట్లాడుతూ.. చంద్రుడిపై రాత్రి పూట ప్రతికూల పరిస్థితులు ఉంటాయని అన్నారు. చంద్రయాన్ చంద్రుడిపై పరిస్థితులను తట్టుకుని ఒక రాత్రి బ్రతికితే, చరిత్ర సృష్టిస్తుందని, మరెన్నో రాత్రులను తట్టుకుంటుందని అభిప్రాయపడ్డారు. కానీ అది జరగలేదు. చంద్రుని రాత్రి సమీపిస్తున్న కొద్దీ విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్ యాక్టివేట్ అవుతాయనే ఆశలు మసకబారుతున్నాయి. చంద్రునిపై రాత్రి సమయం అత్యంత కఠినంగా ఉంటుంది. దాదాపు 14 భూమి రోజుల పాటు చంద్రుడిపై చీకటి కొనసాగుతుంది. ఆ సమయంలో అక్కడ తీవ్రమైన చలి ఉంటుంది. చంద్రుని ఉపరితలంపై ఉష్ణోగ్రతలు దాదాపు మైనస్ 180 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోతాయి. ఎంతటి సాంకేతిక పరికరమైనా పనికిరానిదిగా మారుతుంది. విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్‌కు ఇది ప్రతికూలంగా మారుతుంది. ఎందుకంటే ఆ రెండు సూర్యరస్మి ఆధారంగా పని చేస్తాయి. చంద్రుడిపై రాత్రి సమయంలో అక్కడి శీతల వాతావరణం ప్రభావానికి గురయ్యాయి. చంద్రుడిపై సూర్యోదయం అయినా తిరిగి యాక్టివేట్ అవలేదు. వాటితో కమ్యునికేషన్ ఏర్పాటు చేసేందుకు ఇస్రో తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఇన్ని ప్రయత్నాలు చేసినా అయితే రోవర్ ప్రజ్ఞాన్, లాండర్ విక్రమ్ నుంచి ఎటువంటి స్పందన లేదు. మిషన్‌లో ఉపయోగించిన పరికరాలు అక్కడి అతిశీతల పరిస్థితులను తట్టుకోలేకపోయాయని ఇస్రో శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. సమయం గడిచేకొద్ది అవకాశాలు మందగిస్తున్నాయని వెల్లడించారు.జూలై 14, 2023న ప్రయోగించిన చంద్రయాన్-3 మిషన్ ఇప్పటికే గణనీయమైన మైలురాళ్లను సాధించింది. చంద్రుడి దక్షిణ ధృవంపై ల్యాండ్ అయిన చంద్రయాన్ 3 లోని విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్ తమ ఖాతాలో మరో అద్భుతమైన విజయాన్ని సాధించుకున్నాయి. చంద్రుడిపై సౌత్ పోల్ పై తిరుగుతూ పరిశోధనలు చేస్తున్న ప్రజ్ఞాన్ రోవర్... చంద్రుడి పొరల్లో ఉన్న కెమికల్ ఎలిమెంట్స్, ఖనిజాలను కనుగొంది. ప్రజ్ఞాన్ రోవర్ లోని లిబ్స్ గా పిలుచుకునే లేజర్ ఇండ్యూస్డ్ బ్రేక్ డౌన్ స్పెక్ట్రోస్కోపిక్ ఇన్‌స్ట్రుమెంట్ సహాయంతో చంద్రుడిపై ఉన్న ఎలిమెంట్స్ ను కన్ఫర్మ్ చేసింది ఇస్రో. అన్నింటికంటే ముఖ్యంగా చంద్రుడి ఉపరితలంపై దక్షిణధృవంపై సల్ఫర్ నిల్వలు అధికంగా ఉన్నట్లు గుర్తించింది. అంత కంటే అద్భుతమైన విషయం ఏంటంటే చంద్రుడిపై ఆక్సిజన్ నిల్వలను కూడా గుర్తించింది ప్రజ్ఞాన్ రోవర్. అల్యూమినియం, కాల్షియం, క్రోమియం, మాంగనీస్, ఐరన్, సిలికాన్, టైటానియం నిల్వలను ధృవీకరించింది. హైడ్రోజన్‌ను సైతం వెతికే పనిలో ఉన్నామని ఇస్రో ప్రకటించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగానే దానికి సంబంధించిన రెస్పాన్స్ వేల్ లెంత్ గ్రాఫ్ ను విడుదల చేసింది.

# కుండ బద్దలు కొట్టేశారు

తెలుగు ట్రాక్,విజయవాడ

కొందరికి టిక్కెట్లు దక్కకపోవచ్చని వైసీపీ అధినేత జగన్ అన్నారు. టిక్కెట్ దక్కని వారికి మరో అవకాశం కల్పిస్తామని జగన్ హామీ ఇచ్చారు. తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో జరిగిన గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంపై జరిగిన సమీక్షలో ఈ వ్యాఖ్యలు చేశారు. టిక్కెట్ ఇవ్వకపోతే తన మనిషి కాకపోడని అన్నారు. ఈ సమావేశానికి మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర కో ఆర్డినేటర్లు, పార్టీ రీజనల్ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు. అనేక నియోజకవర్గాల్లో నేతల మధ్య విభేదాలు నెలకొన్నాయని వాటిని పరిష్కరించుకుని ఐక్యతగా ముందుకు వెళ్లాలని జగన్ నేతలను ఆదేశించారు. అందరు కలసి కట్టుగా పనిచేయాలని కోరారు. అందరూ ఐక్యంగా పనిచేస్తే 175 నియోజకవర్గాలకు 175 నియోజకవర్గాలు గెలుచుకోవడం పెద్ద కష్టమేమీ కాదని అన్నారు. ఇప్పటి వరకూ ఒక ఎత్తు.. రాబోయే ఆరు నెలలూ మరొక ఎత్తు అని అన్నారు. ఈ ఆరు నెలలు ఒళ్లు దగ్గరపెట్టుకుని పనిచేయాలని కోరారు. ఆరు నెలలు పనిచేస్తే మళ్లీ మనదే అధికారమని జగన్ తెలిపారు. క్షేత్రస్థాయిలో సానుకూల పరిస్థితులున్నాయన్న జగన్ విపక్ష పార్టీలు ఒంటరిగా పోటీ చేయలేక పొత్తుల కోసం వెళుతున్నాయని ఎద్దేవా చేశారు. అందరూ ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలని, ఎవరూ



భయపడాల్సిన పనిలేదని జగన్ నేతలకు చెప్పారు.. కొందరికి రాకపోవచ్చు. తన నిర్ణయాన్ని అందరూ గౌరవించాలని కోరారు. వచ్చే రెండు నెలల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఎవరెన్ని చెప్పినా వైసీపీ గెలుపు ఖాయమన్న జగన్ అలాగని నిర్లక్ష్యం చేయవద్దని హితవు పలికారు. ఈ ఆరు నెలలు జనంలోనే ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు పాటుపడాలని కోరారు. మనం గేర్ మార్చాల్సిన అవసరం ఉందని జగన్ అన్నారు. ఈ సందర్భంగా పనితీరు బాగాలేని ఎమ్మెల్యేలకు టిక్కెట్లు ఇవ్వబోనని జగన్ ప్రకటించడం ఎమ్మెల్యేల్లో కలవరం మొదలయింది. అయితే టిక్కెట్లు దక్కని వారు ఎవరన్నది మాత్రం బయటకు ఈ సమావేశంలో చెప్పలేదు.

# జగనన్న గేర్ మార్చేసారా

వచ్చే ఎన్నికల కోసం ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఇప్పటి నుంచే వ్యూహాలు మొదలుపెట్టారు. ఇప్పటి వరకు ఒక లెక్క ఇక నుంచి ఓ లెక్క అన్నట్టుగా వ్యూహాలకు పదును పెట్టారు. వచ్చే ఎన్నికల్లో 175 సీట్లకు గానూ 175 సీట్లు గెలవాలనే లక్ష్యంతో పని చేయాలని మరోసారి పార్టీ నేతలకు సీఎం జగన్ సూచించారు. 175 సీట్లు గెలవడం అసాధ్యమేమీ కాదని.. కొంచెం కష్టపడితే గెలవొచ్చని ధీమా వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో పార్టీ నేతలతో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంపై జగన్మోహన్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో.. పార్టీ నేతలకు కీలక సూచనలు చేశారు.ఇప్పటివరకు చేసిన కార్యక్రమాలు ఒక ఎత్తు.. రాబోయే కాలంలో చేపట్టే కార్యక్రమాలు మరో ఎత్తు అని నేతలకు జగన్ సూచించారు. వచ్చే 6 నెలలు ఎలా పనిచేస్తామన్నది చాలా ముఖ్యమని.. గేర్ మార్చాల్సిన సమయం వచ్చేసిందని దిశానిర్దేశం చేశారు. పార్టీ పట్ల, ప్రభుత్వం పట్ల క్షేత్రస్థాయిలో సానుకూల పరిస్థితులు ఉన్నాయన్నారు. ఇదే ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఇక నుంచి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని జగన్ సూచించారు.మనమంతా ఒక కుటుంబంలోని సభ్యులమేనన్న జగన్.. అసెంబ్లీ నియోజకవర్గాల్లో విభేదాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. టికెట్ల విషయంలో తన నిర్ణయాన్ని అందరూ స్వాగతించాలని జగన్ కోరారు. కొందరికి టికెట్లు ఇవ్వొచ్చు.. మరికొందరికి ఇవ్వకపోవచ్చన్న జగన్.. టికెట్లు ఇవ్వనంత మాత్రాన నిరాశ చెందొద్దని తెలిపారు. టికెట్లు రాని వారికి.. మరో అవకాశం కల్పిస్తామని చెప్పుకొచ్చారు. టికెట్ ఇవ్వనంత మాత్రాన వాళ్లు నా వాళ్లు కాకుండాపోరని తెలిపారు. నాయకునితో పాటు పార్టీ మీద నమ్మకం ఉండాలన్నారు. చివరి దశ సర్వేలు జరుగుతాయని.. వాటి ప్రకారం ప్రజల్లో ఎవరికి మంచి అభిప్రాయం ఉంటే వాళ్లకే టికెట్లు వస్తాయన్నారు. అందరూ ప్రజలతో మమేకం కావాలన్నారు జగన్.మరోవైపు.. రానున్న రోజుల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం, వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమాలు చేపట్టనున్నట్టు సీఎం ప్రకటించారు. జగనన్న సురక్ష కార్యక్రమం వల్ల ప్రజల్లో మంచి ఆదరణ వచ్చిందన్న జగన్.. దాదాపు 98 లక్షల సర్టిఫికెట్లు ఇచ్చామన్నారు. కాగా.. ఇప్పుడు ఆరోగ్య సురక్ష చేపడుతున్నామని తెలిపారు. ఆరోగ్యపరంగా ప్రతి ఇంటిని జల్లెడ పడతామని.. ఉచితంగా పరీక్షలు చేయటమే కాకుండా.. మందులు కూడా ఇస్తామన్నారు. అవసరమైన వారికి మెరుగైన చికిత్సలు కూడా అందిస్తామన్నారు. విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో చేయూతనిస్తామన్నారుఈ కార్యక్రమాన్ని మొత్తం 5 దశల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు సీఎం తెలిపారు. తొలి దశలో వాలంటీర్లు, గృహ సారథులు ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురించి వివరిస్తారని చెప్పుకొచ్చారు. ఇక.. రెండో దశలో ఏఎన్ఎంలు, సీహెచ్ఓలు, ఆశా వర్కర్లు ఇంటింటికి వెళ్లి పరీక్షలు చేస్తారన్నారు. మూడో దశలో.. వాలంటీర్లు, గృహ సారథులు ప్రజా ప్రతినిధులు క్యాంపు వివరాలు తెలియజేస్తారని తెలిపారు. నాలుగో దశలో గ్రామాల్లో క్యాంపులు ఏర్పాటు చేస్తామన్నారు. ఇక.. ఐదో దశలో అనారోగ్యంతో ఉన్న వారిని గుర్తించి వారికి నయం అయ్యే వరకు మెరుగైనా చికిత్సలు అందిస్తామని సీఎం వివరించారు.

# స్టీల్ ప్లాంట్ అమ్మకం ఆగినట్టేనా

తెలుగు ట్రాక్,విశాఖపట్టణం

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంపై భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు కీలక వ్యాఖ్యలు చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై యథాతథ స్థితి కొనసాగించే విధంగా కేంద్రం సంకేతాలు పంపించిందన్నారు. స్టీల్ ప్లాంట్ అమ్మకం ప్రక్రియ నిలిచిపోయిందని తెలిపారు. విశాఖ ఉక్కు పబ్లిక్ సెక్టార్ లో కొనసాగాలంటే లాభాల బాట పట్టించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల ఆస్తిగా ఉన్న పరిశ్రమ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. స్టీల్ ప్లాంట్ నష్టాలు, ఐరన్ ఓర్ మైనింగ్ ఇవ్వకపోవడం నరేంద్ర మోడీ ప్రభుత్వం చేసిందా..? అంటూ ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఇప్పుడిప్పుడే జరగదని జీవీఎల్ అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ అంశం ప్రధాని మోడీ దృష్టికి తీసుకెళ్తానని చెప్పిన ఆయన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను లాభసాటిగా నడిపించాలనేది తమ ప్రయత్నమన్నారు. స్టీల్ ప్లాంట్ 30 వేల మంది ఉద్యోగులది మాత్రమే కాదని, ప్రజల ఆస్తి అని జీవీఎల్ నరసింహారావు అన్నారు. యాజమాన్యం పట్టించుకోకపోవడం వల్లే స్టీల్ ప్లాంట్ నష్టాల్లో ఉందని ఆయన అన్నారు. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణకు కేంద్రం, మోదీనే కారణమని తప్పుడు ప్రచారాలు చేయవద్దని కార్మిక సంఘాలను కోరుతున్నట్లు జీవీఎల్ చెప్పారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే నడపాలని చూస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో గత మేనేజ్మెంట్ ఫెయిల్యూర్స్




కారణంగా ఇబ్బందులు తలెత్తాయని అన్నారు. బ్లాస్ట్ ఫర్నేస్-3ని ప్రారంభిస్తామని తెలిపారు. రాయబరేలిలో ఉన్న రైల్వే వీల్స్ ఫ్యాక్టరీ ద్వారా 2 వేల కోట్ల మూలధనం సమకూర్చే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. ముడిసరుకు ఇచ్చేందుకు ఔఓఆఅ సిద్ధంగా ఉందని ఎంపీ జీవీఎల్ తెలిపారు. ఔఓఆఅ ఆధ్వర్యంలో పిల్లేట్స్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వెల్లడించారు. అదే సమయంలో విశాఖ నుంచి వారణాసి ఎక్స్‌ప్రెస్ రైలు త్వరలోనే ప్రారంభం అవుతుందన్నారు. చాలా సందర్భాల్లో రైల్వే మంత్రిని కలిసి రైలు ఏర్పాటు చేయాలని కోరామని, రైల్వే బోర్డు నుంచి వారణాసికి ఎక్స్‌ప్రెస్ రైలు నడిపేందుకు ఆమోదం వచ్చిందన్నారు. వారానికి రెండు రోజులు నడిపేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో దీన్ని రోజువారి రైలుగా నడిపే అవకాశం ఉందన్నారు. విజయదశమి లోపు ప్రారంభించాలని కోరినట్లు తెలిపారు.ఎన్నికల ముందు కీలకమైన ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ అంశం వ్యతిరేకతను తీసుకుని రాకుండా బీజేపీ జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో రాష్టానికి వచ్చిన ఉక్కు శాఖ సహాయమంత్రి కులస్తే స్టీల్ ప్లాంట్ సందర్శించాల్సి ఉంది. యాజమాన్యం, కార్మిక సంఘాలతో వేరు వేరుగా సమావేశమై కేంద్రం నిర్ణయం వెల్లడించాలని భావించారు. అయితే పూర్తిస్థాయిలో ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్న కార్మికుల డిమాండ్ల నేపథ్యంలో కేంద్ర మంత్రి పర్యటన రద్దు అయ్యింది. ఈ అంశానికి సంబంధించిన వివరాలను ఎంపీ జీవీఎల్ మీడియాకు వివరించారు. మరో ఆరేడు నెలల్లో ఎన్నికలు రానున్నాయి. ఈ సమయంలో ప్రజా వ్యతిరేక నిర్ణయాలకు దూరంగా ఉండాలని బీజేపీ అధిష్టానం భావిస్తోంది. కర్ణాటకలో కాంగ్రెస్ చేతిలో దెబ్బతిన్నప్పటి నుంచి కేంద్రం ఆచితూచి అడుగులు వేస్తోంది. విపరీతంగా పెరిగిన పెట్రోల్, గ్యాస్ ధరలు ప్రతిపక్షాలకు ఆయుధాలుగా మారడంతో వాటి ధరలు తగ్గించేందుకు కేంద్రం చర్యలు చేపట్టిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే ఇటీవల గ్యాస్ ధరలను 200 తగ్గిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుందని సమాచారం. తాజాగా విశాఖ స్టీల్ ప్లాంట్ నిర్ణయం కూడా అందులో భాగంగానే తీసుకున్నట్లు చర్చ సాగుతోంది.

# ఏపీ సెక్రటేరియెట్‌లో రివర్షన్

తెలుగు ట్రాక్,గుంటూరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. సెక్రటేరియట్ ఉద్యోగులకు షాకిచ్చింది. 50 మందికి కల్పించిన పదోన్నతులను వెనక్కి తీసుకుంది. సచివాలయంలో సెక్షన్ అధికారులుగా పని చేస్తున్న 50 మందికి...కొద్ది రోజుల క్రితం అసిస్టెంట్ కార్యదర్శులుగా పదోన్నతులు కల్పించింది. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్న ప్రభుత్వం వారిని ఇన్‌ఛార్జి అసిస్టెంట్ సెక్రటరీలుగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం అసిస్టెంట్ సెక్రటరీల నుంచి రివర్షన్ పొందిన 50మంది సెక్షన్ ఆఫీసర్లను ఇన్‌ఛార్జిలుగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. గతంలో అసిస్టెంట్ సెక్రటరీలుగా పదోన్నతులు కల్పించేందుకు ఏపీ సబార్డినేట్ సర్వీసు రూల్స్ లో ప్రభుత్వం మార్పులు చేసింది. ప్రస్తుతం రివర్షన్ పొందిన వారందరి సర్వీసును ఆన్ డ్యూటీగా పరిగణిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు. రివర్షన్ పొందిన 50 ఉద్యోగులను ఇన్‌ఛార్జి అసిస్టెంట్ సెక్రటరీలుగా నియమిస్తున్నట్లు ఆదేశాల్లో తెలిపారు. హైకోర్టు ఆదేశాలతో, గతంలో సెక్షన్ అధికారులకు ఇచ్చిన పదోన్నతుల్ని ప్రభుత్వం రివర్షన్ చేసింది. తాత్కాలిక ఇన్‌ఛార్జి కార్యదర్శులుగా కొనసాగుతున్న వారికి, సెక్షన్ ఆఫీసర్ల పేస్కేలు మాత్రమే వర్తిస్తుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది ప్రభుత్వం. హైకోర్టు తుది ఉత్తర్వుల మేరకే ఇన్‌ఛార్జి అసిస్టెంట్ కార్యదర్శుల భాద్యతలు ఉంటాయని ఆదేశాలు ఇచ్చింది. గత నెల గ్రామ, వార్డు సచివాలయాల్లో పని




చేస్తున్న 17 కేటగిరిల్లోని ఉద్యోగులకు ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. నాలుగేళ్ల క్రితం సచివాలయాల్లో విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్‌లుగా నియామకమైన వారిలో కొందరికి ప్రమోషన్లు ఇచ్చింది. హార్టికల్చర్ ఉద్యోగులకు అదే శాఖలో మండల స్థాయిలో కేటగిరి-1 హార్టికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్‌గా పదోన్నతులు కల్పించింది. వివిధ జిల్లాల్లో కేటగిరి-1 హార్టికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పోస్టులు మొత్తం 53 ఖాళీ ఉండగా వీటిని విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లతో భర్తీ చేసేందుకు సీఎం జగన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో పలు శాఖల ఆధ్వర్యంలో మె?త్తం 19 రకాల కేటగిరి ఉద్యోగులు పని చేస్తున్నారు. నాలుగేళ్ల క్రితం వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాలను తీసుకొచ్చింది. లక్షల్లో ఉద్యోగాల నియామకం చేపట్టింది. సచివాలయాల ఉద్యోగులకు ఏడాది క్రితం ప్రొబేషన్ ఖరారు చేసింది. దీంతో వీరందరూ ప్రభుత్వ ఉద్యోగుల మాదిరే పే స్కేలు అందుకుంటున్నారు. వీరిలో కొందరు మండల స్థాయిలో పనిచేసేందుకు ఇటీవల పదోన్నతులు పొందారు. మిగిలిన వారి ప్రమోషన్లకు సంబంధించి ప్రభుత్వం విధివిధానాలను ఖరారు చేస్తుంది.

# సచివాలయాల చుట్టూ నీలిమేఘాలు

తెలుగు ట్రాక్,విజయవాడ

రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటు, నిర్వహణపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) చేసిన వ్యాఖ్యలు ఏపీలో కలకలం రేపుతున్నాయి. సామాన్యులకు ప్రభుత్వ సేవలను క్షేత్రస్థాయిలో అందించేందుకని గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. కానీ ఇవి స్థానిక సంస్థల అధికారాలను లాగేసుకున్నాయని ఇలా చేయడం రాజ్యాంగ విరుద్ధమన్న వాదన వినిపిస్తోంది. 74వ రాజ్యాంగ సవరణ చట్టం పట్టణ స్థానిక సంస్థలకు రాజ్యాంగ హోదాను అందించింది. ఈ చట్టం భారత రాజ్యాంగంలోని 12వ షెడ్యూల్‌లో పేర్కొన్న 18 విధులు నిర్వహించేందుకు పట్టణ స్థానిక సంస్థలకు అధికారం ఇచ్చింది. వాటిలో 13 విధులను పూర్తిగాను, మూడు విధులను పాక్షికంగానూ నగర పాలక సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఇక పురపాలక / నగర పంచాయతీల విషయానికి వస్తే ఏడు విధులను పూర్తిగాను, ఐదు విధులను పాక్షికంగానూ అప్పగించింది. వార్డు, గ్రామ సచివాలయాల వ్యవస్థను 2019 జులై నుంచి నగర పాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో రాష్ట్రప్రభుత్వం అమలు చేయడం ప్రారంభించింది స్థానిక సంస్థలు ఎన్నికైన ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం లేకుండా రాష్ట్రప్రభుత్వ కనుసన్నల్లో... ప్రత్యేక అధికారుల పాలనలోనే మగ్గుతున్నాయి. ఎన్నికైన ప్రజాప్రతినిధులు, పౌరులను భాగస్వామ్యం చేయడం, పౌరులకు పాలనను చేరువ చేయడం స్థానిక స్వపరిపాలన ప్రధాన లక్ష్యం. రాష్ట్రంలో ఎక్కడా వార్డు కమిటీలను ఏర్పాటు చేయనే లేదు. ఇక పౌరులను భాగస్వామ్యం చేసే పరిస్థితి అసలు లేదు. ఇవి రెండూ చేపట్టకుండా వార్డు స్థాయిలో సచివాలయాల వ్యవస్థ రూపుదిద్దుకోవడం స్థానిక స్వపరిపాలనకు ఉద్దేశించిన రాజ్యాంగ స్ఫూర్తిని నీరుగార్చడమేనని కాగ్ చెప్పింది. గ్రామ/వార్డు సచివాలయాల వ్యవస్థకు చట్టబద్ధతపై ఇప్పటికీ స్పష్టత లేదు. కోర్టుల్లోనూ పిటిషన్లు దాఖలయ్యాయి. గ్రామ సచివాలయాల్లో అధికారాల్ని సర్పంచ్ లు, కార్యదర్శుల నుంచి వీర్వోలకు బదిలీ చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్ని హైకోర్టు కొట్టి వేసింది. ఏపీలో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తీసుకొచ్చిన గ్రామ సచివాలయాల్లో అధికారాలు ఎవరికి ఉండాలనే దానిపై గతంలో పలు వాదనలు జరిగాయి. చివరికి ప్రభుత్వం పంచాయతీ సర్పంచ్ లు, కార్యదర్శులకు ఉన్న అధికారాల్ని వీఆర్వోలకు కట్టబెట్టేందుకు వీలుగా జీవో నంబర్ 2 జారీ చేసింది. అయితే దీనిపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. పంచాయతీ రాజ్ వ్యవస్థ ఉండగా సచివాలయాల ఏర్పాటే తప్పిదమని, అలాంటిది వాటి అధికారాల్ని కూడా వీఆర్వోలకు కట్టబెట్టడం సరికాదనే విమర్శలు వచ్చాయి. అయినా ప్రభుత్వం అధికారాల బదిలీకే మొగ్గుచూపింది. చివరికి కోర్టు కొట్టి వేసింది. గ్రామీణ, పట్టణ ప్రజలకు 540 రకాల సర్వీసులను అందించేందుకు పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధిశాఖలతో పాటు గ్రామ/వార్డు సచివాలయాల శాఖకు కూడా చట్టబద్ధత కల్పించాలని గతంలో ప్రభుత్వం నిర్ణయించింది. 540 కంటే ఎక్కువ సేవలు అందించేందుకు గ్రామ/వార్డు సచివాలయాలకు వీలు కల్పిస్తూ పంచాయతీరాజ్, మున్సిపల్ వ్యవస్థలకు అనుబంధంగా సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. రాష్ట్రంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఒకే చోట సేవలను అందించే కేంద్రంగా పనిచేసేందుకు ఒక వ్యవస్థ ఏర్పాటు అత్యవసరమైనందున దీనిని తీసుకొచ్చినట్లు ఆర్డినెన్స్ జారీ చేశారు. ఆర్డినెన్స్ కాలపరిమితి తీరింది.




**గ్రామ సచివాలయాలను తప్పుపట్టిన కాగ్**

ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం లేకుండా తీసుకు వచ్చిన గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ ఏర్పాటు సరికాదని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ పేర్కొంది. 2020-21 ఆర్థిక ఏడాదికి సంబంధించిన నివేదికలను సమర్పించిన కాగ్.. వార్డు కమిటీలు లేకుండా వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు తన ఆడిట్ రిపోర్టులో వెల్లడించింది. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థల ఏర్పాటు పాలన వికేంద్రీకరణ కోసమే అని కాగ్ తన నివేదికలో పేర్కొంది. 2019 జులైలో ఈ వ్యవస్థను ఏపీ రాష్ట్ర సర్కారు తీసుకువచ్చింది. అయితే ఈ గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించిందని కాగ్ తెలిపింది. క్షేత్రస్థాయిలో ఏదైనా వ్యవస్థను ఏర్పాటు చేయడం అంటే స్థానిక స్వపరిపాలనను దెబ్బతీయడమే అని పేర్కొంది. స్వపరిపాలన సాధనకు ప్రజా ప్రతినిధులతో వార్డు కమిటీలను ఏర్పాటు చేయాలని కాగ్ సూచనలు చేసింది. 2019 ఫిబ్రవరి నుంచి అమరావతికి బడ్జెట్ తోడ్పాటు అందించలేదని కాగ్ తన 2020-21 రిపోర్టులో పేర్కొంది. నగర అభివృద్ధి నిధులకు రుణాల సేకరణే ప్రధాన వనరుగా నిర్ణయించినట్లు కాగ్ గుర్తు చేసింది. అమరావతి అభివృద్ధికి రూ. 33,476 కోట్ల సమీకరణ లక్ష్యంగా పెట్టుకున్నారని, ఏపీ సీఆర్డీఏ రూ. 8,540 కోట్లు మాత్రమే అప్పు చేసినట్లు తెలిపింది. రాజధాని నగర అభివృద్ధిపై విధాన మార్పుల వల్ల 2019 మే నుంచి అభివృద్ధి ప్రణాళికలో అనిశ్చితి నెలకొన్నట్లు పేర్కొంది. 55 ప్యాకేజీల పూర్తికి రూ. 28,047 కోట్లు అవసరమని కాగ్ తెలిపింది. అమరావతిలో భూ సమీకరణకు రూ. 2,244 కోట్లు ఖర్చు చేసినట్లు గుర్తు చేసింది. సమీకరించిన భూమి అభివృద్ధి లేకుండా నిరుపయోగంగా ఉన్నట్లు చెప్పింది. దీని వల్ల ల్యాండ్ పూలింగ్ స్కీమ్ లక్ష్యం నెరవేరలేదని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తన నివేదికలో పేర్కొంది. అమరావతి ప్రాంతంలో పనులు ఆపేయడం వల్ల నిధులు నిరుపయోగంగా ఉండిపోయాయని ప్రభుత్వ తీరును కాగ్ తప్పు బట్టింది. 2019 మే నెల నుంచి వివిధ పనులను నిలిపి వేశారన్న కాగ్ రిపోర్టు.. దీని వల్ల ఈ పనుల కోసం ఖర్చు చేసిన రూ.1505 కోట్లు నిరుపయోగం అయ్యాయని తెలిపింది. జలవనరుల పరిధిలో ప్రజా వేదికను నిబంధనలకు విరుద్ధంగా అనధికారికంగా కట్టారని.. ఆ తర్వాత దానిని కూల్చి వేయడం వల్ల రూ. 11.51 కోట్ల ప్రజాధనం వృథా అయిందని కాగ్ తన నివేదికలో పేర్కొంది. అమరావతి ప్రాంతంలో ల్యాండ్ పూలింగ్ భూముల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం రూ. 13,802 కోట్లు ఖర్చు చేయాలని ప్రతిపాదన ఉండగా.. దీనిలో 2021 నాటికి కేవలం రూ. 183 కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు కాగ్ గుర్తించింది. విశాఖలో 876 పరిశ్రమల్లో 70 పరిశ్రమలు సరైన అనుమతులు లేకుండా నడుస్తున్నట్లు కాగ్ తన రిపోర్టులో తెలిపింది. 2016 - 2021 మధ్య పలు అవకతవకలు జరిగినట్లు కాగ్ తన నివేదికలో పేర్కొంది. 2015-20 మధ్య కాలంలో రాష్ట్రానికి రావాల్సిన కేంద్ర గ్రాంట్లలో 129 కోట్ల తగ్గుదల.. 2016-18 మధ్య కాలంలో పని తీరు గ్రాంటులో 28.93 కోట్లకు కోత పడిందని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ తన నివేదికలో తెలిపింది.

## మరమ్మత్తుల కోసం

# నెలరోజుల పాటు బ్రిడ్జి మూసివేత

తెలుగు ట్రాక్,రాజమండ్రి

సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 26 వరకు రోడ్ కం రైల్ వంతెన మరమ్మత్తుల కోసం మూసివేయాలని నిర్ణయించారు. రోడ్ కమ్ రైల్ బ్రిడ్జ్ - తూర్పు గోదావరి జిల్లా - సెంట్రల్ క్యారేజ్‌వేకి మరమ్మతులతో పాటు వయాడక్ట్ భాగం, అప్రోచ్‌లతో సహా దెబ్బతిన్న సెకండరీ జాయింట్లకు మరమ్మతులు చేయనున్నారు. దాంతో నెల రోజులపాటు రోడ్ కం రైల్ బ్రిడ్జి మూసివేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ డా కె. మాధవీలత తెలిపారు. సెప్టెంబర్ 27 బుధవారం నుంచి అక్టోబర్ 26 వరకు నెల రోజులపాటు రోడ్ కం రైల్ బ్రిడ్జిపై ట్రాఫిక్‌ను మళ్లించడానికి జిల్లా ఆర్ అండ్ బి అధికారి అభ్యర్థించారు. ఈ క్రమంలో ఈ వంతెనపై పూర్తిగా



మేరకు ట్రాఫిక్ మళ్లింపు చేయనున్నట్లు కలెక్టర్ మాధవీలత తెలిపారు. ప్రస్తుతం ఉన్న రోడ్- కమ్- రైల్ బ్రిడ్జి (అప్రోచ్‌లతో సహా) యొక్క క్యారేజ్‌వే బాగా దెబ్బతినడం వల్ల, మరమ్మత్తు పనులకు సులువుగా ఉండేలా తక్షణ పునరుద్ధరణ కోసం వాహనాలను దారి మళ్లించాలని అధికారులు భావించారు. మరమ్మతులు త్వరగా పూర్తి చేసేందుకు, ఏ ఇబ్బంది కలగకూడదని వాహనాల రాకపోకలను పూర్తిగా నెల రోజుల పాటు నియంత్రించాలని నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. రాజమండ్రి రోడ్ కం రైలు బ్రిడ్జికి మరమ్మతులు చేయడానికిగానూ వయాడక్ట్ భాగం, అప్రోచ్‌లతో సహా బి . టి. క్యారేజ్‌వే పునరుద్ధరణ చేయనున్నారు. 0 కి. మీ.ల నుంచి 4.473 కి.మీ.ల పొడవు దెబ్బతిన్న సెకండరీ జాయింట్ల వద్ద జియో గ్లాస్ గ్రిడ్‌లకు చెందిన ప్రత్యేక మరమ్మత్తు పనులు రూ.210 లక్షలతో చేపట్టనున్నట్లు తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తి అయింది. ఇప్పటికే మిల్లింగ్ మిషన్ తో బిటి సర్ఫేస్‌ను తొలగించడంతో పాటు మిగతా పనులు చేపట్టారు. కనుక ఈ మార్గంలో ట్రాఫిక్ నియంత్రించడంతో పాటు ప్రత్యామ్నాయ మార్గాలను ట్రాఫిక్ పోలీసులు సూచించనున్నారు. ఈ మేరకు తూర్పుగోదావరి పోలీసు సూపరింటెండెంట్, రాజమహేంద్రవరం, కొవ్వూరు ల నుంచి ట్రాఫిక్ మళ్లింపులో చర్యలు తీసుకోవాలని కోరారు. సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 26 వరకు వాహనాలు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లేలా అవసరమైన చర్య తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని విద్యా సంస్థలకు ఈ బ్రిడ్జి తాత్కాలిక మూసివేతపై ముందస్తుగా సమాచారం తెలియజేయాలని ఆదేశించారు. అందుకు అనుగుణంగా ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని కోరారు

# విశాఖకు రాజధాని శోభ

తెలుగు ట్రాక్,విశాఖపట్టణం

విశాఖ నగరం రద్దీగా మారుతోంది. బుగ్గ కార్లు రయ్ రయ్ మంటూ నగరంలో హోరెత్తిస్తున్నాయి. అప్పుడే విశాఖకు రాజధాని శోభ వచ్చేసిందా? అన్నంత రీతిలో వాహన శ్రేణి సందడి చేస్తున్నాయి. కాన్వాయ్ తో మంత్రులు, కీలక నేతలు హల్చల్ చేస్తున్నారు. విజయదశమి నుంచి విశాఖ నుంచి పాలన ఉంటుందని సీఎం జగన్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ తరుణంలో సాగర నగరానికి మంత్రుల తాకిడి పెరిగింది. విశాఖ ఎయిర్ పోర్ట్ నుంచి ఉదయం నుంచి సాయంత్రం వరకు కాన్వాయ్లు తిరుగుతూనే ఉన్నాయి. ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీస్ షిఫ్ట్ నేపథ్యం లో విశాఖలో యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు ప్రారంభం అయ్యాయి. ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీస్ షిఫ్టింగ్‌కు సంబందించి ఇటీవలి కేబినెట్ భేటీలో ముఖ్యమంత్రి ప్రస్తావన తెచ్చిన వెంటనే అలెర్ట్ అయిన అధికారులు వెంటనే ఏర్పాట్లపై దృష్టి సారించారు. వాస్తవానికి అధికారికంగా ఎలాంటి కమిటీ నియమించబడలేదు. నివాగృహాల కోసం రుషికొండ పరిసర ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న అపార్ట్మెంట్లు, విల్లాలను గుర్తించే పనిలో ఉన్నారు అధికారులు. ఆర్ కే బీచ్ రోడ్డు నుంచి రుషికొండ వరకు ఉన్న అపార్టుమెంట్లలో 150 ఫ్లాట్లను అద్దెకు తీసుకోవడానికి సిద్ధం అయింది ప్రభుత్వ యంత్రాంగం. ఆంధ్ర మెడికల్ కాలేజీలో డాక్టర్స్ క్వార్టర్స్ సమీపంలో నిర్మాణంలో ఉన్న 8 డూప్లెక్స్ ఇళ్లను తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. మరోవైపు ఇప్పటికే రాష్ట్ర మంత్రులు కొందరు విశాఖలో పలు ప్రాంతాల్లో స్థలాలను, విల్లాలను కొనుగోలు చేయగా, తాజాగా రోజా లాంటి మరికొందరు వెతుకులాటలో ఉన్నట్టు సమాచారం. మినిస్టర్ క్వార్టర్స్ కోసం ఆయా శాఖల్లోని ఖాళీ భవనాలు, అతిథి గృహాలను ఎంపిక చేస్తున్నారు అధికారులు. ఆర్టీసీ కాంప్లెక్సులో గతంలో ఖాళీగా ఉన్న ఫ్లోర్లను ఆధునీకరిస్తున్నారు. ఇందులో టూరిజం, ట్రాన్స్పోర్ట్ మంత్రుల కార్యాలయాలు, అదే సమయంలో రెన్నొవెట్ చేస్తున్న జెడ్పీ గెస్ట్ హౌజ్‌ను పంచాయతీ రాజ్ మంత్రిత్వశాఖకు, బీచ్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న అతిథి గృహాన్ని పట్టణాభివృద్ధి శాఖకు, ఈఎన్సీ కార్యాలయంలో ఇరిగేషన్ మంత్రికి, సింహాచలంలో ఎండోమెంట్స్ మంత్రికి కార్యాలయాలు కేటాయించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ముందుగా విశాఖ నగరంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలకు సంబంధించి విశాఖ అధికారులు ఒక లిస్ట్ తయారు చేయగా దానిపైనా సీఎస్ మీటింగ్‌లో ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. అధికారికంగా దీనిపై ఎలాంటి ధృవీకరణ లేనప్పటికీ ప్రస్తుతం విశాఖలోని ద్వారకా ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న జీవీఎంసీ ఆఫీస్‌ను అరిలోవ సమీపంలోని ముడసర్లోవకు తరలించాలని నిర్ణయించారు. అతి త్వరలో ఆ ఏర్పాట్లు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం ముడసర్లోవలో ఉన్న స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాన్ని ఇటీవల కమిషనర్ సాయికాంత్ వర్మ పరిశీలించారు. అదే సమయంలో జీవీఎంసీ కార్యాలయాన్ని మునిసిపల్ అడ్మిన్‌కు కానీ లేదంటే ఏదైనా ఇతర ప్రభుత్వశాఖకు కేటాయించే అవకాశాలను పరిశీలిస్తున్నారు. అదే సమయంలో సిరిపురం జంక్షన్‌లో ఉన్న వీఎంఆర్డీఏ భవనంలో ప్రస్తుతం 4 అంతస్తులు ఖాళీగా ఉన్నాయి, వాటిలో పలు ప్రభుత్వ శాఖలకు అవకాశం ఉంటుంది. అదే సమయంలో బీచ్ రోడ్‌లో సబ్ మెరైన్ మ్యూజియం సమీపంలో 30వేల స్క్వేర్ యార్డ్సలో స్మార్ట్ సిటీ భవనం, రుషికొండలో ఉన్న ఐటీహిల్‌లో ఏపీఐఐసీకి చెందిన మిలీనియం టవర్స్‌తో పాటు దాదాపు 2లక్షల చదరపు గజాల బిల్డింగ్ ఖాళీగా ఉంది. వీటిలో ఐటీ, ఇండస్ట్రీస్, ఇతర అనుబంధ శాఖలు వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఫైనాన్స్ డిపార్ట్మెంట్ కోసం కలెక్టరేట్ వెనుక కొత్తగా నిర్మించిన ఐదంతస్తుల భవనాన్ని కేటాయించనున్నట్లు సమాచారం. అయితే ఇప్పటికే దాదాపు మంత్రులంతా విశాఖలో ఇళ్లను కొనుగోలు చేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే సొంతిల్లు లేని వారు మాత్రం అద్దె ఇళ్ల కోసం అన్వేషిస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం వివిధ మంత్రిత్వ శాఖలకు విశాఖలో ఉన్న ప్రభుత్వ ఖాళీ భవనాలను సేకరించే పనిలో ఉంది. తొలుత సీఎం జగన్ తో పాటు కీలక మంత్రిత్వ శాఖల యంత్రాంగం విశాఖ రానున్నట్లు తెలుస్తోంది. దీంతో నగరంలో ప్రభుత్వ భవనాలకు ముందే రిజర్వ్ చేసి పెట్టేశారు. మరోవైపు రుషికొండలో నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. భవనాల నిర్మాణం తో పాటు రహదారులను ఏర్పాటు చేస్తున్నారు. ఓ ఆరు భవనాల్లో సీఎం క్యాంప్ ఆఫీస్ తో పాటు ఆయన నివాసం, కొన్ని కీలక శాఖలకు కూడా కేటాయింపులు ఉంటాయని ప్రచారం జరుగుతోంది. మరోవైపు నగరానికి అధికారుల తాకిడి కూడా పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి ఇటీవల నగరానికి వచ్చారు. ఏర్పాట్లను సమీక్షించి వెళ్లారు. పట్టుమని నెలరోజులు కూడా లేకపోవడంతో.. రేయింబవళ్లు పనులు చేపడుతున్నట్లు తెలుస్తోంది.

# ఏఐతో కూలీల పనులకు చెక్

తెలుగు ట్రాక్,గుంటూరు

ప్రపంచాన్ని ఒక ఊపు ఊపుతున్న సరికొత్త టెక్నాలజీ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్.. అన్ని రంగాల్లోనూ ఈ టెక్నాలజీ వాడేందుకు శరవేగంగా అడుగులు పడుతున్నాయి. వైద్య రంగంలో చికిత్స అందించేందుకు వాడే రోబోల్లోనూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వాడుతున్నారు. అయితే సరికొత్తగా వ్యవసాయ రంగంలోనూ దీనికి ప్రాధాన్యత ఉందని వ్యవసాయ శాస్త్ర వేత్తలు భావిస్తున్నారు. ఆ దిశగా ప్రయోగాలు చేస్తున్నారు. ఇదంతా చేస్తున్నది విదేశాలకు చెందిన శాస్త్రవేత్తలేం కాదు. మన దేశంలో, మన రాష్ట్రంలో వ్యవయసాయ రంగంలో పేరు గాంచిన ఆచార్య ఎన్జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్తలు.వ్యవసాయ రంగం ప్రస్తుతం తీవ్ర కూలీల కొరత ఎదుర్కొంటుంది. దీంతో వివిధ పనులు చేసేందుకు సకాలంలో కూలీలకు దొరక్క రైతులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా నాటు వేసేందుకు, కలుపు తీసేందుకు, కోత కోసేందుకు కూలీలు ఎక్కువ సంఖ్యలో అవసరం అవుతారు. అయితే ఒకే సమయంలో అంతమంది కూలీలు లభ్యంకాక రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. గత ఏడాదిలోనే ఎన్జి రంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు డ్రోన్లను అందుబాటులోకి తెచ్చారు. పురుగుమందుల పిచికారీ చేసేందుకు డ్రోన్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఏపిలో నాలుగు లక్షల ఎకరాల్లో డ్రోన్ల సాయంతో వ్యవసాయం చేస్తున్నారు. వీటితో పురుగు, కలుపు, తెగులు మందులు పిచికారీ చేయడంతో పాటు



యూరియా, డిఏపి వంటి ఫెర్టిలైజర్స్ ను చల్లుతున్నారు.అయితే ప్రస్తుతం వ్యవసాయ శాస్త్రవేత్తల దృష్టంతా రోబోలు తయారీపై ఉంది. ఈ రోబోల తయారీలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వినియోగించాలని నిర్ణయించారు. ఆ దిశగా ప్రయోగాలు చేస్తున్నారు. వ్యవసాయ విశ్వ విద్యాలయ శాస్త్రవేత్తలు ఇప్పటికే కలుపు తీసే రోబోలపై ప్రయోగాలు చేస్తున్నారు. అదే విధంగా పురుగు మందు చల్లేందుకు సాంప్రదాయ పద్ధతిలో అయితే రెండు గంటల సమయం పడుతుంది. అదే డ్రోన్లతో అయితే ఆరు నిమిషాల్లోనే ఎకర విస్తీర్ణంలో పురుగు మందు పిచికారీ పూర్తవుతుంది.ఇవే కాకుండా వాతావరణంలో ఎంత తేమ ఉంది, దాని వలన ఎటువంటి తెగుళ్లు రాబోతున్నాయి, భూసారం స్థాయి ఎంత వంటి అంశాల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు అంటున్నారు. భూసార పరీక్షల కోసం శాంపిల్స్ తీయడానికి ప్రస్తుతం సరిపడినంతా సిబ్బంది అందుబాటులో లేరు. ఈ క్రమంలోనే రోబోలను వినియోగిస్తే చాలా సులభంగా శాంపిల్స్ సేకరణ చేయవచ్చంటున్నారు.ఇప్పటికే సాగు పద్దతుల్లో రోబోను శాస్త్రవేత్తలు ప్రయోగాత్మకంగా పరీక్షించారు. సంప్రదాయ సాగు పద్దత్తులో రోబోను వినియోగించడం ద్వారా నాలుగైదు రెట్ల సామార్ధ్యంతో పనిచేసినట్లు శాస్త్రవేత్తలు నిర్ధారణకు వచ్చారు. దీంతో కూలీలు దొరక్కపోయిన సకాలంలో పంట కోయడానికి విత్తనం విత్తడానికి కలుపు, పురుగుమందులు పిచికారీ చేయడానికి రోబోలు ఉపయోగపడతాయి. ఈ క్రమంలోనే రోబోలను అందుబాటులోకి తెచ్చేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలు వడివడిగా అడుగులు వేస్తున్నారు. సాధ్యమైనంత త్వరలోనే ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ తో కూడిన రోబోలు మన వ్యవసాయ క్షేత్రాల్లో బుడిబుడి అడుగులు వేస్తాయని శాస్త్రవేత్తలు నమ్మకంగా చెబుతున్నారు

# షర్మిల ఒంటరి పోరేనా

తెలుగు ట్రాక్,హైదరాబాద్



కాంగ్రెస్ పార్టీలో వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ విలీనంపై ఎటూ తేలడం లేదు. సెప్టెంబర్ 30 కల్లా క్లారిటీ వస్తుందని షర్మిల ఆశాభావంతో ?న్నారు. కానీ కాంగ్రెస్ నుంచి ఎటువంటి సానుకూల సంకేతాలు రాలేదు. దీంతో ఒంటరి పోరుకు సిద్దమయ్యే అవకాశాలు ఉన్నాయి. తెలంగాణలో తన రాజకీయ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలనే ఉద్దేశంతో వైఎస్సార్‌టీపీని ఏర్పాటు చేసిన షర్మిల.. పార్టీని బలోపేతం చేయాలని పాదయాత్ర కూడా నిర్వహించి గట్టిగానే ప్రయత్నించారు. కానీ పెద్దగా బజ్ రాకపోడంతో తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసేందుకు సిద్ధమైపోయారు. వైఎస్ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉన్న డీకే శివకుమార్ ద్వారా కాంగ్రెస్ హైకమాండ్ కు ప్రతిపాదనపెట్టారు. రెండు, మూడు సార్లు ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ అధిష్టానంతో చర్చలు కూడా జరిపారు. కానీ విలీనం దిశగా ఇప్పటివరకు ఎలాంటి అడుగూ పడలేదు. షర్మిల వల్ల తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి ప్రయోజనం ఉండదని.. ఆమె చేరిక వల్ల బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ సెంటిమెంట్ ను మరోసారి రెచ్చగొట్టే అవకాశం ఉందని అందుకే చేర్చుకోవద్దని హైకమాండ్‌కు తేల్చిచెప్పేశారు. చివరికి కాంగ్రెస్ హైకమాండ్.. షర్మిలకు అటు ఓకే కానీ.. ఇటు నో అని కానీ చెప్పలేదు. అలా నాన్చడంతో షర్మిల తదుపరి ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలన్నదానిపై నిర్ణయం తీసుకోలేకపోయారు. కాంగ్రెస్‌కు సెప్టెంబర్ 30 వరకూ గడువిచ్చినా స్పష్టత లేదు. కాంగ్రెస్ పార్టీతో విలీనం లేదని తేలిపోవడంతో రాబోయే అసెంబ్లీ ఎన్నికలు పార్టీని సన్నద్ధం చేయాలని భావిస్తున్నారు. గతంలో వైఎస్ఆర్టీపీలో పని చేసి రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో పని చేసిన నాయకులను ఏకం చేసే పనిలో పడ్డారు. రాబోయే తెలంగాణ ఎన్నికల్లో 119 స్థానాల్లో ఒంటరిగా పోటీ చేయాలని షర్మిల భావిస్తున్నారు. కొన్ని నెలలుగా పార్టీలో ఎలాంటి కార్యక్రమాలు జరగకపోవడంతో చాలా మంది నాయకులు సైలెంట్‌గా ఉన్నారు. ఏపూరి సోమన్న లాంటి వాళ్లు బయటకు వెళ్లిపోయారు. ఇప్పుడు మరో కార్యక్రమంతో ప్రజల్లోకి వెళ్లాలని.. తానే స్వయంగా ఒకటి రెండు చోట్ల నుంచి బరిలోకి దిగాలని భావిస్తున్నారు. పాలేరు, ఎల్బీనగర్ నుంచి పోటీ చేస్తే ఎలా ఉంటుందని కూడా ఆలోచిస్తున్నారు. పార్టీ స్థాపించిన తర్వాత చేసిన సుదీర్ఘ పాదయాత్ర క్రెడిట్ అంతా.. విలీనం పేరుతో చేసిన రాజకీయంతో తుడిచిపెట్టుకొని పోయిందని పార్టీలో చర్చ జరుగుతున్నది. పైగా కాస్తో కూస్తో జనాల్లో తెలిసిన నాయకులు పార్టీని వీడి తమ దారి తాము చూసుకున్నారు. ఇప్పుడు షర్మిల పార్టీని మళ్లీ మొదటి నుంచి నిర్మించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే కాంగ్రెస్ వ్యూహకర్త సునీల్ కనుగోలు బృందం షర్మిలను సంప్రదిచిందని.. రెండు, మూడు రోజుల్లో షర్మిల ఢిల్లీకి వెళ్లే అవకాశం ఉందని వైఎస్ఆర్‌టీపీకి చెందిన కొన్ని వర్గాలు చెబుతున్నాయి.

# ఎంపీతో పరిణితి చోప్రా ఏడడుగులు



బాలీవుడ్ స్టార్ హీరోయిన్లలో ఒకరైన పరిణీతి చోప్రా ఎట్టకేలకు పెళ్లి చేసుకుంది. ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దాతో ఆమె ఏడు అడుగులు నడించింది. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో వీరి వివాహం జరిగింది. వీరి పెళ్లికి సుమారు 200 మందికి పైగా అతిథులు పాల్గొన్నారు. 50 మందికిపైగా వీఐపీలు పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించారు. రెండు ఫైవ్ స్టార్ హోటళ్లలో వీరి కోసం ప్రత్యేకమైన విడిది ఏర్పాట్లు చేశారు.పరిణీతి చోప్రా కజిన్ ప్రియాంక చోప్రా తన భర్తతో కలిసి తప్పకుండా పెళ్లికి హాజరవుతుందని అంతా భావించారు. అయితే, ఆమె చివరి క్షణంలో హ్యాండిచ్చింది. పెళ్లికి రాలేనని ముందుగానే ఆమె ఇన్‌స్టాగ్రామ్ ద్వారా హింట్ ఇచ్చింది. “మై డియర్ కజిన్.. నీకు నా ప్రేమ ఎప్పుడూ ఉంటుంది” అని పేర్కొంది. సెప్టెంబరు 23న జరిగిన సంగీత్‌కు కూడా ప్రియాంక హాజరు కాలేదు. పెళ్లిలో కూడా ఆమె కనిపించలేదు. లాస్ ఏంజెల్స్‌లో జరిగిన జైఉల్ఫ్ కాన్సెర్ట్‌లో పాల్గొవడం కోసమే ప్రియాంక చోప్రా.. పరిణీతి పెళ్లికి హాజరు కాలేదని తెలుస్తోంది. ఈ మేరకు ప్రియాంక.. ఆ కాన్సర్ట్‌లో ఎంజాయ్ చేస్తున్న వీడియో ఒకటి బయటకు వచ్చింది. దీంతో చెల్లి పెళ్లి కంటే ఆ కన్సెర్ట్ అంత ముఖ్యమైనదా అని అంటున్నారు. ఈ పెళ్లికి ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నేషనల్ కన్వీనర్ అరవింద్ కెజ్రీవాల్ కూడా హాజరయ్యారు. టెన్నీస్ ప్లేయర్ సానియా మిర్జా, క్రికెటర్ హర్భజన్ సింగ్, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, శివసేన నేత ఆదిత్య థాకరే తదితర ప్రముఖులు హాజరయ్యారు. వీరంతా ప్రత్యేకమైన బోటులో ఊరేగింపుగా పెళ్లి వేదిక వద్దకు చేరుకోవడం విశేషం. ఈ పెళ్లిలో పరిణీత.. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్ర రూపొందించిన పెళ్లి దుస్తులు ధరించింది.

# విశాఖలో మెరైన్ మ్యూజియం

తెలుగు ట్రాక్,విశాఖపట్టణం

ప్రకృతి సిద్ధమైన అందాలకు నెలవైన విశాఖ, సముద్ర సంబంధిత విజ్ఞానానికి ఆవాసం అని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. తూర్పు తీరంలో అత్యంత కీలకమైన సిటీ, తూర్పు తీర నౌకాదళ ప్రధాన కేంద్రం కావడంతో సముద్ర విజ్ఞాన శాస్త్రం, సముద్రంలో లభించే మత్స్య శాస్త్ర పరిశోధనలు, నేవికి సంబందించిన అనేక ప్రయోగాలు, పరిశోధనలు జరుగుతూ ఉండడం, వాటికి అనుబంధంగా మ్యూజియంలు ఏర్పాటు కావడం, విశాఖకు వచ్చే పర్యాటకులకు ఆ మ్యూజియంలను సందర్శించడం ద్వారా సముద్ర తీరంలో జరుగుతున్న అత్యద్భుత ఆవిష్కరణలు, అద్భుతాలను తెలుసుకునే అవకాశం కలుగుతుంది.అందుకే విశాఖలో ఇప్పటికే విజ్ఞాన్ని అందిస్తోన్న సబ్ మెరైన్ మ్యూజియం, నేవల్ మ్యూజియం, సీ హరియర్ మ్యూజియం లతో పాటు నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫి, సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ నాటికల్ అండ్ ఇంజినీరింగ్, సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ అండ్ ట్రైనింగ్ లాంటి సంస్థలు ఎన్నో ఉన్నాయి. వీటి ద్వారా నిరంతరం ఇక్కడ పరిశోధన, అభివృద్ధి జరుగుతూనే ఉంటుంది. తాజాగా నిర్మించిన మెరైన్ మ్యూజియం మరింత ఆకట్టుకుంటోంది.విశాఖ లోని ఫిషింగ్ హార్బర్ సమీపంలో ఉన్న ఇండియన్ ఫిషరీస్ రీసెర్చ్ సంస్థ లో అత్యాధునికంగా నిర్మించిన మెరైన మ్యూజియంను సోమవారం కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల ప్రారంభించారు. సువిశాల బంగాళాఖాతంలో లభ్యమయ్యే పలు రకాల మత్స్య సంపదను ఈ మెరైన్ మ్యూజియంలో ప్రదర్శనకు ఉంచారు. దీనిద్వారా సముద్రంలో లభ్యమయ్యే మత్స్య రాశుల గురించి తెలుసుకోవడమే కాకుండా జువాలజీ అభ్యసించే విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్ కు ఇది చాలా ఉపయోగకరంగా ఉండనుంది. ఈ మొత్తం మ్యూజియంలో అరుదుగా లభ్యమయ్యే సముద్రపు ఆవు చేప స్పెషల్ అట్రాక్షన్ గా నిలుస్తోంది. సముద్రపు పాము, మొసలి రకం సొరచేప,



కలివిందలు సొరచేప, అండమాన్ నికోబార్ దీవుల్లో దొరికే గర్నాడ్స్, తిమింగలాలు ఆళ్ళ రొయ్యలు, గుర్రపు డెక్క పీతలు, అన్నింటికంటే మనం అత్యంత అరుదుగా చూసే సముద్రపు దోసకాయ, సముద్రపు లాంతరు, సీ అశ్వని చేపలు ఇక్కడ మనకు ప్రదర్శనలో కనిపిస్తాయి.ఈ మెరైన్ మ్యూజియంలో దాదాపు 250 నమూనాల చేపలను ప్రదర్శనగా ఉంచడం విశేషం. సాధారణంగా ప్రతి ఏటా నవంబరులో ఫిషింగ్ హార్బర్ జెట్టీల్లో నిలిచి ఉండే సర్వే నౌకల్లో ఫిషరీస్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ వాళ్ళు ఎగ్జిబిషన్ లు ఈ తరహా చేపలను డిస్ ప్లే లో ఉంచుతూ విద్యార్థులకు ఆయా వెరైటీ లపై అవగాహన కల్పించే ప్రక్రియ చేస్తూ ఉంటుంది. మరోవైపు మత్స్య శాఖ ఈ మ్యూజియం నిర్వహణకు అత్యాధునిక పద్ధతులను అనుసరిస్తున్నారు. దశాబ్దాల క్రితం లభ్యమైన చేపల నమూనాలు డిస్టర్బ్ అవకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆయా రకాల చేపల్లో ఫార్మాలిన్ కలిపి భద్రపరుస్తున్నారు. అందుకోసం ప్రత్యేకంగా తయారుచేసిన గాజు జార్లను వినియోగిస్తున్నారు.

# గురుద్వార్‌లోకి నో ఎంట్రీ

తెలుగు ట్రాక్,న్యూఢిల్లీ

భారత్ కెనడా మధ్య వివాదం ఈ రెండు దేశాల్లోనే కాకుండా విదేశాల్లోనూ అలజడి సృష్టిస్తోంది. స్కాట్‌లాండ్‌లో ఇండియన్ హై కమిషనర్ విక్రమ్ దొరైస్వామిని గురుద్వారలోకి రానివ్వకుండా అడ్డుకోవడం సంచలనమైంది. బ్రిటీష్ సిక్కులు కొందరు ఆయనను అడ్డగించారు. "మిమ్మల్ని ఎవరూ ఆహ్వానించలేదు" అంటూ అక్కడి నుంచి వెళ్లిపోవాలని పట్టుబట్టారు. గురుద్వార కమిటీతో సమావేశమయ్యేందుకు విక్రమ్ దొరైస్వామి వచ్చినట్టు సమాచారం. కానీ...కొందరు సిక్కులు ఆయనను అడ్డగించారు. కొద్ది సేపు ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఆయన రావడంపై గురుద్వార కమిటీ కూడా విచారం వ్యక్తం చేసిందని అక్కడి సిక్కు కార్యకర్తలు కొందరు తేల్చి చెప్పారు. నిజానికి యూకేలో ఏ గురుద్వారలోకి అయినా భారతీయులున్ని రానివ్వడం లేదు. భారత్, బ్రిటన్ మధ్య సత్సంబంధాలే ఉన్నప్పటికీ...ఖలిస్థాన్ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య తరవాత బ్రిటన్‌లోని సిక్కుల్లో భారత్‌పై వ్యతిరేకత పెరిగింది. అందుకే ఇండియన్ హై కమిషనర్‌ని గురుద్వారలోకి రానివ్వకుండా ఇలా అడ్డుకున్నారు సిక్కులు. ఇప్పటికే భారత్, కెనడా మధ్య వివాదం ముదురుతోంది. ఇలాంటి సమయంలో ఈ ఘటన జరగడం మరింత ఆందోళన కలిగిస్తోంది. సిక్కులు విక్రమ్ దొరైస్వామిని అడ్డుకున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆయన వెళ్లిపోతుండగా కొందరు సిక్కులు వచ్చి కార్‌ని అడ్డగించారు. ఓ వ్యక్తి వాళ్లకు అడ్డుగా నిలిచాడు. విక్రమ్ దొరైస్వామి కార్ వెళ్లిపోయేంత వరకూ ఎలాంటి ఘర్షణ జరగకుండా చూశాడు. ఆ తరవాత ఆయన కార్ అక్కడి నుంచి వెళ్లిపోయింది. సిక్ యూత్ యూకే ఈ వీడియోని పోస్ట్ చేసింది. "విక్రమ్ దొరైస్వామిని ఎవరూ ఆహ్వానించలేదు. ఆయనే వచ్చారు. అందుకే సిక్కులు వచ్చి ఆయన్ని అడ్డుకున్నారు. కాసేపు ఘర్షణ జరిగింది. బహుశా గురుద్వార కమిటీ కూడా ఆయన ఆహ్వానం లేకుండా రావడంపై అసహనం వ్యక్తం చేసే ఉండొచ్చు. ఇక్కడే కాదు. యూకేలో గురుద్వారాల్లోకి భారతీయుల్ని రానివ్వడం లేదు. భారత్, యూకే తీరుతో ఇప్పటికే విసిగిపోయాం. హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య తరవాత బ్రిటీష్ సిక్కులంతా అప్రమత్తమయ్యారు"- బ్రిటీష్ సిక్కు యాక్టివిస్ట్ భారత్ కెనడా మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న క్రమంలో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో సత్సంబంధాలు కొనసాగించేందుకు కెనడా ఇప్పటికీ సిద్ధంగానే ఉందని వెల్లడించారు. నిజ్జర్ హత్య విషయంలో తాము భారత్‌పై చేసిన ఆరోపణలు చేసినప్పటికీ ద్వైపాక్షిక బంధం విషయానికొచ్చినప్పుడు వాటిని పక్కన పెట్టేస్తామని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా భారత్ ఎలాంటి ప్రభావం చూపిస్తోందో గమనిస్తున్నామన్న ట్రూడో...భారత్‌తో మైత్రి కొనసాగించడం తమకు ఎంతో ముఖ్యమని తేల్చి చెప్పారు. ఓ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఈ వ్యాఖ్యలు చేశారు

# భువనేశ్వరీ నిరాహారదీక్ష

తెలుగు ట్రాక్,రాజమండ్రి

టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ అక్టోబర్ 2న నారా భువనేశ్వరి నిరాహార దీక్ష చేయాలని నిర్ణయించారు. నంద్యాలలో చంద్రబాబును అరెస్ట్ చేసిన ప్రాంతంలోనే పొలిటికల్ యాక్షన్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశం అనంతరం భవిష్యత్తు కార్యాచరణను అచ్చెన్న ప్రకటించారు. ఆ రోజు నారా భువనేశ్వరి నిరాహారదీక్ష చేస్తారని ప్రకటించారు. చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ అక్టోబర్ 2 రాత్రి 7 గంటల నుంచి 7.05 వరకు ప్రతి ఇంట్లో లైట్లన్నీ ఆపేసి ప్రజలు నిరసన తెలపాలని కోరారు. లైట్లు ఆపి వరండాలో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపీ తెదేపా అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ, యనమల రామకృష్ణుడు, నక్కా ఆనంద్‌బాబు, అశోక్ బాబు, బీద రవిచంద్ర, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్దన్ రెడ్డి, వంగలపూడి అనిత తదితరులు పాల్గొన్నారు. టీడీపీ-జనసేన సంయుక్త కార్యాచరణ కమిటీ (జేఏసీ) ఏర్పాటు చేయాలని నేటి సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. ఈ జేఏసీ రాష్ట్రస్థాయిలో ఉంటుందని, ఇకపై ప్రభుత్వ వ్యతిరేక పోరాటాల్లో జనసేనతో సమన్వయం చేసుకుంటూ టీడీపీ కార్యకలాపాలు ఉంటాయని వివరించారు. లోకేశ్ పై సంబధం లేని ఆరోపణలు చేస్తున్నారని, అసలక్కడ ఇన్నర్ రింగ్ రోడ్డే లేనప్పుడు కేసు ఏంటని అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. పైగా, భూసేకరణ కూడా జరగలేదని వెల్లడించారు. ఏమీ జరగని చోట ఏదో జరిగిందనే భ్రాంతికి గురిచేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ పొలిటికల్ యాక్షన్ కమిటీ సమావేశానికి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఢిల్లీ నుంచి జూమ్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. పలు కీలక సూచనలు చేశారు. పీఏసీ కమిటీ టీడీపీ అధినేత చంద్రబాబుకు మద్దతు తెలిపిన, అరెస్ట్‌ను ఖండిస్తూ నిరసనలు చేస్తున్న వారికి పీఏసీ ధన్యవాదాలు తెలిపింది. చంద్రబాబు నాయుడు అరెస్ట్ అనంతరం ఇప్పటి వరకు జరిగిన కార్యక్రమాలు, తదుపరి చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. బాబుతో నేను కార్యక్రమంతో పాటు ఓటర్ వెరిఫికేషన్‌ను ఎలా ముందుకు తీసుకువెళ్ళాలని నిర్ణయించారు. ఇకపై జనసేనతో కలిసి కార్యక్రమాలు నిర్వహించే అంశంపై కూడా చర్చ జరుగింది. పవన్ కల్యాణ్ వారాహి యాత్రకు టీడీపీ పూర్తి మద్దతు ప్రకటించింది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వారాహి యాత్రలో టీడీపీ శ్రేణులు నేరుగా పాల్గొనే అవకాశం ఉంది. కేసులకు తాము భయపడేది లేదని నందమూరి బాలకృష్ణ సమావేశం అనంతరం స్పష్టం చేశారు. తప్పు చేయనప్పుడు దేవుడికి కూడా భయపడాల్సిన అవసరం లేదన్నారు. సీఎం జగన్ ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారని మండిపడ్డారు. ఏ ఆధారాలు లేకుండా చంద్రబాబును అరెస్టు చేశారని.. ఆయనపై స్కిల్ కేసును రాజకీయ కక్షతోనే పెట్టారని ఆరోపించారు.

# రాముడైనా,కృష్ణుడైనా ఎన్టీఆరే

తెలుగు ట్రాక్,ఖమ్మం

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారికి ఎన్టీఆర్ ఆరాధ్య దైవమని తెలంగాణ మంత్రి కేటీఆర్ అన్నారు. ఖమ్మంలోని లకారం ట్యాంక్ బండ్‌పై రూ.1.37 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ పార్క్ సహా విగ్రహాన్ని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌తో కలిసి కేటీఆర్ ఆవిష్కరించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ ఎంతో ఆప్తుడు విశ్వ విఖ్యాత నందమూరి తారక రామారావు అన్నారు. ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసిన మహా నాయకుడని... రాముడు ఎలా ఉంటాడో తెలియదు.. కృష్ణుడు ఎలా ఉంటాడో తెలియదు.. మాకు రాముడైనా, కృష్ణుడైనా ఆయనేనన్నారు. భారత దేశంలో తెలుగు వారంటూ ఉన్నారని గుర్తించేలా చేసింది ఎన్టీఆరేనని గుర్తు చేసుకున్నారు. చరిత్రలో మహనీయుల స్థానం ఎప్పటికీ చిరస్మరణీయంగా ఉంటుంది. ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించే అవకాశం రావడం నా అదృష్టం. నాకు తారక రామారావు పేరు ఉండటం చాలా సంతోషంగా ఉంది. తారక రామారావు పేరులోనే పవర్ ఉంది. ఎన్టీఆర్ శిష్యుడిగా కేసీఆర్ తెలంగాణ అస్తిత్వాన్ని దేశవ్యాప్తంగా చాటి చెప్పారు. దక్షిణ భారత దేశంలో అన్న ఎన్టీఆర్ సహా ఇప్పటివరకూ హ్యాట్రిక్ ఎవరూ కొట్టలేదన్నారు. ఎన్టీఆర్ పదవులకు వన్నె తెచ్చారని అన్నారు. ప్రజల్లో ఆయనకు ఉన్న పాపులారిటీ ముందు.. ఆయన అలకరించిన సీఎం పదవి చిన్నదని చెప్పుకొచ్చారు. తారక రాముడు ఆశీస్సులతో.. కేసీఆర్ ఆయన శిష్యుడిగా కేసీఆర్ రాజకీయ ప్రస్తానం ప్రారంభించారని అన్నారు. ఎన్టీఆర్



ఎన్నో శిఖరాలు అధిరోహించారని.. అయితే సీఎంగా హ్యాట్రిక్ కొట్టలేదని.. ఆయన వదిలిపెట్టిన పనిని కేసీఆర్ పూర్తి చేస్తారని అన్నారు.

దక్షిణ భారతదేశంలో ఏ సీఎం కూడా హ్యాటిక్ర్ కొట్టలేదని.. ఎన్టీఆర్ శిష్యుడిగా కేసీఆర్ హ్యాట్రిక్ కొడతారని ధీమా వ్యక్తం చేశారు. సీఎంగా కేసీఆర్ హ్యాటిక్ కొడితే.. ఎన్టీఆర్ ఆత్మ కూడా శాంతిస్తుందని మంత్రి కేటీఆర్ అన్నారు. ఖమ్మంలోని 'లకారం ట్యాంక్‌బండ్‌పై' కృష్ణుడి రూపంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేయాలనుకున్నారు. ఇందు కోసం దాదాపుగా వంద అడుగుల ఎన్టీఆర్ విగ్రహాన్ని రెడీ చేయించారు. ఈ విగ్రహావిష్కరణకు 'జూనియర్ ఎన్టీఆర్' ముఖ్య అతిథిగా పాల్గొనాల్సి ఉది. అయితే కొన్ని సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ కోర్టుకు వెళ్లాయి. తాగునీటిచెరువుగా ఉన్న లకారంలో విగ్రహం ఏర్పాటుచేస్తే నీరు కాలుష్యం అవుతుందని కొందరు హైకోర్టుకు వెళ్లడంతో విగ్రహావిష్కరణ చేయవద్దని కోర్టు స్టే విధించింది. అప్పుడు విగ్రహం ఆవిష్కరణను వాయిదా వేశారు. ముందుగా అనుకున్న ప్రకారం ఎన్టీఆర్ విగ్రహాన్ని లకారం చెరువులో కాకుండా ఆ చెరువు పక్కనే ఉన్న ప్రైవేటు స్థలంలో ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని కేటీఆర్ ఆవిష్కరించారుప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి ఎన్టీఆర్ ఆదర్శమన్నారు. రాముడు, కృష్ణుడు ఎలా ఉంటారో మనకు తెలియదు.. కానీ, బహుశా ఎన్టీఆర్ లాగే ఉంటారనుకునేవాళ్లమన్నారు. భారత దేశంలో తెలుగు వారంటూ ఉన్నారంటూ గుర్తించేలా చేసింది ఎన్టీఆరే అన్నారు. చరిత్రలో ఆయన పేరు చిరస్మరణీయంగా ఉంటుందన్నారు. తనకు ఎన్టీ రామారావు విగ్రహాన్ని ఆవిష్కరించే అవకాశం రావడం తన అదృష్టమని మంత్రి కేటీఆర్ అన్నారు. ఈ అవకాశాన్ని కల్పించినందుకు ధన్యవాదములు తెలిపారు. ఎందరు వచ్చినా ఎన్టీఆర్‌కు సాటిలేరని వ్యాఖ్యానించారు. తారకరామారావు అనే పేరులోనే ఏదో శక్తి ఉందన్నారు. ఎన్టీఆర్ శిష్యుడు కేసీఆర్ తెలంగాన అస్తిత్వాన్ని యావత్ దేశానికి చాటి చెప్పారని వ్యాఖ్యానించారు. దక్షిణ భారతావనిలో ఎన్టీఆర్ సహా ఎవరూ సీఎంగా హ్యాట్రిక్ కొట్టలేకపోయారని గుర్తుచేశారు. అయితే ఆయన శిష్యుడు సీఎం కేసీఆర్ వచ్చే ఎన్నికల్లో గెలిచి.. సీఎంగా హ్యాట్రిక్ కొడతారని ధీమా వ్యక్తంచేశారు. తద్వారా గురువు చేయలేని పనిని శిష్యుడు కేసీఆర్ సాధ్యం చేయబోతున్నారని మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# బాలినేనిపై అనుచరుల ఒత్తిడి

తెలుగు ట్రాక్,ఒంగోలు

బాలినేని పరిస్థితి ప్రత్యర్థి పార్టీ నేతలకు కూడా రాకూడదని అంటూ జాలిపడుతున్నారు సొంత పార్టీ నేతలు. పార్టీలో తగిన గౌరవం లేకపోవడం.. ఆ బాధను వెళ్లగక్కుతూ అల్టిమేటం జారీచేయడం.. ఇంతలోనే తాడేపల్లి నుండి పిలుపు రావడం.. అక్కడ బుజ్జగింపులు.. కాలరెగరేసుకుని బయటకు వచ్చినా పార్టీలో ప్రాధాన్యత విషయంలో షరామామూలు పరిస్థితి.. గత నాలుగేళ్లుగా బాలినేని పరిస్థితి పార్టీలో ఇలాగే కొనసాగుతోంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో బాలినేని శ్రీనివాస్ కీలక నేత. నాడు వైఎస్సార్.. నేడు జగన్ హయాంలోనూ ఓ వెలుగు వెలిగారు. అయితే, ఇదంతా వైసీపీ అధికారంలోకి రాకముందు మాట. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక బాలినేనికి ప్రాధాన్యత సంగతి అటుంచి కనీస గౌరవం, మర్యాదా కూడా లేకుండా పోయింది. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత బాలినేనికి మంత్రిగా అవకాశం ఇచ్చారు. అంతకు ముందు ఆయన మంత్రి పదవిని వదులుకొని జగన్ వెంట వచ్చారు. బహుశా అందుకే తొలి క్యాబినెట్ లో ఆయనకు అవకాశం దక్కింది. కానీ మంత్రి వర్గ విస్తరణలో బాలినేనిని మంత్రి పదవి నుంచి జగన్ తప్పించారు. అదే సమయంలో అదే ప్రకాశం జిల్లాకు చెందిన సురేష్ ను కేబినెట్ లో కొనసాగించారు. దీనిపై బాలినేని మనస్తాపానికి గురయ్యారు. దానిని బహిరంగంగానే వ్యక్తం చేశారు. అసంతృప్తి వ్యక్తం చేశారు. రోడ్డెక్కారు. చివరికి తాడేపల్లి ప్యాలస్ నుంచి పిలుపు వచ్చింది. బుజ్జగించారు. బాలినేని సర్దుకు పోయారు. ఇఖ అక్కడ నుండి వైసీపీలో ఆయనను పక్కన పెట్టేయడం ఆరంభమైంది. ఇది కాస్త తారాస్థాయికి చేరడంతో బాలినేని ఆ మధ్య అసంతృప్తికి లోనయ్యారు. కారణామేంటా అని ఆరాతీస్తే.. సొంత జిల్లాలో ఆయనకు ప్రాధాన్యత లేకపోవడంతో కినుకు వహించారని తేలింది. ఆఖరికి పోలీసులు, ఎమ్మార్వోలు, ముఖ్య అధికారుల బదిలీల విషయంలో కూడా ఆయనకు తెలియకుండానే అన్నీ జరిగిపోతున్నాయి. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా బయటకు చెప్పుకుని ఆవేదనకు గురయ్యారు. అప్పట్లో ఈ విషయంపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరిగింది. బాలినేని అసంతృప్తికి కారణం వైవీ సుబ్బారెడ్డే అని అందరికీ తెలిసిందే. నిజానికి సుబ్బారెడ్డి, బాలినేనికి ఇద్దరికీ సీఎం జగన్ తో బంధుత్వం ఉంది. జగన్ పార్టీ ఏర్పాటు నుంచి ఇద్దరూ కలిసే పార్టీ కోసం పని చేసారు. కానీ, తర్వాత ఇద్దరి మధ్య విబేధాలు తలెత్తి పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థాయికి చేరింది. అధిష్టానం సుబ్బారెడ్డికి ప్రాధాన్యత ఇవ్వడంతో బాలినేని అలకబూని మీడియాకెక్కారు. దీంతో అధిష్టానం పిలిచి బుజ్జగించడంతో అప్పటికి అది సమసిపోయింది. కానీ ఇప్పుడు మరోసారి బాలినేనికి అదే పరిస్థితి వచ్చినట్లు తెలుస్తుంది. తాజాగా బాలినేని ముఖ్య అనుచరులైన భవనం శ్రీనివాసరెడ్డి, పెద్దిరెడ్డి సూర్యప్రకాశ్ రెడ్డిలను పార్టీ సస్పెండ్ చేసింది. వీరిద్దరూ పర్చూరు, మార్కాపురం నియోజకవర్గాల్లో కీలకంగా వ్యవహరిస్తూ ఉంటారు. బాలినేనికి కనీసం సమాచారం కూడా ఇవ్వకుండానే వీరిని సస్పెండ్ చేశారు. ఈ చర్యలపై బాలినేని తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. తనకు కనీస సమాచారం ఇవ్వకుండా ఎలా సస్పెండ్ చేస్తారని ప్రశ్నించిన బాలినేని.. 48 గంటల్లోగా తన అనుచరులను తిరిగి పార్టీలోకి తీసుకోకపోతే డైరెక్ట్ గా జగన్ ను కలుస్తానని హెచ్చరికలాంటి అల్టిమేటమ్ జారీ చేశారు. అయితే, పరిస్థితి చూస్తే మాత్రం బాలినేనిరి పొమ్మనలేక పొగబెడుతున్నారనే చర్చ ఉమ్మడి ప్రకాశం జిల్లా రాజకీయ వర్గాలలో జోరుగా నడుస్తున్నది. ఇదంతా సీఎం జగన్ కు తెలిసే జరుగుతోందని కూడా అంటున్నారు. బాలినేనిని పక్కన పెట్టడం అనే కార్యక్రమం అంతా సీఎం కనుసన్నల్లోనే జరుగుతోందని అంటున్నారు. తాజాగా విజయసాయిరెడ్డిని ఈజిల్లాకు ఇన్ చార్జ్ గా నియమించారు. కానీ, బాలినేనికే ప్రాధాన్యం ఉంటుందని చెప్పిన అధిష్టానం.. బాలినేనే జిల్లాను చూసుకుంటారని కూడా చెప్పారు.కానీ పరిస్థితి చూస్తే మాత్రం తేడాగా కనిపిస్తుంది.

# లిక్కర్ స్కాంలో కవితకు ఊరట

తెలుగు ట్రాక్,న్యూఢిల్లీ

ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఈడీ విచారణ ఎదుర్కొంటున్న కవితకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. కవిత దాఖలు చేసుకున్న పిటిషన్‌పై విచారణ సుప్రీంకోర్టులో జరిగింది. ఈ సందర్భంగా తదుపరి విచారణను నవంబర్ 20వ తేదీకి వాయిదా వేశారు. అప్పటి వరకూ ఈడీ సమన్లు కూడా జారీ చేయవద్దని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీంతో ఈడీ విచారణ ఎదుర్కొనే అంశంలో కవితకు ఊరట లభించినట్లయింది. గత విచారణ సందర్భంగా ఈడీ ముందు మహిళల హాజరు అంశంపై కౌంటర్ అఫిడవిట్ దాఖలకు 10 రోజుల సమయం కోరింది ఈడీ. దీంతో కవితకు 10 రోజులపాటూ నోటీసులను వాయిదా వేసింది ఈడీ. ఇప్పుడు మరోసారి నవంబర్ ఇరవయ్యో తేదీ వరకూ వాయిదా వేయడానికి అంగీకరించింది. గతంలో లిక్కర్ కేసులో ఈడీ నోటీసులు అందుకున్న కవిత.. ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. అయితే.. ఈడీ కార్యాలయంలో మహిళల విచారణ సీఆర్పీసీకి విరుద్ధం అంటూ ఆమె మొదటి నుంచి వాదిస్తున్నారు. నళిని చిదంబరం తరహాలో ఇంటివద్దే తనను విచారణ జరపాలని ఆమె కోరుతున్నారు. ఈ క్రమంలో దర్యాప్తు సంస్థల తీరును తప్పుబడుతూ ఆమె సుప్రీంలో పిటిషన్ వేశారు.ఆ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ సాగుతోంది. అయినప్పటికీ ఈడీ మరోసారి నోటీసులు జారీ చేసింది. తన పిటిషన్ విచారణలో ఉండగా.. నోటీసులు ఎలా జారీ చేస్తారని ఈడీ తీరును ప్రశ్నించారామె. అంతే కాదు తాను విచారణకు రాలేనని ఈడీకి స్పష్టం చేశారు. కవిత బిజీగా ఉంటే నోటీసుల విషయంలో పది రోజుల సమయం పొడగిస్తామని గత విచారణలో ఈడీ కోర్టుకు తెలిపింది. ఈ క్రమంలో నేటితో పదిరోజుల గడువు ముగిసింది. ఇవాళ్టి విచారణ సందర్భంగా.. కవిత పిటిషన్‌పై విచారణ కొనసాగుతున్నందున తదుపరి విచారణలోపు ఎలాంటి నోటీసులు జారీ చేయొద్దని సుప్రీం కోర్టు, ఈడీకి స్పష్టం చేసింది. సిఆర్పిసి సెక్షన్ 160 ను ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ ఉల్లంఘించిందని కవిత తరపు న్యాయవాదులు గతంలో వాదించారు. చట్ట ప్రకారం దర్యాప్తు సంస్థలు మహిళను ఇంటి దగ్గరే విచారణ జరపాలని, కానీ వ్యక్తిగతంగా హాజరుకావాలని తనకు సెక్షన్ 50 ప్రకారం నోటీసులు జారీ చేయడం చట్ట విరుద్ధమని కవిత తరపు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకువెళ్లారు. అంతేకాదు వాంగ్మూలం నమోదు చేసేటప్పుడు న్యాయవాది సమక్షంలో వీడియో చిత్రీకరణకు ఉత్తర్వులు జారీ చేయాలని కోర్టును కోరారు. అయితే పీఎంఎల్ఏ కేసుల్లోకి సెక్షన్ 160 వర్తించదని ఈడీ తరపు న్యాయవాది పేర్కొన్నారు. పి ఎం ఎల్ ఏ సెక్షన్ 50ని ధర్మాసనానికి వివరించారు. చట్ట ప్రకారం ఎవరినైనా విచారణకు పిలిచే అధికారాలు ఈడికి ఉన్నాయని ఈడి తరపు న్యాయవాది ఎస్వీ రాజు తమ వాదన వినిపించారు. నవంబర్ 20వ తేదీ వరకూ కవితను విచారణ చేయడం లేదా అరెస్టు చేయడం వంటి పరిణామాలు ఉండే అవకాశం లేదు.

# గులాబీ స్థానంలోకి వచ్చిన కాంగ్రెస్

తెలుగు ట్రాక్,హైదరాబాద్

తెలంగాణలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. మరి కొద్ది నెలల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు ఎన్నికల సంఘం కూడా కసరత్తు ప్రారంభించింది. ఎన్నికలంటే కొత్త కొత్త పథకాలు, అటు నాయకులు ఇటు పోవడం, ఇటు నాయకులు అటు పోవడం మామూలే కాబట్టి.. ప్రస్తుతం తెలంగాణలో అలాంటి పరిణామాలే చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో అధికార భారత రాష్ట్ర సమితి నుంచి, భారతీయ జనతా పార్టీ నుంచి నాయకులు కాంగ్రెస్ పార్టీకి వలస వెళ్తున్నారు.. అది కూడా కాంగ్రెస్ పార్టీ ఊహించనంతగా. ఎందుకంటే క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీకి ఓటు బ్యాంకు బలంగా ఉండడం, భారత రాష్ట్ర సమితి ఒంటెత్తు పోకడలు, భారతీయ జనతా పార్టీ అధిష్టానం వైఖరి.. ఇన్ని పరిణామాలతో ఆ పార్టీలకు చెందిన నాయకులు మొత్తం కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారు. ఈ పరిణామాలతో కాంగ్రెస్ పార్టీ మొన్నటి భారత రాష్ట్ర సమితిని గుర్తు చేస్తోంది.కాంగ్రెస్ పార్టీలో చేరికల దూకుడు కొనసాగుతూనే ఉంది. భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీ అసంతృప్త నాయకుల లక్ష్యంగా ఆ పార్టీ నాయకత్వం వేగం పెంచడంతో చేరికలు జోరు అందుకుంటున్నాయి. అటు రేవంత్ రెడ్డి, ఇటు భట్టి విక్రమార్క రంగంలోకి దిగి కీలకమైన భారత రాష్ట్ర సమితి నాయకులను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించడంతో ఒక్కసారిగా రాజకీయ పరిణామాలు మారిపోయాయి.. మైనంపల్లి హనుమంతరావు నివాసానికి విక్రమార్క వెళ్లారు. ఆయనను పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. హనుమంతరావు తో పాటు ఆయన కుమారుడు రోహిత్, నక్క ప్రభాకర్ గౌడ్ మరికొంతమంది కార్పొరేటర్లు ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ లో చేరే అవకాశం కనిపిస్తోంది.. రెండు నెలల కింద భారత రాష్ట్ర సమితిలో చేరిన కుంభం అనిల్ కుమార్ రెడ్డి మళ్ళీ కాంగ్రెస్ పార్టీలో చేరారు. గత జూలై 25న అనిల్ కుమార్ రెడ్డి భారత రాష్ట్ర సమితిలో చేరిన విషయం తెలిసిందే. అయితే అక్కడ సీటును సిట్టింగ్గ ఎమ్మెల్యేకు కెసిఆర్ కేటాయించడంతో అనిల్ కుమార్ రెడ్డి ఆశించిన భువనగిరి సీటు దక్కలేదు. దీంతో అనిల్ కుమార్ రెడ్డితో కాంగ్రెస్ వ్యూహకర్త సునీల్, రేవంత్ రెడ్డి, ఎంపీ ఉత్తమ్ చర్చలు జరిపారు. ఈ పార్టీలో చేరేందుకు అనిల్ కుమార్ రెడ్డి సుముఖత వ్యక్తం చేయడంతో.. రేవంత్ రెడ్డి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు.. మరోవైపు ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి కూడా కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. నాగర్ కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీ సింగ్, మరో నలుగురు జడ్పిటిసిలు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశం కల్పిస్తోంది.. జనరల్ కోటాలో అయితే కసి రెడ్డి నారాయణరెడ్డి కి, బీసీ కోటాలో అయితే తనకు టికెట్ కేటాయించాలని బాలాజీ శరత్ విధించినట్టు తెలుస్తోంది. ఇక వీరే కాకుండా భారత రాష్ట్ర సమితి, బిజెపి నుంచి చాలా మంది నాయకులు తమ పార్టీలో చేరుతారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.భారత రాష్ట్ర సమితికి చెందిన బోథ్ ఎమ్మెల్యే బాపూ రావు, ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే రేఖా నాయక్ ఇప్పటికే కాంగ్రెస్ పెద్దలను కలిసిన సంగతి తెలిసిందే. భారత రాష్ట్ర సమితి నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం కూడా కాంగ్రెస్లో చేరే అవకాశం ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన భారత రాష్ట్ర సమితి అసంతృప్త నేత కూడా కాంగ్రెస్ పార్టీతో టచ్ లో ఉన్నట్టు తెలుస్తోంది. మరోవైపు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కూడా పార్టీలోకి తిరిగి ఆహ్వానించేందుకు కాంగ్రెస్ వర్గాలు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. ఎల్బీ నగర్ లేదా మునుగోడు నియోజకవర్గాల్లో ఏదో ఒకటి ఇస్తామని ప్రతిపాదన ఆయన ముందు ఉంచినట్టు ప్రచారం జరుగుతున్నది. ఇక భారతీయ జనతా పార్టీకి చెందిన మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేతో కాంగ్రెస్ వర్గాలు సంప్రదింపులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. వైపు మైనంపల్లి హనుమంతరావుకు మాల్కా జ్ గిరి టికెట్ ఇస్తారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో డిసిసి అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ తో సీఎల్పీ నేత విక్రమార్క, వీహెచ్, మల్లు రవి భేటి అయ్యారు. అయితే ఈ సమావేశంలో వారు ఏం మాట్లాడుకున్నారో బయటకి చెప్పలేదు. మొత్తానికి ఒకప్పుడు చేరికలతో భారత రాష్ట్ర సమితి "కారు" ఫుల్లుగా ఉంటే.. ఇప్పుడు కాంగ్రెస్ చేతినిండా నేతలతో కళకళలాడుతోంది. మరి ఎన్నికల్లో ప్రజలు ఎటువంటి తీర్పును ఇస్తారో వేచి చూడాల్సి ఉంది.

పాత వర్సెస్ కొత్త నేతలు...

బీఆర్ఎస్ లో టికెట్లు రాని నేతలు కాంగ్రెస్ కు క్యూకట్టారు. పార్టీలో చేరేముందు వాళ్లకు టికెట్ హామీ దక్కిందని ప్రచారం చేసుకుని కాంగ్రెస్ లో చేరుతున్నారు. ఇన్నాళ్లు పార్టీని అంటిపెట్టుకున్న నేతలు ఆందోళన చెందుతున్నారు. ఆపద సమయంలో పార్టీని వీడకుండా, ఎన్నో అవంతరాలు అవమానాలు ఎదుర్కొని, పార్టీలోనే కొనసాగుతూ వచ్చామని పేర్కొంటున్నారు. ప్రభుత్వం లేకపోయినప్పటికీ స్థానికంగా కార్యకర్తలకు అండగా నిలిచామంటున్నారు. ప్రస్తుతం కొత్తగా వచ్చిన వారికి ప్రాధాన్యత నివ్వడంతో పార్టీని అంటిపెట్టుకున్న నేతలు అసంతృప్తి చెందుతున్నారు. గత పదిహేళ్లుగా అధిష్టానం ఇచ్చిన పిలుపును కాదనకుండా మండల కేంద్రాల్లో ధర్నాలు, ప్రభుత్వ వైఖరిపై నిరసనలు చేశామని కాంగ్రెస్ నేతలు అంటున్నారు

# పక్కా ప్లాన్‌తో వ్యూహాలు

తెలుగు ట్రాక్,హైదరాబాద్

తెలంగాణ ఎన్నికలకు బీజేపీ రెడీ అవుతోంది. ప్రధాని సహా దిగ్గజ నేతల పర్యటనలు వరుసగా సాగనున్నాయి. ఈ క్రమంలో ఎన్నికల కోసం కేంద్ర పార్టీ ఐదు రాష్ట్రాల నుంచి ఇరవై ఆరు మంది ముఖ్య నేతలతో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. తెలంగాణలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం 26 మంది నేతలతో కేంద్ర ఎన్నికల కమిటీని బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా గారి ఆదేశాల మేరకు నియమించడం జరిగింది . ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, గోవా, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఈ ఎన్నికల కమిటీలో సభ్యులు ఉన్నారు. వీరిలో పలువురు కేంద్ర మంత్రులు కూడా ఉన్నారు. ఇప్పటికే తెలంగాణ బీజేపీ గేర్ మార్చే పనిలో ఉంది. వరుసగా అగ్రనేతలు పర్యటించబోతున్నారు. అగ్రనేతలు తెలంగాణ బాట పడుతూ ఎప్పటికప్పుడు కాషాయ పార్టీ నేతలను సమాయత్తం చేస్తున్నారు. దీనిలో భాగంగా ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్ షా సైతం హైదరాబాద్ లో పర్యటించారు. తెలంగాణ విమోచన దినోత్సవంలో పాల్గొన్న అమిత్ షా.. నేతలతో భేటీ అయి ఎన్నికల కార్యచరణపై చర్చించారు. అంతేకాకుండా.. అధిష్టానం సూచనలను తప్పక పాటించాలని.. ఐకమత్యంతో ముందుకెళ్లాలని.. ఇకపై అగ్రనేతలంతా ఎప్పటికప్పుడు తెలంగాణలో పర్యటిస్తారని కూడా హామీనిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అక్టోబరు 1న మహబూబ్‌నగర్ వేదికగా ఎన్నికల సమరశంఖం పూరించనున్నారు. బీజేపీ శ్రేణుల్లో జోష్ నింపడంతోపాటు.. ఎన్నికలకు సిద్ధమయ్యేలా పలు సూచనలు చేయనున్నారు. తెలంగాణ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడానికి ఉన్న అనువైన పరిస్థితులు ఉన్నాయని అందర్నీ సమన్వయం చేసుకోవడం, అభ్యర్థుల ఎంపిక, వారికి కావాల్సిన సహాయ సహకారాలు అందిచడం, ప్రచారం, జాతీయ నేతలు బహిరంగ సభలు నిర్వహణ , ప్రజల్లోకి వెళ్లేందుకు అవసరమైన సాయం చేయడం వంటి బాధ్యతల్ని ఈ ఎన్నికల కమిటీ నిర్వహిస్తుంది. తెలంగాణలో ఎన్నికలు ముగిసే వరకూ అంటే డిసెంబర్ మొదటి వారం వరకూ ఈ కమిటీ తెలంగాణ పూర్తి సమయం ఉండి రాష్ట్ర , కేంద్ర మంత్రులు పార్టీ జాతీయ నాయకత్వంతో కలిసి పని చేస్తుంది. బీజేపీని రానున్న తెలంగాణ ఎన్నికల్లో విజయపథంలో నడిపేందుకు ఈ కమిటీ పని చేయాలని కేంద్ర పార్టీ నుండి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చూగ్ కేంద్ర జాతీయ కార్యాలయ నుండి కమిటీ లో ఉన్న నేతలకు గురువారం ఆదేశాలు జారీ చేశారు .ఆంధ్రప్రేదశ్ రాష్ట్ర శాఖ మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యస్ . విష్ణువర్ధన్ రెడ్డిలు ఈ కీలక కమిటీలో బాధ్యతలు నిర్వహించడానికి జాతీయ పార్టీ అవకాశం కల్పించింది. తెలుగు రాష్ట్రాలతో పాటు దక్షిణాదిన ఉన్న పార్టీ నేతలు ఈసారి తెలంగాణ ఎన్నికల్లో కీలక బాధ్యతలను నిర్వర్తించబోతున్నారు. కర్ణాటక ఎన్నికల సమయంలో బీజేపీ ఎన్నికల ప్రచారంలో విష్ణువర్ధన్ రెడ్డి కీలకంగా వ్యవహరించారు. తెలుగువారు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ప్రధాని మోదీ సభలను కూడా కోఆర్డినేట్ చేశారు. దక్షిణాదిలో ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా విష్ణువర్ధన్ రెడ్డికి కీలక బాధ్యతలు అప్పగిస్తూ ఉంటారు.

## గిరిజనుల కష్టాలకు
# ఫుల్ స్టాప్ ఎప్పుడు

తెలుగు ట్రాక్,అదిలాబాద్

అడవుల జిల్లాల్లో గిరిజనుల కష్టాలు ఎవరికీ పట్టడం లేదు. ఏజెన్సీ గిరిజనుల కష్టాలను అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. దీంతో కనీసం గిరిజన గ్రామాలు రోడ్లకు కూడా నోచుకోవడం లేదు. దీంతో వానాకాలాం వచ్చిందంటే అత్యవసర పరిస్థితిలో ఆస్పత్రికి వెళ్లలేని పరిస్థితి నెలకొంటోంది.ఇటీవలే ఆసిఫాబాద్ జిల్లాలో గర్భిణికి పురిటి నొప్పులు వస్తే.. మంచంపై ఎత్తుకుని ఉప్పొంగుతున్న వాగు దాటి ఆస్పత్రికి తరలించారు. ఓ చిన్నారికి జ్వరం వస్తే అంబులెన్స్ రాకకు దారి లేక.. బాహుబలి సినిమాను తలపించేలా మెడలోతు వరద ఉధృతిలో చిన్నారిని పైకి ఎత్తుకుని వాగు దాటిన దృశ్యం కనిపించింది. రెండు రోజుల క్రితం అదే జిల్లాలో వాగు దాటుతూ గిరిజన మహిళ కొట్టుకుపోయి మృతిచెందింది. వరుస ఘటనలు జరుగుతున్నా ఏజెన్సీ వాసుల కష్టాలు ఎవరికీ పట్టడం లేదు. తాజాగా ములుగు జిల్లాలో పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని బంధువులు డోలీలో వేసుకుని వాగు దాటించారు.ఏటూరునాగారం మండలం రాయబంధంకు చెందిన సోది పోసి అనే గొత్తి కోయ తెగకు చెందిన గర్భిణికి సోమవారం వేకువ జామున పురిటినొప్పులు రావడంతో స్థానిక ఆశ వర్కర్ కుటుంబ సభ్యులు సమాచారం ఇచ్చారు. ఆమె వచ్చి పరిశీలించి ప్రసవం అయ్యేలా లేదని ఆస్పత్రికి తీసుకెళ్లాలని 108కు సమాచారం అందించారు. అయితే రాయబంధం గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేక 3 కి. మీ దూరంలోనే అంబులెన్స్‌ను సిబ్బంది నిలిపివేశారు. దీంతో గ్రామస్థులు గర్భిణిని మంచానికి తాళ్లతో కట్టి 3 కి. మీ మోసుకొచ్చి అంబులెన్స్ ఎక్కించి ఏటూరునాగారం ఆసుపత్రికి తరలించారు.గిరిజన గ్రామాలు, తండాల్లో చిన్న పిల్లలకు, వృద్ధులకు, గర్భిణులకు అత్యవసరమైతే పట్టించుకునే నాథుడే లేదు. నెలలు నిండిన గర్భిణులను ముందుగానే ఆస్పత్రులకు తరలించి ప్రీ డెలివరీ వార్డులో ఉంచాలని ప్రభుత్వం ఆదేశించింది. అయినా గిరిజనులు అందుకు అంగీకరించకపోవడం, అధికారులు పట్టించుకోకపోవడంతో ఆదివాసీ బిడ్డలకు అవస్థలు తప్పడం లేదు. ఇక వర్షాలు కురిస్తే ఏజెనీతో బాహ్య ప్రపంచంతో సంబంధాలు ఉండడం లేదు. దీంతో అత్యవసరమైతే ఆస్పత్రికి వెళ్లలేని పరిస్థితి. అష్టకష్టాలు పడి తీసుకెళ్లినా అప్పటికి పరిస్థితి చేయిదాటిపోతోంది. ఏటా ఇలాంటి ఘటనలు జరుగుతున్నా పాలకులు మాత్రం కళ్లు తెరవడం లేదు. ఓట్ల కోసం మాత్రం గిరిజనుల వద్దకు వెళ్లారు. సమస్యలు చెబితే అటవీశాకపై నెపం వేసి తప్పించుకుంటున్నారు. ఇలా గిరిజనులు ఇంకా ఎన్నాళ్లు కష్టపడాలో ఆ దేవుడికే తెలుసు.

# పథకాలే ముంచుతాయా

తెలుగు ట్రాక్,హైదరాబాద్



ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ సాధించాలని భావిస్తున్న గూలాబీ దళానికి బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు పథకాలు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. ఉమ్మడి కరీంనగర్? జిల్లాలోని ఏపల్లెకు వెల్లినా మూడు పథకాలపైనే చర్చ జరుగుతోంది. హుజూరాబాద్ ఉప ఎన్నికల నేపథ్యంలో తీసుకువచ్చిన దళిత బంధు పథకాన్ని మొదటి విడతలో ప్రతి నియోజకవర్గానికి100 మందికి ఇవ్వాలని నిర్ణయించారు. రెండో విడతలో ప్రతి నియోజకవర్గంలో 1,100 మందికి ఇవ్వాలని నిర్ణయించారు. ప్రతి నియోజకవర్గంలో లబ్ధిదారుల ఎంపికలో అర్హులైన పేద దళితులకు కాకుండా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అందుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఇంటి నిర్మాణానికి స్థలం ఉండి ఇంటి నిర్మాణం చేసుకోవాలనుకునే వారికి గృహలక్ష్మి పథకం ద్వారా రూ.3 లక్షలు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ప్రతి నియోజకవర్గానికి 3 వేల ఇళ్లకు అనుమతి ఇస్తామని పేర్కొంది. ప్రభుత్వం ప్రకటనతో కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 30 వేల నుంచి 50 వేల మంది దరఖాస్తులు చేసుకున్నారు. తొలి విడతలో నియోజకవర్గానికి 3 వేల ఇళ్లు మంజూరు చేయడంతో దరఖాస్తులు చేసుకున్న వారిలో సగం మందికి ఇంటి నిర్మాణానికి డబ్బు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది.

గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపిక విషయంలో సైతం బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా ఉన్న వారిని అర్హులుగా ప్రకటిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.చేతి వృత్తులకు చేయూత ఇవ్వడానికి ప్రభుత్వం బీసీ కులాలకు బీసీ బంధు పేరుతో రూ. లక్ష సహాయం చేయడానికి బీసీ బంధు పథకాన్ని తీసుకువచ్చింది. ప్రతి నియోజకవర్గానికి 300 మందికి రూ. లక్ష చొప్పున అందించాలని నిర్ణయించారు. బీసీ బంధు పథకం సైతం బీఆర్?ఎస్? పార్టీ కార్యకర్తలకు, సానుభూతిపరులకు ఇస్తురనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు పథకాలకు ప్రతి నియోజకవర్గంలో అర్హులు ఎక్కువగా ఉండటం, యూనిట్లు తక్కువగా ఉండటంతో మూడు పథకాలతో ప్రభుత్వానికి మైలేజీ కంటే మైనస్ ఎక్కువ అవుతోంది. అర్హుల ఎంపిక విషయంలో సైతం పార్టీ కార్యకర్తలకు పథకాలు వర్తింప చేయకపోతే ఒక రకమైన నష్టం.. కలుగుతోందనే భయం అధికార పార్టీ నేతలను నిత్యం వెంటాడుతుంది.

# సినీ భాషలో కోడ్ వర్డ్స్



తెలుగు ట్రాక్,హైదరాబాద్

టాలీవుడ్ డ్రగ్స్ కేసుల దర్యాప్తులో అనేక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. సినీ రంగానికి చెందిన వారు మాదక ద్రవ్యాల దందాను సినీ భాషలో కోడ్ వర్డ్స్ గా వాడుకుంటున్నట్లు పోలీసులు తేల్చారు. మరోపక్క టీఎస్ నాబ్ అధికారులు సినీ నటుడు నవదీప్ నుంచి స్వాధీనం చేసుకున్న సెల్ ఫోన్ ను పరిశీలిస్తున్నారు. న్యాయస్థానం నుంచి ముందస్తు బెయిల్ పొందిన నిందితులు మంగళవారం దర్యాప్తు అధికారి ఎదుట హాజరయ్యారు. ఇటీవల కాలంలో టాలీవుడ్ తో లింకులు ఉన్న డ్రగ్స్ కేసులు రెండు నమోదు అయ్యాయి. సైబరాబాద్ పోలీసులు పట్టుకున్న కేపీ రెడ్డికి సంబంధించిన కేసు మాదాపూర్ ఠాణాలో నమోదు అయింది. అలాగే వెంకట రమణారెడ్డి లింకులకు సంబంధించిన కేసు హైదరాబాద్ కమిషనరేట్ లోని గుడి మల్కాపూర్ ఠాణాలో రిజిస్టర్ అయింది. ఈ కేసులో హీరో నవదీప్ పేరు బయట పడింది. ఈ రెండు కేసుల్లోనే అనేక మంది నటులు, నిర్మాతలు, దర్శకులతో పాటు మోడల్స్ సైతం డ్రగ్స్ వినియోగదారులు ఉన్నట్లు బయటపడింది. వీళ్లు రహస్య ప్రాంతాల్లో పొరుగు రాష్ట్రాల్లో పార్టీలు నిర్వహించుకుంటూ మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. సాధారమంగా డ్రగ్స్ క్రయవిక్రయాల్లో వాటి పేర్లను డైరెక్టుగా వాడరు. ఎవరికీ వాళ్లు కొన్ని కోడ్ వర్డ్స్ పెట్టుకుని పని పూర్తి చేస్తుంటారు. ఈక్రమంలోనే సినీ రంగానికి చెందిన వారు సినీ కోడ్ లోనే మాట్లాడుకుంటూ క్రయవిక్రయాలు సాగిస్తున్నట్లు గుర్తించారు. ముఖ్యంగా డ్రగ్ కు స్క్రిప్టు అని, పెడ్లర్ కు రైటర్ అని, డ్రగ్స్ కావాలని అడగడానికి షల్ వీ మీట్ అని కోడ్ ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. సినీరంగానికి సంబంధించిన వారి ఫోన్లను పరిశీలించినప్పుడు ఈ పదాలే ఎక్కువగా కనిపించాయని దర్యాప్తు అధికారులు చెబుతున్నారు. మరోవైపు నవదీప్ నుంచి పోలీసులు ఫోన్ ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఫోన్ ను పోలీసులకు అప్పగించే ముందే నవదీప్ ఫార్మాట్ చేసినట్లు గుర్తించారు. దీంతో డిలీట్ అయిన డేటాను రిట్రీవ్ చేయడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. ఇప్పటికే దర్యాప్తులో గుర్తించిన అంశాలను బట్టి ఈ డ్రగ్స్ క్రయవిక్రయాలన్నీ స్నాప్ చాట్ ఆధారంగా జరిగినట్లు తెలుసుకున్నారు. ఈ సామాజిక మాధ్యమాల యాప్ లో ఉన్న డిజ్ అప్పీర్ ఆప్షన్ ను పెడ్లర్లు, వినియోగదారులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. గుడిమల్కాపూర్ కేసులో నిందితులుగా ఉండి, న్యాయస్థానం నుంచి ముందస్తు బెయిల్ తీసుకున్న వ్యాపారి కలహర్ రెడ్డి, పబ్ నిర్వాహకుడు సూర్య కాంత్ సహా మరో వ్యక్తి మంగళ వారం రోజు దర్యాప్తు అధికారి ఎదుట హాజరయ్యారు. గుడి మల్కాపూర్ ఠాణాలో ష్యూరిటీలు సమర్పించడంతో పాటు ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరు అవుతానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగానే ఆయన మాట్లాడుతూ.. తనకు డ్రగ్స్ కేసుకు ఎలాంటి సంబంధం లేదని, విచారణకు పూర్తిగా సహకరించానని చెప్పుకొచ్చారు. తర్వాత కూడా సహకరిస్తానని, పోలీసులు ఎప్పుడు పిలిస్తే అప్పుడు వస్తానని అన్నారు.

# కాంగ్రెస్‌లో కొత్త లొల్లి

## మా సంగతేంటీ అని ప్రశ్న

తెలుగు ట్రాక్,హైదరాబాద్

తెలంగాణ ఇచ్చి కూడా పదేళ్లుగా అధికారానికి దూరమైన కాంగ్రెస్ రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ తాజా పరిస్థితులను చక్కగా వినియోగించుకుంటుంది. పార్టీ అధికారం కోల్పోయినప్పటి నుండి ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. కార్యకర్తలను కాపాడుకోవడం కోసం వివిధ రూపాలలో ఇన్నాళ్లు కష్టపడ్డ వీరిని పారాచూట్ నేతల కోసం బలి చేస్తున్నారనే నేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పార్టీని నిలబెట్టుకోవడం కోసం ఎవరితో అయితే ఇబ్బందులు పడ్డారో అదే నేతలు వచ్చి పార్టీలో చేరి టికెట్లను తన్నుకు పోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు కాంగ్రెస్ కార్యకర్తలు.ఇప్పటిదాకా తమకి అండగా ఉన్న నెతలకి టికెట్ రాకపోతే రాష్ట్ర నాయకత్వం వద్ద తాడోపేడో తేల్చుకోవడానికి సిద్ధమవుతున్నారు.ముందు వచ్చిన చెవుల కన్నా వెనుక వచ్చిన కొమ్ములే మిన్న అన్న చందంగా కాంగ్రెస్ పార్టీ తయారైందని.. స్వయంగా రాష్ట్ర, జాతీయ నేతలే ఈ విధంగా ప్రోత్సహించడం కాంగ్రెస్ కి ప్రమాదకరం అని హెచ్చరిస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేకత ప్రజల్లోకి ఇప్పటికే వెళ్లినందున కాంగ్రెస్ సొంతంగా గెలవగలిగే అవకాశాలున్నా ఈ సందర్భంలో.. బీఆర్ఎస్, బిజెపి నేతలను డైరెక్ట్ గా తీసుకొచ్చి టికెట్లు కేటాయించడం వెనుక మతలబేంటని ప్రశ్నిస్తున్నారుఅందుకు తగ్గట్టుగానే గెలవగలిగే అభ్యర్థులకు మాత్రమే టికెట్లు ఇవ్వాలని అనుకుంటుంది. రాజకీయ, ఆర్థిక నేపథ్యం ఉన్న బడా నేతల వేటలో పడింది కాంగ్రెస్ పార్టీ. తన సర్వే టీం లతో 119 నియోజకవర్గాలలోని పేరున్న, బలమైన నేపథ్యం ఉన్న, గెలవగలిగే కెపాసిటీ ఉన్న నేతలను గుర్తిస్తోంది. అందులో బాగంగా పొరుగు పార్టీ నుంచి వస్తున్న నేతలకు టికెట్లు ఆఫర్ చేస్తుంది.టికెట్ల హామీతో పది మంది బీజేపీ మాజీ ఎంపీలకు గాలం వేస్తుంది హస్తం పార్టీ. ఇంతవరకు బాగానే ఉన్నా ఇన్నాళ్లు అనేక ఇబ్బందులకు, ఒడిదొడుకులకు లకు ఎదురొడ్డి నిలబడి పార్టీ కోసం కష్టపడ్డ నేతలను పక్కన పెట్టేస్తున్నారు..నిన్న మొన్నటిదాకా టికెట్ నీకే అని చెప్పి ఇప్పుడు మాత్రం టికెట్ ఇవ్వలేకపోతున్నాం..సర్దుకు పోవాలని పార్టీ నేతలు రాయబారాలు నడపడాన్ని ఆశావాహులు జీర్ణించుకోలేక పోతున్నారు. పార్టీ కోసం ఎంత కష్టపడ్డా పరాయి పార్టీ నుంచి వస్తున్న పారాచూట్ నేతలకే టికెట్లు ఇస్తారా అంటు ప్రశ్నిస్తున్నారు. ఇలా అయితే తమ దారి తాము చూసుకుంటామని పలువురు నేతలు హెచ్చరిస్తున్ననేపథ్యంలో..కాంగ్రెస్ లో టికెట్ల ప్రకటన గందరగోళానికి దారి తీసే అవకాశాలు ఉన్నాయి.

# పార్టీల్లో కోవర్టుల టెన్షన్

తెలుగు ట్రాక్,మెదక్

మెదక్ కాంగ్రెస్ లో బీఆర్ఎస్ కోవర్టులున్నారని సొంత పార్టీ నేతలే సంచలన ఆరోపణలు చేశారు. త్వరలో అధిష్టానం పెద్దలను కలిసి వారిపై ఫిర్యాదు చేస్తామంటున్నారు. మెదక్ జిల్లాలో ఇద్దరు కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఆర్ఎస్ లో చేరిన మాజీ మంత్రి వాకిటి సునీత లక్ష్మా రెడ్డితో టచ్ లో ఉన్నారని కాంగ్రెస్ సీనియర్ నేత పంతులు భూమయ్య ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో ఉంటూ బీఆర్ఎస్ పార్టీకి ఇద్దరు నాయకులు కోవర్టులుగా పనిచేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కంఠరెడ్డి తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ కమిటీ మెంబర్, నర్సాపూర్ నియోజకవర్గానికి చెందిన మరో సీనియర్ నాయకున్ని ఉద్దేశించి భూమయ్య ఈ ఆరోపణలు చేశారని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. వీరిద్దరూ కూడా మెదక్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ తరపున చురుకుగా పనిచేస్తున్నారు. భూమయ్య మాట్లాడుతూ.. మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలలో వీళ్లిద్దరూ సునీత లక్ష్మా రెడ్డి ద్వారా బీఆర్ఎస్ నాయకుల తో టచ్ లో ఉన్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయంలో స్పష్టమైన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని అన్నారు. మెదక్, నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ గెలవకుండా చేసేందుకు కాంగ్రెస్ లోని ఇద్దరు నేతలు అధికార పార్టీకి చెందిన సునీతాలక్ష్మారెడ్డితో కలిసి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.మెదక్ జిల్లాలో అధికార పార్టీతో కలిసి మిషన్ భగీరథ పనులు చేసుకుంటూనే, కాంగ్రెస్ లో కొనసాగుతూ పార్టీని ఎదగనీయకుండా చూస్తున్నారని పంతులు భూమయ్య ఆరోపించారు. వీరి వ్యవహారంపై త్వరలో ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీకి ఫిర్యాదు చేస్తామని ప్రకటించారు. ఈ నేతలకు ఇష్టం లేకుంటే పార్టీ నుంచి వెళ్లిపోవాలని సూచించారు. ఇలానే బీఆర్ఎస్ తో కలిసి కాంగ్రెస్ కు నష్టం చేస్తే కార్యకర్తలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. భూమయ్య ఆరోపణలు మెదక్ కాంగ్రెస్ లో సంచలనం రేపాయి. సునీత లక్ష్మారెడ్డి కాంగ్రెస్ పార్టీ నుండి 1999, 2004, 2009లో మూడు సార్లు నర్సాపూర్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు, మంత్రిగా కూడా పనిచేశారు. 2014, 2018 లో



కాంగ్రెస్ తరపున పోటీ చేసిన సునీత లక్ష్మా రెడ్డి బీఆర్ఎస్ నేత చిలుముల మదన్ రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. 2018లో ఓడిపోయినా తరువాత, బీఆర్ఎస్ లో చేరిన సునీత లక్ష్మా రెడ్డికి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ గా నియమితులయ్యారు. ఇప్పుడు ఆమె నర్సాపూర్ బీఆర్ఎస్ టికెట్ రేసులో కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇలాంటి ఆరోపణలు రావటం రెండు పార్టీలలో సంచలనం రేపింది. ఈ వ్యవహారంపై కొద్దిరోజుల్లో మెదక్ కాంగ్రెస్ నాయకులు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని, మిగతా సీనియర్ నాయకులను కలిసి ఫిర్యాదు చేయాలనే ఆలోచనలో ఉన్నారని సమాచారం.

## కర్ణాటకకు రండి...
# హామీలు చూపిస్తాం

తెలుగు ట్రాక్,హైదరాబాద్

కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులు కేటీఆర్,హరీష్, ఎమ్మెల్సీ కవితలకు ఫ్లైట్ టికెట్ బుక్ చేస్తామని అన్నారు. ఇందిరా భవన్ లో వార్ రూమ్, కనెక్ట్ సెంటర్ ను ఏఐసీసీ ఇంచార్జ్ మానిక్ రావ్ ఠాక్రే, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ప్రారంభించారు. అనంతరం భట్టి మాట్లాడుతూ.. సోనియాగాంధీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు ఇచ్చారని తెలిపారు. ప్రతి మహిళకు నెలకు 2500 వచ్చేలా చేస్తుంది కాంగ్రెస్ అన్నారు. 500 కె గ్యాస్ ఇస్తామన్నారు. రైతుకి క్వింటాలుకి 500 బోనస్ ఇస్తోంది పార్టీ అని తెలిపారు. పేదలకు ఇంటి స్థలం.. ఇల్లు నిర్మాణంకి ఐదు లక్షలు ఇస్తామన్నారు. ఐదు లక్షల గ్యారంటీ విద్యార్థులకు ఇస్తున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే గ్యారెంటీలు అమలు చేస్తామన్నారు. ప్రతి ఇంటికి గ్యారంటీ కార్డు ఇస్తామన్నారని తెలిపారు. ఈ కార్డులో ఇల్లు.. ఇంటి స్థలం ఉందన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కేటీఆర్..హరీష్..కవితలకు ఫ్లైట్ టికెట్ బుక్ చేస్తామని, కర్ణాటకలో అమలు అవుతుందా.. లేదా చూద్దాం రండి అని తెలిపారు. బస్సులో వెళదాం అంటే బస్సు కూడా బుక్ చేస్తామన్నారు. కేసీఆర్ లెక్క తప్పుడు ప్రకటన చేవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్ అంచనా వేసిన తర్వాతే.. హామీలు ఇస్తున్నామని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ లౌకిక వాదీ అని తెలిపారు. దేశం ఏకం చేయాలని పాదయాత్ర చేశాడని అన్నారు. ఓఎంఓ అసద్ సెక్యులర్ నాయకుడు అయితే రాహుల్ కి సపోర్ట్ చెయ్ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ ని వ్యతిరేకంగా మాట్లాడటం అంటే.. ఎతిఎ బీజేపీకి సపోర్ట్ చేయడమే అన్నారు.

# ఆ గుర్తులు ఎవ్వరికి ఇవ్వొద్దు

తెలుగు ట్రాక్,హైదరాబాద్

అసెంబ్లీ ఎన్నికల్లో కారును పోలిన గుర్తుల్ని ఎవ్వరికీ ఇవ్వొద్దంటూ కేంద్ర ఎన్నికల సంఘాన్ని బీఆర్ఎస్ ఎంపీలు కోరారు. చాలా ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులు , రిజిస్టర్ అయిన పార్టీల అభ్యర్థులకు రోడ్డు రోలర్, చపాతీ మేకర్, ట్రక్కు, ఆటో, ట్రాక్టర్ లాంటి గుర్తుల్ని కేటాయిస్తున్నారు. ఇవన్నీ కారుని పోలి ఉండటం వల్ల తమ పార్టీకి పడే ఓట్లు డైవర్ట్ అవుతున్నాయని బీఆర్ఎస్ ఎంపీలు ఢిల్లీలోని ఈసీ అధికారులకు బుధవారం సమర్పించిన లేఖలో విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని గతంలోనూ ఈసీ దృష్టికి తీసుకొచ్చామని అయినా కేటాయించారని ఈ సారి మత్రం కే?టాయించవద్దని బీఆర్ఎస్ నేతలు విజ్ఞప్తి చేశారు. 2020 నవంబర్ లో జరిగిన దుబ్బాక అసెంబ్లీ ఉప ఎన్నిక లో బీఆర్ఎస్ అభ్యర్థి 1,079 ఓట్లతో ఓడిపోయింది. కానీ రోటీ మేకర్ గుర్తుతో పోటీచేసిన బండారు నాగరాజు అనే స్వతంత్ర అభ్యర్థికి 3,510 ఓట్లు పోల్ అయ్యాయి. రోటీ మేకర్ కారు గుర్తును పోలినట్లుగా ఉండటంతో అవన్నీ బీఆర్ఎస్ ఓట్లేనని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. హుజూర్ నగర్ అసెంబ్లీ ఉప ఎన్నిక లో రోటీమేకర్ గుర్తుతో పోటీచేసిన సుమన్‌కు 2,697 ఓట్లు వచ్చాయి. మునుగోడు అసెంబ్లీ ఉప ఎన్నికలో రోడ్డు రోలర్ గుర్తుతో పోటీ చేసిన యుగతులసి అభ్యర్థి శివకుమార్‌కు 1,880 ఓట్లు పడ్డాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో జహీరాబాద్‌లో రోడ్డు రోలర్ గుర్తుకు 4,330 ఓట్లు, సిర్పూర్‌లో 4,039, మునుగోడులో 3,569, డోర్నకల్‌లో 4,117, హుజూరాబాద్‌లో 2,660, భూపాలపల్లిలో చపాతీ మేకర్ గుర్తుతో పోటీచేసిన మంతెన సంపత్‌కు 4,787 ఓట్లు, దేవరకొండలో రోడ్డు రోలర్ గుర్తుతో పోటీ చేసిన రమావత్ నాయక్ 3,247 ఓట్లు, గజ్వేల్‌లో ఇదే గుర్తుతో పోటీచేసిన కంటె సాయన్న 3,353 ఓట్లు చొప్పున ఓట్లు పడ్డాయి.ఇవన్నీ కారు గుర్తుకు పడాల్సిన ఓట్లేనని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. రోడ్డు రోలర్ మాత్రమే కాక రోటీ మేకర్ గుర్తు కూడా బీఆర్ఎస్‌కు ఇబ్బందికరంగా పరిణమించినట్లు ఆ పార్టీ నేతలు పలు సందర్భాల్లో కేంద్ర ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్ళారు. 2020 నవంబరులో రాష్ట్ర ఎన్నికల సంఘానికి కూడా లేఖ రాశారు.

# జనవరి 22న రామమందిరం ప్రారంభం

తెలుగు ట్రాక్,లక్నో

అయోధ్యలో రామాలయ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. వచ్చే ఏడాది జనవరి 22వ తేదీన ప్రాణప్రతిష్ఠ ఉండవచ్చని రామాలయ నిర్మాణ కమిటీ ఛైర్ పర్సన్ నృపేంద్ర మిశ్రా తెలిపారు. జనవరి 20వ తేదీ నుంచి 24వ తేదీ మధ్య ఏ రోజు అయినా ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాల్గొంటారని, కచ్చితమైన తేదీని ప్రధాన మంత్రి కార్యాలయం ఇంకా తెలియజేయలేదని నృపేంద్ర మిశ్రా వెల్లడించారు. ఈ భవ్య మందిరాన్ని మూడంతస్తుల్లో నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి గ్రౌండ్ ఫ్లోర్ పూర్తి అవుతుందని నిర్మాణ కమిటీ ఛైర్ పర్సన్ తెలియజేశారు.అయోధ్య భవ్య రామ మందిర నిర్మాణ పనులపై కమిటీ ఛైర్ పర్సన్ నృపేంద్ర మిశ్రా మాట్లాడారు. ఆలయ నిర్మాణానికి సంబంధించిన డిజైన్ వర్క్ జరుగుతోందని, ప్రతి సంవత్సరం శ్రీరామనవమి రోజున గర్భాలయంలోని దేవతా విగ్రహాలపై సూర్య కిరణాలు ప్రసరించేలా దీన్ని డిజైన్ చేస్తున్నారని తెలియజేశారు. బెంగళూరులో శిఖర నిర్మాణం చేపడుతున్నామని, సైంటిస్ట్ లు పర్యవేక్షణలో డిజైన్ వర్క్ జరుగుతోందని చెప్పారు. ఇందుకోసం రూర్కీలోని సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, పుణెలోని మరో ఇన్‌స్టిట్యూట్ కలిసి కంప్యూటరైజ్డ్ ప్రోగ్రామ్ రూపకల్పన చేస్తున్నట్లు వెల్లడించారు. 2024 జనవరి 15వ తేదీ అలాగే 24వ తేదీ జనవరి 2024 మధ్య శ్రీరామ చంద్రుడిని ప్రతిష్టించవచ్చని అన్నారు. ప్రాణ ప్రతిష్ఠ చివరి రోజున ప్రధాని నరేంద్ర మోదీకి ఆహ్వానం పంపనున్నట్లు నృపేంద్ర మిశ్రా గతంలో తెలిపారు.గర్భగుడి ప్రధాన ద్వారం బంగారంతో కప్పబడి ఉంటుందని దానిపై బంగారు చెక్కడం ఉంటుందని నృపేంద్ర చెప్పారు. 161 అడుగుల ఎత్తైన ఆలయ శిఖరానికి కూడా



బంగారు పూత పూయనున్నట్లు వివరించారు. ఆలయ శంకుస్థాపన జరిగినప్పుడే అయోధ్యకు వెళతానని ప్రధాని తన మనసులో అనుకున్నారని.. అందుకే 2021 ఆగస్టు 5న ఇక్కడికి వచ్చానని చెప్పారు.రాముడి విగ్రహ తయారీపై ప్రత్యేక దృష్టి సారించింది రామ మందిర ట్రస్ట్. దాదాపు ఆరడుగుల రాముడి విగ్రహాన్ని తయారు చేయించి...వచ్చే ఏడాది సంక్రాంతి నాటికి ప్రతిష్ఠించాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. అయితే..ఈ విగ్రహ తయారీ కోసం ప్రత్యేక శిలలు తెప్పించింది. నేపాల్ నుంచి రెండు సాలగ్రామ శిలలను తరలించారు. ఇప్పటికే ఇవి అయోధ్యకు చేరుకున్నాయి. రామ మందిర ప్రాంగణానికి చేరుకోగానే పూజారులు, స్థానికులు ఆ శిలలకు ఘనస్వాగతం పలికారు. పూలతో అలంకరించారు. పూజలు చేశారు. ఆ తరవాత ఆ శిలలను శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు అప్పగించారు. రాముడితో పాటు సీతా దేవి విగ్రహాన్నీఈ శిలతోనే తయారు చేయనున్నారు. గర్భాలయంలో ఈ రెండు విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. నేపాల్‌లోని కలి గండకి నదీ తీరంలో ఈ శిలలను సేకరించారు. వీటిని సీతాజన్మ స్థలిగా భావించే జానక్‌పూర్ నుంచి ప్రత్యేక క్రేన్‌ల ద్వారా అయోధ్యకు తరలించారు. ఈ రెండు సాలగ్రామ శిలల్లో ఒక దాని బరువు 18 టన్నులు కాగా...మరోటి 16 టన్నులు. విగ్రహ తయారీకి ఈ రెండు శిలలు అనువుగా ఉన్నట్టు అధికారులు నిర్ధరించారు.

## సనాతన ధర్మం
# పాఠాలు రద్దు



తెలుగు ట్రాక్,చెన్నై

సనాతన ధర్మంపై తమిళనాడు మంత్రి, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కుమారుడు ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. సనాతన ధర్మం సామాజిక న్యాయానికి విరుద్ధమని, దానిని పూర్తిగా నిర్మూలించాలంటూ ఆయన వ్యాఖ్యానించారు. సనాతన ధర్మం అనేది మలేరియా, డెంగ్యూ లాంటిది, కాబట్టి దీనిని నిర్మూలించాలి, వ్యతిరేకించకూడదు అంటూ మాట్లాడారు. ఆ సమయంలో మంత్రి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. మంత్రి ఉదయనిధిపై దేశంలోని హిందూ సంఘాలు, బీజేపీతో పాటు పలు పార్టీలు తీవ్రంగా మండిపడ్డాయి.ఇదిలా ఉండగా.. స్టాలిన్ సర్కారు మరో సంచలన నిర్ణయానికి రెడీ అయినట్లు తెలుస్తోంది. స్కూల్ పాఠ్యాంశాల నుంచి సనాతన ధర్మం పాఠం తొలగించాలని నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. దీని గురించి తమిళనాడు విద్యాశాఖ మంత్రి మహేష్‌ను ప్రశ్నించగా.. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేస్తున్నామంటూ మంత్రి కవర్ చేశారు. ఈ విషయంపై క్లారిటీ రావాల్సి ఉంది. సనాతన ధర్మం పాఠాలు తొలగిస్తే తీవ్రమైన పరిణామాలు ఉంటాయని హిందూ సంఘాలు, బీజేపీ హెచ్చరిస్తున్నాయి.

# ముదురుతున్న కావేరి వివాదం

తెలుగు ట్రాక్,బెంగళూరు

కర్ణాటక, తమిళనాడు మధ్య కావేరీ జల వివాదం మరింత ముదురుతోంది. తమిళనాడుకి నీళ్లు ఇచ్చేదే లేదని పట్టుబడుతోంది కర్ణాటక. రాష్ట్ర అవసరాలు తీర్చుకోడానికే సరిపోవడం లేదని, వాటిని ఆ రాష్ట్రానికి విడుదల చేస్తే తమకు ఇబ్బందులు ఎదురవుతాయని వాదిస్తోంది. ఈ వివాదంపై రెండు రాష్ట్రాల్లోనూ పలు చోట్ల ఆందోళనలు, నిరసనలు జరుగుతున్నాయి. కర్ణాటక ఆందోళనకారులంతా ఇవాళ (సెప్టెంబర్ 29) బంద్ ప్రకటించారు. తమిళనాడుకి కావేరీ నదీ జలాలు విడుదల చేసేదే లేదని తేల్చి చెబుతున్నారు. ఉదయం 6 గంటల నుంచే పలు చోట్ల నిరసనలు మొదలయ్యాయి. కన్నడ సంస్థలకు చెందిన 50 మందికి పైగా ఆందోళనకారులు పలుచోట్ల తమిళనాడుకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ 50 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ బంద్ కారణంగా ప్రజా రవాణాకి అవాంతరాలు ఎదురవుతున్నాయి. ట్రాన్స్‌పోర్ట్ సర్వీస్‌లు నడవడం లేదు. క్యాబ్‌లు, ఆటోలు తిరగడం లేదు.హోటల్స్, స్కూల్స్, కాలేజీలూ బంద్ అయ్యాయి. బెంగళూరుతోపాటు రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల నిరసనలకు పిలుపునిచ్చాయి కన్నడ సంస్థలు. ఇది దృష్టిలో ఉంచుకుని బెంగళూరు, మాండ్య ప్రాంతాల్లో విద్యా సంస్థల్ని మూసివేశారు.

బెంగళూరులో 144 సెక్షన్ విధించారు. పోలీసులు పెద్ద ఎత్తున మొహరించారు. షాప్‌లు, మాల్స్‌తో పాటు మిగతా వాణిజ్య సంస్థలూ మూసేశారు. థియేటర్లూ బంద్ అయ్యాయి. పలు చోట్ల రహదారులను నిరసనకారులు అడ్డగించారు. బెంగళూరులోని కెంపెగౌడ విమానాశ్రయం వద్దకు చేరుకుని పెద్ద ఎత్తు నినాదాలు చేశారు. ఈ బంద్‌కి అనుమతి లేదని బెంగళూరు పోలీస్ కమిషనర్ తేల్చి చెప్పారు. సెక్షన్ 144 అమలు చేస్తున్నట్టు వెల్లడించారు. అనవసరపు ఆందోళనలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెంగళూరు మెట్రో సర్వీస్‌లపై ఈ బంద్ ప్రభావం కనపించ లేదు. రాష్ట్ర రవాణా సంస్థ బస్‌లు డిపోలకే పరిమితమయ్యాయి. తమిళనాడుతో సరిహద్దులు పంచుకునే ప్రాంతాల్లో భారీ భద్రత ఏర్పాటు చేశారు. తమిళనాడు, కర్ణాటక మధ్య 200 ఏళ్లుగా కావేరీ నదీజలాల వివాదం కొనసాగుతోంది. 2018లో సుప్రీంకోర్టు కీలక తీర్పునిచ్చింది. కర్ణాటకకు అదనంగా 14.75 ఎఓఅల నీళ్లు విడుదల చేయాలని ఆదేశించింది. తమిళనాడు వాటాని అదే స్థాయిలో తగ్గించింది. బెంగళూరు సిటీలో తాగునీటి అవసరాలు తీర్చుకునేందుకు ఉన్న ఒకే ఒక రీసోర్స్ ఈ కావేరి నదీ జలాలే. అంతే కాదు. కర్ణాటకలోని మాండ్యలో వ్యవసాయ భూములకూ ఈ నీరే ఆధారం. అయితే...దీనిపై రెండు రాష్ట్రాల మధ్య తరచూ వివాదం నడుస్తూనే ఉంటుంది. ఇప్పుడు మరోసారి ఇది బయటపడింది. ఇక్కడ రాష్ట్రాల వాదన ఏంటంటే...2018లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను పాటించడం తప్పనిసరే. కానీ...ఇది సాధారణ వర్షపాతం నమోదైనప్పుడు మాత్రమే వర్తిస్తుంది. ఈ ఏడాది వర్షపాతం 30% మేర తక్కువగా నమోదైంది. అలాంటప్పుడు కూడా సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలనే పాటించాలంటే ఎలా అని కర్ణాటక వాదిస్తోంది. ఈ వివాదంలో ప్రధాని నరేంద్ర మోదీ జోక్యం చేసుకుని పరిష్కరించాలని డిమాండ్ చేస్తోంది. కర్ణాటకలో కొనసాగుతున్న టెన్షన్‌కావేరి జలాల వివాదం తమిళనాడు, కర్ణాటక మధ్య చిచ్చు పెట్టింది. రెండు రాష్ట్రాల్లోనూ పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతున్నాయి. కర్ణాటకలో ఇవాళ పలు సంస్థలు బంద్‌కి పిలుపునిచ్చాయి. ఆటోలు, ట్యాక్సీలు నడవడం లేదు. ఋఖీఅ బస్‌లు కూడా డిపోలకే పరిమితమయ్యాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక విమాన ప్రయాణికులకూ ఈ సమస్యలు తప్పడంలేదు. బంద్ కారణంగా బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో 44 ఫ్లైట్స్ రద్దయ్యాయి. కన్నడ సంస్థ ఒక్కుట పిలుపునిచ్చిన బంద్‌లో భాగంగా ఫ్లైట్ సర్వీస్‌లను రద్దుచేశారు.అయితే...ఎయిర్‌పోర్ట్ సిబ్బంది మాత్రం అందుకు వేరే కారణం చెబుతోంది. ఆపరేషనల్ రీజన్స్ వల్ల విమానాలను రద్దు చేస్తున్నట్టు వెల్లడించింది. ఇప్పటికే ప్రయాణికులకు ఇదే సమాచారం అందించింది. కేవలం బంద్ కారణంగానే ఫ్లైట్‌లు రద్దయ్యాయని కొందరు వాదిస్తున్నారు. బంద్ వల్ల ఎయిర్‌పోర్ట్‌కి చేరుకోలేని వాళ్లు చాలా మంది ఉన్నారని, వాళ్లంతా టికెట్‌లు క్యాన్సిల్ చేసుకున్నారని తెలుస్తోంది. ఎయిర్‌పోర్ట్ వద్ద కూడా ఆందోళనకారులు అలజడి సృష్టించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తమిళనాడుకి కావేరి జలాలు ఇచ్చేదే లేదని తేల్చి చెప్పారు. ఎయిర్‌పోర్ట్ వద్ద నిరసనలు చేపట్టిన ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఐదుగురూ ఎయిర్‌పోర్ట్‌లో ఎంట్రీ కోసం టికెట్‌లు కూడా బుక్ చేసుకున్నారు. ఆసాకుతో లోపలికి వచ్చి ఆందోళన చేశారు. ఈ బంద్ కారణంగా సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్కూళ్లు, కాలేజీలు మూతపడ్డాయి. కర్ణాటక ఆందోళనకారులంతా బంద్ ప్రకటించారు. తమిళనాడుకి కావేరీ నదీ జలాలు విడుదల చేసేదే లేదని తేల్చి చెబుతున్నారు. ఉదయం 6 గంటల నుంచే పలు చోట్ల నిరసనలు మొదలయ్యాయి. కన్నడ సంస్థలకు చెందిన 50 మందికి పైగా ఆందోళనకారులు పలుచోట్ల తమిళనాడుకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ 50 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ బంద్ కారణంగా ప్రజా రవాణాకి అవాంతరాలు ఎదురవుతున్నాయి. ట్రాన్స్‌పోర్ట్ సర్వీస్‌లు నడవడం లేదు. క్యాబ్‌లు, ఆటోలు తిరగడం లేదు.

# 3 నెలల్లో 90 వేల వీసాలు

తెలుగు ట్రాక్,ముంబై

ఈ వేసవిలో రికార్డు స్థాయిలో స్టూడెంట్ వీసాలు జారీ చేశామని, మొత్తం 90 వేలు మించిపోయాయని భారత్ లోని యునైటెడ్ స్టేట్స్ ఎంబసీ వెల్లడించింది. జూన్, జులై, ఆగస్టు నెలల వీసాలు జారీ చేసినట్లు ట్విట్టర్ వేదికగా వెల్లడించింది. ఇంత భారీ మొత్తంలో విద్యార్థి వీసాలు జారీ చేయడం భారత దేశం, అమెరికా మధ్య విద్యా మార్పిడిలో చారిత్రాత్మక మైలురాయిని సూచిస్తుందని పేర్కొంది. ఈ వేసవిలో ప్రపంచవ్యాప్తంగా జారీ అయిన వీసాల్లో అత్యధికంగా భారత్ నుంచే ఉన్నాయని తెలిపింది.ప్రపంచవ్యాప్తంగా జారీ అయిన ప్రతి నాలుగు విద్యార్థి వీసాల్లో ఒకటి భారత దేశంలోనే జారీ చేసినట్లు యునైటెడ్ స్టేట్స్ ఎంబసీ తెలిపింది. తమ ఉన్నత విద్యా లక్ష్యాలను సాకారం చేసుకోవడానికి యునైటెడ్ స్టేట్స్ ను ఎంచుకున్న విద్యార్థులు అందరికీ అభినందనలు, శుభాకాంక్షలు అంటూ ట్వీట్ చేసింది. టీమ్ వర్క్, ఇన్నోవేషన్ తో, అర్హత కలిగిన దరఖాస్తుదారులందరూ వారి ప్రోగ్రామ్ లకు సమయానికి చేరుకున్నారని నిర్ధారిస్తున్నట్లు ట్విట్టర్ వేదికగా పోస్టు పెట్టింది. ప్రస్తుత సెషన్ కోసం స్టూడెంట్ వీసా దరఖాస్తులు ముగిసిన నేపథ్యంలో యూఎస్ మిషన్ ఈ గణాంకాలను విడుదల చేసింది.2022 లో యునైటెడ్ స్టేట్స్ లో అత్యధిక అంతర్జాతీయ విద్యార్థులతో ప్రపంచంలోని అగ్ర దేశంగా భారత్ చైనాను అధిగమించింది. 2020లో దాదాపు 2,07,000 మంది అంతర్జాతీయ భారతీయ విద్యార్థులు యూఎస్ లో ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని తాజా నివేదిక ద్వారా తెలుస్తోంది. భారత దేశం నుంచి విద్యార్థులను ఆకర్షించడానికి విదేశీ విశ్వవిద్యాలయాలు అందించే సులభతరమైన అప్లికేషన్ ఫార్మాలిటీలు, ఆర్థిక సహాయం, స్కాలర్‌షిప్ లు ఈ పెరుగుదలకు కారణంగా విద్యారంగ నిపుణులు పేర్కొంటున్నారు.ఇంతకు ముందు ఫ్రాన్స్ కూడా భారత్ నుంచి సుమారు 30 వేల మంది విద్యార్థులను ఉన్నత చదువుల కోసం తమ దేశానికి



స్వాగతించాలన్న లక్ష్యాన్ని వ్యక్తం చేసింది. 2030 నాటికి భారతీయ విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ఆ దేశం ప్రయత్నాలు చేస్తోంది. విద్యా నైపుణ్యాన్ని పెంపొందించడం, సాంస్కృతిక సంబంధాలను పెంపొందించడం, రెండు దేశాల మధ్య దీర్ఘకాలిక స్నేహాన్ని పెంపొందించడం ద్వారానే ఈ లక్ష్యం సాధ్యం అవుతుందని పేర్కొంది. భారతీయ విద్యార్థులకు బ్రిటన్ ప్రభుత్వం షాక్ ఇచ్చింది. విదేశీ విద్యార్థుల నుంచి వసూల్ చేసే స్టడీ వీసా ఫీజును భారీగా పెంచేసింది. దాదాపు 127 పౌండ్ల వరకు ఫీజును పెంచారు. మనదేశ కరెన్సీలో పెంచిన మొత్తం రూ.13 వేలకు సమానం. అక్టోబర్ 4 నుంచే పెంచిన ఫీజులు అమల్లోకి రానున్నాయి. దీనిపై బ్రిటిష్ పార్లమెంట్‌లో ఇటీవల చట్టం చేశారు. స్టూడెంట్ వీసా దరఖాస్తు ఫీజును 490 పౌండ్ల వరకు వసూలు చేయనున్నట్లు యూకే హోం ఆఫీసు వెల్లడించింది. స్టూడెంట్ వీసాతోపాటు, పర్యాటకులకు ఇచ్చే విజిటింగ్ వీసా ఫీజును కూడా ప్రభుత్వం పెంచింది. విజిట్ వీసాపై 15 పౌండ్లు పెంచారు. దీంతో ఇప్పుడు ఆ వీసా ఖరీదు 115 పౌండ్లుగా మారింది. ఇది కేవలం 6 నెలల విజిట్ వీసాకు మాత్రమే. అక్టోబర్ నాలుగో తేదీ నుంచి కొత్త ఫీజులు అమలులోకి రానున్నట్లు యూకే ఇమ్మిగ్రేషన్ అధికారులు తెలిపారు. 2021-2022 సీజన్‌లో భారత్ నుంచి సుమారు లక్షా 20 వేల మంది చదువు కోసం బ్రిటన్ వెళ్లారు. ఆ దేశంలో విద్యను అభ్యసిస్తున్న విదేశీయుల్లో ఇండియన్ల సంఖ్యే ఎక్కువ. కీలకమైన సేవల్ని అందించేందుకు ఉద్దేశంతో ఫీజును పెంచినట్లు ప్రభుత్వం పేర్కొంది.

# మణిపూర్, మయిన్మార్ మధ్య కంచె



తెలుగు ట్రాక్,ఇంపాల్

ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో నాలుగు నెలలుగా అక్కడి జాతుల మధ్య ఘర్షణలు జరుగుతున్న సంగతి అందరికీ తెలిసిందే. అయితే ఇప్పుడు ఆ రాష్ట్రంలో పరిస్థితులు కాస్త సద్దుమణినట్లుగా కనిపిస్తున్నాయి. అయితే ఈ నేపథ్యంలో మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్.. మయన్మార్ సరిహద్దులో భద్రతపై దృష్టి సారించారు. ఆ దేశం నుంచి వచ్చే చొరబాట్లను నివారించడానికి 70 కిలోమీటర్ల వరకు కంచెను నిర్మింటాలని ప్లాన్ వేస్తున్నట్లు సమాచారం. అయితే ఇందుకు సంబంధించిన విషయాన్ని ఆయనే స్వయంగా ఎక్స్ (ట్విట్టర్)లో వివరించారు. అలాగే శనివారం రోజున ఇంఫాల్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో పలు కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఫ్రీ మూవ్‌మెంట్ రెజిమ్' వల్ల భారత్-మయన్మార్ ప్రజలు ఇరువైపులా ఎలాంటి డాక్యుమెంట్లు లేకుండా 16 కిలోమీటర్ల మేర సంచరించే వీలుందని పేర్కొన్నారు.దీనివల్లే అక్రమ వలసదారులు భద్రతా సిబ్బంది కంట పడకుండా సులువుగా తప్పించుకుంటున్నారని పేర్కొన్నారు. అలాగే ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకొని కేంద్ర ప్రభుత్వం 'ఫ్రీ మూవ్‌మెంట్ రెజిమ్'ను రద్దు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. అయితే ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి ఆదివారం బార్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్‌వో) అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. అయితే ఇందులో సీఎస్, డీజీపీ సహా పలువుకు హోంశాఖ అధికారులు సైతం ఆ సమావేశానికి హాజరయ్యారు. అయితే భారత్-మయన్మార్ సరిహద్దులో 70 కిలోమీటర్ల వరకు ఉన్న అదనపు కంచె ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని బీఆర్‌వోకు ముఖ్యమంత్రి తెలిపారు. సరిహద్దులోని లోపాల వల్ల పొరుగు దేశం నుంచి అక్రమ వలసలు, స్మగ్లింగ్ కార్యకలాపాలు రోజురోజుకు పెరుగుతున్నట్లు పేర్కొన్నారు. అందుకే అత్యవసరంగా అదనపు కంచె ఏర్పాటు చేయాలని సూచనలు చేశారు.ఇదిలా ఉండగా.. భారత్-మయన్మార్ మొత్తం సరిహద్దు పొడవు 1600 కిలోమీటర్లు ఉంటుంది. ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో చూసుకుంటే ఐదు జిల్లాలు 400 కిలోమీటర్ల వరకు సరిహద్దును పంచుకుంటున్నాయి. అయితే ఇందులో కంచె కేవలం 10 శాతం లోపే ఉందని పేర్కొన్నారు. దీనివల్ల ఇబ్బడిముబ్బడిగా మాదక ద్రవ్యాలు సైతం భారత్‌లోకి రావడం ఆందోళన కలిగిస్తోంది. అలాగే భౌగోళిక పరిస్థితులు, ఆర్థిక కారణాల వల్ల కూడా మొత్తం సరిహద్దుకు కంచె వేయడం సాధ్యం కాదని వ్యూహాత్మక నిపుణులు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయితే.. అక్రమ వలసలు అధికంగా ఉన్న చోట మాత్రం కంచె వేసుకునే వెసులుబాటు ఉందని అంటున్నారు. ఇదిలా ఉండగా.. మణిపూర్‌లో మే3న జాతుల మధ్య ఘర్షణలు మొదలయ్యాయి. అయితే ఈ అల్లర్లలో సుమారు 175 మందికి పైగా మృతి చెందారు. అలాగే వందల మంది గాయలపాలయ్యారు. ఇటీవలే మళ్లీ అక్కడ అల్లర్లు చెలరేగడం కలకలం రేపింది

# వ్యాక్సిన్‌తో అసలైన లక్షణాలు

## ఎలాన్ మస్క్ సంచలన కామెంట్స్

తెలుగు ట్రాక్,న్యూ ఢిల్లీ



కరోనా వైరస్‌ను ఎదుర్కొనేందుకు రూపొందించిన వ్యాక్సిన్ తీసుకున్నాక తనలో అసలైన లక్షణాలు కనిపించాయని కొవిడ్-19 వ్యాక్సిన్‌పై బిలియనీర్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ సంచలన కామెంట్స్ చేశారు. ఇక బూస్టర్ డోస్ తర్వాత తాను ఆసుపత్రిపాలైనట్లు తెలిపారు. ఈ మేరకు మస్క్ తన ట్విట్టర్ (ఎక్స్) సుదీర్ఘ పోస్ట్ పెట్టారు.ప్రపంచవ్యాప్తంగా కొవిడ్-19 వ్యాక్సిన్ ప్రభావం తగ్గుతోందని, కొన్ని దేశాలు వ్యాక్సిన్ వాడకాన్ని నిలిపివేశాయని పేర్కొంటూ నెట్టింట ఓ వీడియో వైరల్ అయింది. అయితే దీనిపై స్పందించిన ఓ నెటిజన్.. 'కొత్త జాతులు, వ్యాక్సిన్ రోగనిరోధక శక్తి తగ్గిపోవడం కారణంగా సమర్థత మారుతుందని నేను భావిస్తున్నాను. ఎవరైనా ఇది 100 శాతం ప్రభావవంతంగా ఉందని చెప్పడం మూర్ఖత్వమే. ఏ వ్యాక్సిన్ 100 శాతం పూర్తి ప్రూఫ్ కాదు' అని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన మస్క్..'ప్రజలు తప్పనిసరిగా టీకా, మల్టిపుల్ బూస్టర్‌లను తప్పనిసరిగా తీసుకోవాలి అనే దారుణమైన డిమాండ్ గురించే నా ఆందోళనంతా. అది గందరగోళంగా ఉంది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను సుప్రీంకోర్టు చెల్లదని చెప్పే వరకు.. స్పేస్ ఎక్స్, అనేక ఇతర కంపెనీలు టీకాలు వేయించుకునేందుకు నిరాకరించిన వారిని తొలగించవలసి వచ్చేది. సిబ్బందిపై వ్యాక్సిన్ విధివిధానాలను ప్రైవేట్ కంపెనీలు బలవంతంగా అమలు చేసే విధానాలను పాటించడం కంటే జైలుకు వెళ్లడమే మేలు. నా విషయానికొస్తే.. వ్యాక్సిన్ ముగిసేలోపు నాకు అసలు కొవిడ్ వచ్చింది (తేలికపాటి జలుబు లక్షణాలు). మూడు వ్యాక్సిన్ డోస్‌లు తీసుకున్నా. మూడో షాట్ నన్ను దాదాపు ఆసుపత్రిపాలు చేసింది. అదే వ్యాక్సిన్ తీసుకోని వారి విషయానికొస్తే.. నొవాక్ జకోవిచ్ రికార్డు స్థాయిలో గ్రాండ్‌స్లామ్‌లు గెలిచారు. ఇలా మాట్లాడుతున్నానంటే, నాకు టీకాలపై నమ్మకం లేనట్లు కాదు. నేనూ టీకా తీసుకున్నాను. అయినప్పటికీ.. నివారణ వ్యాధి కంటే అధ్వాన్నంగా ఉండకూడదు కదా' అంటూ ఎలాన్ మస్క్ తన పోస్టులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది.

# కెనడా వివాదంలో భారత్‌కు శ్రీలంక మద్దతు

తెలుగు ట్రాక్,ముంబై

భారత్, కెనడాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల అంశంపై శ్రీలంక భారత్‌కు మద్దతుగా మాట్లాడింది. కెనడా ఉగ్రవాదులకు సురక్షితమైన ప్రదేశంగా , స్వర్గధామంగా మారిందని శ్రీలంక విదేశాంగ మంత్రి అలీ సబ్రే పేర్కొన్నారు. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో భారత్‌పై చేస్తున్న ఆరోపణలు దౌర్జన్యపూరితమైనవని, ఆధారాలు లేనివని ఆయన తెలిపారు. జస్టిన్ ట్రూడో అబద్ధాలు చెప్తున్నారని సబ్రే వెల్లడించారు. గతంలో శ్రీలంకలో మారణహోమం జరిగిందని కెనడా తప్పుడు ఆరోపణలు చేసిందని, అలాగే ఇప్పుడు కూడా చేస్తోందని అన్నారు. ట్రూడో మాటలు తననేమీ ఆశ్చర్యపరచలేదని సబ్రే అన్నారు.కొందరు తీవ్రవాదులు కెనడాలో సురక్షిత స్థావరాలను ఏర్పాటు చేసుకున్నారని సబ్రే అన్నారు. కెనడా ప్రధాని ఎలాంటి రుజువులు చూపించకుండా ఇలాంటి తీవ్రమైన ఆరోపణలు చేయడం, శ్రీలంక గురించి ఆధారాలు లేకుండా అబద్ధాలు మాట్లాడినట్లుగానే ఉందని తెలిపారు. తమ దేశంలో ఎలాంటి మారణహోమం జరగలేదని అందరికీ తెలుసు అని ఆయన ఏఎన్ఐ వార్తా సంస్థతో వెల్లడించారు. ఇటీవల కెనడా పార్లమెంటులో రెండో ప్రపంచ యుద్ధంలో నాజీల కోసం పనిచేసిన సైనికుడిని గౌరవించడంపై శ్రీలంక మంత్రి సబ్రే స్పందించారు. నాజీల తరఫున పోరాడిని వ్యక్తికి ట్రూడో ఘన స్వాగతం పలికాడని విమర్శలు చేశారు. ట్రూడో గతంలో కూడా ఇలాగే ప్రవర్తించాడని, ఏదీ సరిగ్గా తెలుసుకోకుండా ఆరోపణలు చేస్తారని సబ్రే దుయ్యబట్టారు. కాబట్టి భారత్‌పై చేసే ఆరోపణలు కూడా అలాగే ఉన్నాయని అన్నారు. కెనడా విషయంలో భారతదేశం ప్రవర్తిస్తున్న దృఢమైన వైఖరిని శ్రీలంక సమర్థిస్తోందని భారత్‌లోని శ్రీలంక హైకమిషనర్ మిలిందా మొరగోడా వెల్లడించారు. భారత్‌కు ఈ విషయంలో శ్రీలంక మద్దతుగా ఉంటుందని తెలిపారు. ఉగ్రవాదం కారణంగా శ్రీలంక ప్రజలు చాలా నష్టపోయారని, తమ దేశం ఉగ్రవాదాన్ని సహించలేదని పేర్కొన్నారు. గత ఎన్నో ఏళ్లుగా శ్రీలంకలో మేము వివిధ రకాల ఉగ్రవాదాన్ని ఎదుర్కొన్నామని, చాలా మంది స్నేహితులను, సహచరులను కోల్పోయానని వెల్లడించారు.ఈ ఏడాది జూన్‌లో కెనడాలో ఉంటున్న ఖలిస్థానీ సానుభూతి పరుడు, ఖలిస్థాన్ టైగర్స్ ఫోర్స్ నేత హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కెనడా, భారత్‌ల మధ్య దౌత్య పరమైన ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. నిజ్జర్ హత్య వెనుక భారతీయ ఏజెంట్ల పాత్ర ఉండొచ్చని తమకు విశ్వసనీయమైన ఆరోపణలు ఉన్నాయని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడ్ ఆరోపించారు. దీనిపై భారత్ మండిపడింది. ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. ఖలిస్థాన్ వేర్పాటు వాదులు కెనడా నుంచి తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారని, ఇది చాలా ప్రమాదకరమని భారత్ ఆరోపణలు చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇరు దేశాలు రాయబారులను బహిష్కరించాయి. కెనడా పౌరులకు వీసాల జారీని కూడా భారత ప్రభుత్వం నిలిపేసింది. కెనడా ఇప్పటికీ ప్రభుత్వం తన వాదన నుంచి వెనక్కి తగ్గడం లేదు. ఇదిలా ఉండగా ఇటీవల కెనడాలోని ఖలిస్థానీ ఉగ్రవాది అర్ష్‌దీప్ దల్లా గ్యాంగ్‌లో మరోకరి హత్య జరిగింది. సుఖ్‌దోల్ సింగ్ అనే గ్యాంగ్‌స్టర్‌ను కెనడాలో ప్రత్యర్థి గ్యాంగ్‌కు చెందిన వ్యక్తులు హత్య చేసినట్లు తెలుస్తోంది.

# ఇస్రో... వీనస్ మిషన్

తెలుగు ట్రాక్,బెంగళూరు

అంతరిక్ష పరిశోధనల్లో దూసుకుపోతోంది భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో. చంద్రయాన్-3తో జాబిల్లిపై జెండా ఎగురవేసింది. మూన్‌పై అడుగుపెట్టి.. విక్రమ్ లాండర్‌ను చంద్రుడి దక్షిణ ధృవంపై దింపి.. చరిత్ర తిరగరాసింది. చంద్రుడి తర్వాత సూర్యుడిపై ఫోకస్ పెట్టింది. ఆదిత్య ఎల్-1ను విజయవంతంగా ప్రయోగించింది. ఇప్పుడు శుక్రుడిని సోధించేందుకు సిద్ధమవుతోంది. శుక్రగ్రహంపై పరిశోధనలకు త్వరలోనే వీనస్ మిషన్ చేపడతామని ఇస్రో చైర్మన్ సోమనాథ్ ప్రకటించారు. దీనికి సంబంధించి ఇప్పటికే రెండు పేలోడ్లు అభివృద్ధి చేసినట్టు ఆయన తెలిపారు. ఢిల్లీలోని ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమిని ఉద్దేశించి మాట్లాడిన ఇస్రో చైర్మన్ సోమ్నాథ్... వీనస్ మిషన్‌ను చేపడతామని ప్రకటించారు. శుక్రుడు... సూర్యుడి నుంచి రెండో గ్రహం. సౌరవ్యవస్థలో అత్యంత ప్రకాశవంతమైన గ్రహం. దీనిని ఎర్త్ సిస్టర్ ప్లానెట్ అని కూడా అంటారు. శుక్కుడిపై పూర్తిగా మందపాటి కార్బన్ డైయాక్సైడ్ వాతావరణం ఉంటుంది. చూట్టూ సల్ఫ్యూరిక్ యాసిడ్ మేఘాలతో కప్పబడి ఉంటుంది.. అందుకే దీనిని వీల్డ్ ప్లానెట్ అని కూడా పిలుస్తుంటారు. ఇది లేత పసుపు రంగులో కనిపిస్తుంది. అంతేకాదు.. శుక్రుడు సౌరవ్యవస్థలో అత్యంత వేడి గ్రహం. సవ్యదిశలో తిరుగుతూ ఉంటుంది. శుక్రగ్రహాన్ని పరిశోధించడం వల్ల.. అంతరిక్ష శాస్త్ర రంగంలోని అనేక ప్రశ్నలకు సమాధానాలు లభిస్తాయని ఇస్రో చైర్మన్ సోమ్‌నాథ్ తెలిపారు. శుక్రగ్రహం చాలా ఆసక్తికరమైన గ్రహమని.. దానిపై వాతావరణం చాలా మందంగా ఉందన్నారు. అంతేకాదు శుక్కుడిపై వాతావరణ పీడనం భూమి కంటే 100 రెట్లు ఎక్కువని అన్నారు. 10వేల సంవత్సరాల తర్వాత భూమి లక్షణాలు కూడా మారిపోవచ్చని.. భూమి కూడా ఏదో ఒకరోజు శుక్రుడులా కావచ్చని అన్నారు ఇస్రో చైర్మన్. నాసా కూడా 2029, 2030, 2031లో వీనస్ మిషన్లు చేపట్టే అవకాశం ఉంది. చంద్రయాన్-3 విజయవంతమైన తర్వాత ఈ ఏడాది సెప్టెంబర్ 2న సూర్యునిపై అధ్యయనం చేసేందుకు భారతదేశపు తొలి అంతరిక్ష ఆధారిత మిషన్ ఆదిత్య ఎల్-1 అంతరిక్ష నౌకను ఇస్రో ప్రయోగించింది. అనంతరం ఇస్రో వీనస్ మిషన్ పై దృష్టి సారించనుంది.

నిద్రయాన్ నుంచి బయిటకు రాని చంద్రయాన్ చంద్రయాన్‌బి3 మిషన్ ద్వారా చంద్రుడి గుట్టు మట్లు తెలుసుకునేందుకు ఇస్రో ఉపయోగించిన ల్యాండర్, రోవర్ మేల్కొనే అవకాశాలు కనిపించడం లేదు. చంద్రుడి దక్షిణ ధ్రువం మీద ఉన్న ఈ రెండూ.. ఈనెల 22న సూర్యోదయం అయిన నేపథ్యంలో అవి మేల్కొంటాయని శాస్త్రవేత్తలు భావించారు. అనుసంధానమయ్యే అన్ని ప్రయత్నాలు చేశారు. అప్పటికీ సానుకూల ఫలితాలు రావడం లేదు. మిషన్ లో ప్రయోగించిన పరికరాలు అక్కడి అతి శీతల పరిస్థితులను తట్టుకోలేకపోతున్నాయని ఇస్రో శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సమయం గడిచేకొద్దీ అక్కడ అవకాశాలు మందగిస్తున్నాయని ఇస్రో శాస్త్రవేత్తలు అంటున్నారు. "ఈ ప్రయోగం గొప్ప అనుభూతిని ఇచ్చింది. చంద్రుడి దక్షిణ ధృవం మీద ల్యాండర్, రోవర్ దిగడం ఆనందాన్నిచ్చింది. ఇలా దక్షిణ ధృవం మీద జెండా పాతిన నాలుగో దేశంగా భారత్ రికార్డు సృష్టించింది. ప్రస్తుతం చంద్రుడి మీద అతి శీతల వాతావరణముంది. సూర్యోదయం అయినప్పటికీ ఆ పరికరాలు సహకరించడం లేదు.. అయితే అవి అనుసంధానం కాకపోవడం ఒకింత బాధ అనిపించినప్పటికీ.. ఈ మిషన్ అఖండ విజయమని" ఇస్రో మాజీ అధిపతి కిరణ్ కుమార్ అభిప్రాయపడ్డారు. జాబిల్లి పై నిద్రావస్థలో ఉన్న చంద్రయాన్‌బి3ని మేల్కొల్పడానికి ఇస్రో కసరత్తు ప్రారంభించింది. అక్కడ ఉన్న విక్రం ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్ ను తిరిగి పని చేయించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు ప్రయత్నాలు ప్రారంభించారు. బెంగళూరులోని ఇస్రో ప్రధాన కేంద్రంలో గడచిన గురువారం సాయంత్రం నుంచి ఈ సన్నాహాల్లో తల మునకలయ్యారు. చంద్రయాన్‌బి3 చంద్రుడిపై ల్యాండ్ అయిన తర్వాత ల్యాండర్, రోవర్ అక్కడ ఒక మూన్ డే(భూమిపై 14 రోజులు) పాటు పనిచేశాయి. సూర్యాస్తమయానికి ముందు అంటే ఈ నెల రెండున ప్రజ్ఞాన్ రోవర్ ను, నాలుగున ల్యాండర్ ను ఇస్రో నిద్రాణ స్థితి ( స్లీప్ మోడ్) లోకి పంపింది. అక్కడ మూన్ నైట్ ముగిసినప్పటికీ ల్యాండర్, రోవర్ నిద్రాణ స్థితి నుంచి మేల్కోవడం లేదు. వాస్తవానికి నాలుగు సంవత్సరాల క్రితం చంద్రయాన్ బి2 మిషన్ లో భాగంగా రోదసీలోకి దూసుకుపోయి 3.84 లక్షల కిలోమీటర్ల దూరాన్ని అధిగమించి జాబిల్లిని ముద్దాడే క్రమంలో ఇస్రో ఓటమిపాలైంది. అయితే దీన్ని సవాల్ గా తీసుకున్న ఇస్రో శాస్త్రవేత్తలు చంద్రయాన్‌బి3 లో పంపించిన ల్యాండర్ కు విక్రమ్ అని, రోవర్ కు ప్రజ్ఞాన్ అని అప్పటి పేర్లే పెట్టారు. పొరపాటు అనే మాటకు తావు ఇవ్వకుండా విక్రమ్, ప్రజ్ఞాన్ దర్జాగా తమ పని చేసుకుని పోయాయి. అమెరికా, చైనా, రష్యాకు సాధ్యం కాని పనిని సులువుగా చేసేసాయి. చంద్రుడి దక్షిణ ధ్రువం మీద సాఫ్ట్ గా లాండ్ ప్రక్రియను చేపట్టిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించింది. గతంలో అమెరికా, చైనా, రష్యా మాత్రమే తమ వ్యోమ నౌకలను సురక్షితంగా చంద్రుడి మీదకు దించాయి.

# అసలేం జరుగుతోంది

## ఆందోళనలో అభ్యర్థులు సుప్రీంకు టీఎస్ పీఎస్సీ

తెలుగు ట్రాక్,హైదరాబాద్

మరోసారి గ్రూప్ -1 ప్రిలిమ్స్ పరీక్ష రద్దుతో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. డివిజన్ బెంచ్ కూడా సింగిల్ బెంచ్ తీర్పును సమర్థించటంతో? తమ పరిస్థితేంటని మదనపడుతున్నారు అభ్యర్థులు. సుప్రీంలో కూడా ఇదే తరహా తీర్పు వస్తే? అంతే సంగతులు అని వాపోతున్నారు. తెలంగాణలో గ్రూప్ -1 అభ్యర్థులు తెగ టెన్షన్ పడిపోతున్నారు. పరీక్షను రద్దు చేస్తూ హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పు ఇవ్వటంతో సంచలనంగా మారింది. ఈ తీర్పును అప్పీల్ చేస్తూ డివిజన్ బెంచ్ ను కూడా ఆశ్రయించింది టీఎస్పీఎస్సీ. అయితే ఇక్కడ అదే తీర్పు వచ్చింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పు సబబే అని స్పష్టం చేసింది. ఫలితంగా పేపర్ లీకేజీ కారణంగా ఇప్పటికే ఒకసారి పరీక్ష రద్దు కాగా.. పలు కారణాలతో రెండోసారి కూడా ఎగ్జామ్ రద్దు కావటంతో అభ్యర్థులు వాపోతున్నారు. గ్రూప్ 1 పరీక్షను రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో?. సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతోంది తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్. హైకోర్టు తాజా తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయనుంది. ఇక తీర్పు తుది కాపీ రాగానే వచ్చేవారంలో అప్పీల్ పిటిషన్ దాఖలు చేసే అవకాశం కనిపిస్తోంది. టీఎస్పీఎస్సీ నిర్ణయంతో చాలా మంది అభ్యర్థుల్లో కొంత ఆశలు చిగురిస్తున్నాయి. హైకోర్టు తీర్పుపై స్టే విధిస్తూ? పరీక్షల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇస్తే?. గ్రూప్ 1 ప్రక్రియ ముందుకెళ్లటం ఖాయమే. కానీ అలా కాకుండా? ఉన్నత న్యాయస్థానం లేవనెత్తిన అంశాలనే అత్యున్నత న్యాయస్థానం కూడా ప్రస్తావించి.. హైకోర్టు ఆదేశాలను సమర్థిస్తే పరిస్థితేంటన్న చర్చ గ్రూప్ 1 అభ్యర్థుల్లో తెగ జరుగుతోంది. ఇక సుప్రీంకోర్టు కూడా హైకోర్టు నిర్ణయాన్ని సమర్థిస్తే? మళ్లీ ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించాల్సి ఉంటుంది. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే?. ఎగ్జామ్ నిర్వహణ కష్టంగానే కనిపిస్తుంది. ఇప్పటికే పలు పరీక్షల తేదీలు ఖరారు కాగా? మరోవైపు వచ్చే నెలలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే ఛాన్స్ ఉంది. దీంతో మళ్లీ ప్రిలిమ్స్ పరీక్ష తేదీలను ప్రకటించటం, నిర్వహించటం అంత సులభమైన ప్రక్రియగా కనిపించటం లేదు. దీనిపై కమిషన్ ఏం చేయబోతుందనేది కూడా అత్యంత కీలకంగా మారింది.

ఇక 2022 ఏప్రిల్ 26న 503 పోస్టులతో తెలంగాణ తొలి గ్రూప్-1 నోటిఫికేషన్ ను టీఎస్‌పీఎస్సీ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 3,80,202 మంది గ్రూప్ 1 కు అప్లై చేశారు. అదే ఏడాది అక్టోబరు 16న ప్రిలిమ్స్ నిర్వహించగా పేపర్ లీకేజీ వ్యవహారంతో ఈ పరీక్షను టీఎస్పీఎస్సీ రద్దు చేసింది. తిరిగి ఈ ఏడాది జూన్ 11న మళ్లీ గ్రూప్-1 ప్రిలిమ్స్ నిర్వహించగా... ఇందులో గతంలో అనుసరించిన బయోమెట్రిక్ విధానాన్ని మినహాయించింది. ఈ అంశాన్నే పలువురు అభ్యర్థులు సవాల్ చేస్తూ కోర్టును ఆశ్రయిచటంలో ఈ పరీక్షను తాజాగా న్యాయస్థానం రద్దు చేసింది. రెండోసారి 2,33,248 మంది అభ్యర్థులు ప్రిలిమినరీ పరీక్ష రాశారు. మొత్తంగా 2 లక్షల మందికి పైగా అభ్యర్థులు ప్రిలిమ్స్ పై సుప్రీంలో ఎలాంటి తీర్పు వస్తుందని ఎదురుచూస్తున్నారు.

# దీర్ఘకాలిక రోగాలకు కారణమవుతున్న బీపీ

తెలుగు ట్రాక్,హైదరాబాద్

ప్రాథమిక దశలోనే బీపీ, షుగర్‌లను గుర్తించి చికిత్స తీసుకోకపోవడం వల్ల దీర్ఘకాలిక రోగాలకు కారణం అవుతున్నాయన్నారు మంత్రి హరీశ్ రావు. వాటివల్ల గుండె, కిడ్నీలు, కాలేయం వంటి ముఖ్యమైన అవయవాలు దెబ్బతింటున్నాయని చెప్పారు. ఒకప్పుడు కమ్యూనికబుల్ వ్యాధులు ఎక్కువగా ఉంటే ఇప్పుడు నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ అధికమవుతున్నాయని అన్నారు. మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, కనీస వ్యాయామం చేయకపోవడం, చెడు అలవాట్లు, మానసిక ఒత్తిళ్లు వంటివి దీనికి కారణమని చెప్పారు. ఇటీవల నిర్వహించిన ఓ సర్వే ప్రకారం రాష్ట్రంలో 24 శాతం షుగర్, 14 శాతం బీపీ కేసులు ఉన్నట్లు నిర్ధారణ అయిందన్నారు. ప్రభుత్వం బీపీ, షుగర్ మందులను ఉచితంగా అందిస్తున్నదని వెల్లడించారు. హైదరాబాద్‌లోని దుర్గంచెరువు వద్ద కార్డియాలజిస్ట్ సొసైటీ తెలంగాణ స్టేట్ చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో వరల్డ్ హార్ట్ డే కార్యక్రమంలో మంత్రి హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎక్కువగా గుండె సమస్యలకు బీపీ ఒక కారణం అవుతున్నట్లు వైద్యులు చెబుతున్నారని వెల్లడించారు. సడెన్ కార్డియాక్ అరెస్ట్ వల్ల దేశంలో ఏటా సుమారు 15 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. సమయం, సందర్భం, చిన్నా, పెద్దా అనే తేడాలేకుండా ఎవరికైనా సడెన్ కార్డిక్ అరెస్ట్ వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అయితే సకాలంలో సీపీఆర్ చేయడం వల్ల వీరి ప్రాణాలు కాపాడటం సాధ్యం అవుతుందన్నారు. జిమ్ చేస్తూ, పనులు చేస్తూ, డ్యాన్స్ చేస్తూ, నడుస్తూ కొంత మంది అకస్మాత్తుగా పడిపోవడం, ప్రాణాలు కోల్పోవడం వంటివి మనం తరచూ చూస్తున్నామని అన్నారు. ఆ సమయంలో సీపీఆర్ తెలిసిన వారు ఉంటే వారి ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందని వెల్లడించారు. అత్యవసర సమయంలో ప్రాణాలు కాపాడే అతి ముఖ్యమైన సీపీఆర్ విధానం గురించి మన దేశంలో 98 శాతం మందికి తెలియదన్నారు. ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా సీపీఆర్‌పై అవగాహన కల్పించాలని, శిక్షణ ఇప్పించాలని నిర్ణయించారని వెల్లడించారు. ఇందులో భాగంగా, పారామెడికల్ సిబ్బందితోపాటు వైద్య, మున్సిపల్ సిబ్బంది, పోలీసు, కమ్యూనిటీ వాలంటీర్లు, ఉద్యోగులు, రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్ల ప్రతినిధులు, సిబ్బంది, కమర్షియల్ కాంప్లెక్స్ వర్కర్స్ ఇలా వివిధ వర్గాలకు చెందిన వ్యక్తులకు సీపీఆర్ మీద శిక్షణ ఇచ్చామన్నారు. దీనికోసం అవసరమైన 1262 ఏఈడీ మిషన్లు సమకూర్చుకుని అన్ని సీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, బస్తీ దవాఖానల్లో ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. గేటెడ్ కమ్యూనిటీల్లో కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. ప్రతిఒక్కరు బీపీ, షుగర్ బారిన పడకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. బాడీ మాస్ ఇండెక్స్‌ని పరిమితిలో ఉంచుకోవాలన్నారు. బీపీ, షుగర్ నియంత్రణలో ఉండాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, రోజుకు కొంత సమయం వ్యాయామం, ధ్యానం చేసేందుకు కేటాయించాలని చెప్పారు. ఒత్తిడికి లోనుకాకుండా ఉండేందుకు ప్రయత్నించాలన్నారు. అందరం ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్య తెలంగాణ, ఆరోగ్య భారత్ సాధ్యమవుతుందని చెప్పారు.

# మళ్లీ తిరిగి పంపే యోచనలో ప్రభుత్వం

తెలుగు ట్రాక్,హైదరాబాద్

గవర్నర్ కోటా ఎమ్మెల్సీల భర్తీ వ్యవహారం తెలంగాణలో కాక రేపుతోంది. పూర్తిగా పొలిటికల్ టర్న్ తీసుకుంటోంది,నామినేటెడ్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలపైనా మరోమారు చర్చించి పూర్తి సమాచారం పంపే అవకాశం లేకపోలేదని అంటున్నారు. వ్యవహారం బీఆర్ఎస్ వర్సెస్ బీజేపీ అన్నట్టుగా మారిపోతోందంటున్నారు. కేసీఆర్ కేబినెట్ ప్రతిపాదించిన రెండు పేర్లను తిరస్కరించారు గవర్నర్ తమిళిసై. దాసోజు శ్రవణ్ , కుర్ర సత్యనారాయణ పేర్లను గవర్నర్ దగ్గరికి పంపింది సర్కార్. అయితే.. ఇద్దరికీ ఆ కోటాలో నామినేట్ అయ్యే అర్హత లేదంటూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు తమిళిసై. ఈ నిర్ణయంపై భగ్గుమంటోంది బీఆర్ఎస్. మంత్రులు, అధికార పార్టీ ముఖ్య నేతలు గవర్నర్ మీద నేరుగానే విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మాట్లాడుతూ.. దాసోజు శ్రవణ్, సత్యనారాయణ రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్నారు. కళలు, సాహిత్యం, సైన్స్ రంగంలో వీరిద్దరూ పెద్దగా కృషి చేయలేదు. గవర్నర్ కోటాలో నామినేట్ చేసే అర్హతలు వీళ్లకు లేవు. ఆర్టికల్ 171(5) ప్రకారం అభ్యర్థుల ఎంపిక జరగలేదు అని అన్నారు. ఇదిలా ఉండగా.. కాంగ్రెస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ ఇటీవలే బీజేపీలో చేరారు. అనంతరం, కొన్ని పరిణామాల నేపథ్యంలో అధికార బీఆర్ఎస్ పార్టీలో చేరిపోయారు. వెనుకబడిన వర్గాల నాయకుల పేర్లను తిరస్కరించారంటూ పొలిటికల్ కలర్ ఇస్తున్నారు. దీంతో ఇప్పుడు ప్రభుత్వం ఏం చేస్తుందోనన్న ఆసక్తి కూడా పెరుగుతోంది రాజకీయ వర్గాల్లో. ఆర్టీడీ వ్యవహారం పొలిటికల్ టర్న్ తీసుకున్నందున మరోసారి అవే పేర్లను తిప్పి పంపి మళ్లీ తిరస్కరిస్తే.. రాజకీయంగా రాష్ట్రంలో బీజేపీని టార్గెట్ చేయాలనుకుంటున్నట్టు అంచనా వేస్తున్నారు. చాలా రోజుల నుంచి రాజ్ భవన్, ప్రగతి భవన్ మధ్య మాటల మంటలు పుడుతున్నాయి. అయితే ఇటీవలే సచివాలయంలో దేవాలయాలు,మసీదు,చర్చి ప్రారంభోత్సవ కార్యక్రమాలకు హాజరయ్యారు గవర్నర్. దాంతో వివాదాలు సద్దుమణిగాయని అనుకున్నారు అంతా. మళ్ళీ వ్యవహారం మొదటికే రావడంతో గవర్నర్ తీరుపై గుర్రుగా ఉందట అధికార పార్టీ. ఈ వ్యవహారంపై న్యాయ నిపుణులతో చర్చించాక అడుగులు వేయాలనుకుంటున్నట్టు తెలిసింది. ఇవికాకుండా ఒకవేళ గవర్నర్ కొత్త పేర్లు పంపితే? తప్పు చేశామని ఒప్పుకున్నట్టు, వెనక్కు తగ్గినట్టు అవుతుందని, అందుకే ఈ రెండు పేర్లనే మరోసారి పంపాలని అనుకుంటున్నట్టు గులాబీ పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే.. ఇదే సమయంలో మరో వాదన సైతం రాజకీయ వర్గాల్లో బలంగా ఉంది. ప్రస్తుతం బీఆర్ఎస్, బీజేపీ ఒకటేనంటూ విస్తృతంగా ప్రచారం చేస్తోంది కాంగ్రెస్ పార్టీ.

# చాప క్రింద నీరులా టీడీపీ,జనసేన

తెలుగు ట్రాక్,విజయవాడ

కుప్పంలో వైఎస్ఆర్సీపీ గెలుస్తుందనుకోవడం ఎంత అవివేకమో... పులివెందులలో టీడీపీ గెలుస్తుందనుకోవడం కూడా అంతే అవివేకం!! వచ్చే ఎన్నికల్లో టీడీపీతో కలిసి కూటమిగా ఏర్పడి ఎన్నికలకు వెళతామని రాజమహేంద్రవరంలో ప్రకటించడంతో వైఎస్ఆర్సీపీ నేతలు ఉలిక్కిపడుతున్నారు. వైఎస్ఆర్సీపీ అగ్రనేతలు మొదలుకొని మంత్రులు వరకు ప్రతిపక్ష నేతల కలయికను చూసి కలవరపడుతున్నట్లు చెప్పడానికి వారి వ్యాఖ్యానాలే నిదర్శనం. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిత్యం జపించే 'వై నాట్ 175' నినాదం మేకపోతు గాంభీర్యమని ఆ విమర్శలు చెప్పకనే చెబుతున్నాయి.జనసేన-టీడీపీ పొత్తు కుదిరితే వైఎస్ఆర్సీపీకి ఒక్క సీటు కూడా రాదని పందేలకు పేరు గాంచిన ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో పందేలు కాస్తున్నారు. ఉత్తరాంధ్రాతో పాటు ఉమ్మడి కృష్ణ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు వరకూ ఈ పొత్తు ప్రభావం బలంగా ఉండే అవకాశాలున్నాయి. ఇందువలనే పొత్తు కుదరకూడదని కోరుకున్న వైఎస్ఆర్సీపీ పొత్తు కుదిరాకా జనసేన-టీడీపీ కూటమిని చూసి బెంబేలెత్తుతోంది.దేశంలోని ప్రముఖ సంస్థలు ఏపీలో నిర్వహించిన సర్వేలను పరిశీలిస్తే గతంలో కంటే టీడీపీ-జనసేన ఓట్ల శాతం పెరిగిందనే అంశాన్ని సర్వే ఫలితాలు వెల్లడిస్తున్నాయి. ఇదే సమయంలో 2019 ఎన్నికల్లో వైఎస్ఆర్సీపీకి మద్దతిచ్చిన వివిధ సామాజికవర్గాలు, సమూహాలు ఈ నాలుగున్నర సంవత్సరాల కాలంలో ఆ పార్టీకి దూరమయ్యాయన్న విషయాన్ని కూడా ఆ సర్వే సంస్థల ఫలితాలను బట్టి తేటతెల్లమవుతుంది. రాష్ట్రంలో ప్రతీ ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, వచ్చే ఎన్నికల్లో వైఎస్ఆర్సీపీ విజయం ఖాయమని ఆ పార్టీ డాంభీకమైన ప్రకటనలు చేస్తున్నా, జనసేన-టీడీపీ కూటమిపై జగన్ బృందం చేస్తున్న విమర్శలను చూస్తే వారు ఎంత నిరాశ-నిస్పృహల్లో ఉన్నారో స్పష్టమౌతోంది. 175 స్థానాలు గెలుస్తామని చెబుతున్న వైఎస్ఆర్సీపీకి ఎంతో ఆత్మవిశ్వాసం ఉండాలి, అందుకు బదులు జనసేన-టీడీపీ కలయికపై వారు చేస్తున్న మాటల దాడులు చూస్తుంటే ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఓట్లు రాబట్టలేవని వారికీ అర్థమైనట్టు కనిపిస్తోంది. వచ్చే ఎన్నికల్లో వైఎస్ఆర్సీపీ నాయకులకు, కార్యకర్తలకు గెలుపుపై విశ్వాసం సన్నగిల్లుతున్నట్టు అర్థమవుతోంది. జనసేన-టీడీపీ పొత్తుపై వారు చేస్తున్న విమర్శలను చూస్తే ఈ పొత్తుపై వైఎస్ఆర్సీపీ భయపడుతున్నట్లు ఉంది.రాజకీయాల్లో పొత్తులన్నది ఓ ఎత్తుగడ మాత్రమే. రాజకీయాల్లో వివిధ పార్టీలు పొత్తులు పెట్టుకోవడమన్నది సర్వసాధారణం. అంతిమంగా ఎవరు గెలుస్తారు..? ఎవరు ఓడిపోయారన్నదే ఎన్నికల్లో ప్రధానం. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలకూడదు అనే లక్ష్యంతో జనసేన-టీడీపీ పొత్తుకు సిద్ధమైతే, అది నేరం అన్నట్లు గతంలో ఎవరూ పొత్తు పెట్టుకోనట్టు వైసీపీ నేతలు విమర్శిస్తున్నారు.

# తిరుపతి నుంచి పవన్ పోటీ

తెలుగు ట్రాక్,తిరుపతి

ఉమ్మడి చిత్తూరు జిల్లాపై జనసేన దృష్టి పెట్టింది. బలిజలు ఎక్కువగా ఉన్న స్థానాలపై ఫోకస్ పెంచింది. టీడీపీతో కలిసి ఎలా నడవాలన్న దానిపై కేడర్కు దిశానిర్దేశం చేస్తోంది. మంత్రి రోజా టార్గెట్గా పావులు కదుపుతోంది. ఇక తిరుపతి, చిత్తూరు, మదనపల్లి, శ్రీకాళహస్తి స్థానాలపై నాగబాబు సమాలోచనలు సైకిల్ పార్టీకి కూడా టెన్షన్ పుట్టిస్తోంది. ఎందుకంటే గతంలో మెగాస్టార్ చిరంజీవి రాజకీయ ప్రస్థానం పవిత్ర పుణ్యక్షేత్రం తిరుపతి నుంచే మొదలైంది. తిరుపతిలో ప్రజారాజ్యం ఆవిర్భావ సభ పెట్టడమే కాదు.. చిరంజీవి పోటీ చేసిన రెండు స్థానాల్లో ఒకటి తిరుపతి. చిరంజీవికి తిరుపతివాసులు బ్రహ్మరథం పట్టారు. తిరుపతి నుంచి ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీ లో అడుగు పెట్టారు. దీంతో ఇప్పుడు చిరు తమ్ముడు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా ఎమ్మెల్యేగా తిరుపతి నుంచి పోటీ చేయాలనే డిమాండ్ మళ్ళీ తెరపైకి వచ్చింది. గత ఎన్నికల్లో భీమవరం, విశాఖ నుంచి పోటీ చేసి ఓటమి పాలైన పవన్ కళ్యాణ్ తిరుపతి నుంచి రానున్న ఎన్నికల్లో బరిలోకి దిగితే విజయాన్ని పవన్ కళ్యాణ్ కు బహుమతిగా ఇస్తామని తిరుపతి లీడర్స్ ఇప్పటికే బహిరంగా చెబుతూనే ఉన్నారు ఈ నేపథ్యంలో చిత్తూరు జిల్లా జనసేనకు ప్రాధాన్యత ఉన్న జిల్లాగా మారిపోయింది.టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరుపై జనసేన కసరత్తు ప్రారంభించింది. రాబోయే ఎన్నికల్లో టీడీపీతో పొత్తుపై ఇప్పటికే క్లారిటీ ఇచ్చిన జనసేన.. ఇప్పుడు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పార్టీ బలం, పొత్తుతో పోటీ చేస్తే వ్యవహరించాల్సిన వ్యూహంపై చర్చిస్తోంది. ఈ మేరకు జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పార్టీ కేడర్తో సమీక్షలు నిర్వహిస్తున్నారు. రెండు రోజులపాటు ఆయా నియోజకవర్గాల ముఖ్య నేతలు, పార్టీ కార్యకర్తలతో సుదీర్ఘ చర్చలే జరిపారు. తొలిరోజు చంద్రగిరి, శ్రీకాళహస్తి, నగరి, సత్యవేడు నియోజవర్గాల ముఖ్య నేతలు, కార్యకర్తలతో నాగబాబు ముఖాముఖి నిర్వహించారు.పార్టీ కేడర్కు దిశా నిర్దేశం చేసిన నాగబాబు.. స్థానికంగా టీడీపీ కేడర్తో కలిసి పని చేయాలని ఆదేశించారు. టీడీపీ నేతలను గౌరవించాలంటూ జనసేన కార్యకర్తలను ఆయన కోరారు. పార్టీలో విభేదాలు, ఏకపక్ష నిర్ణయాలకు తావు లేదని కేడర్కు నాగబాబు స్పష్టం చేశారు. జిల్లాలో జనసేన బలాన్ని నాగబాబుకు వివరిస్తూనే టీడీపీతో పొత్తుంటే ఏయే స్థానాల్లో పోటీ చేయాలన్న దానిపై కూడా పార్టీ హై కమాండ్ దృష్టికి తీసుకొచ్చింది కేడర్. ఇక బలిజ కులస్తులు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల పైనే నాగబాబు ఫోకస్ చేశారు. ఆయన సమీక్షల్లో కూడా వాటిపైనే చర్చ నడుస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తిరుపతి చిత్తూరు, మదనపల్లి, శ్రీకాళహస్తి, నగరి నియోజకవర్గాలపై జనసేన ఫోకస్ పెట్టింది.తిరుపతి చిత్తూరు మదనపల్లి శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో బలిజ సామాజిక వర్గం ఓట్లు గణనీయంగా ఉన్నాయి. నగరిలో మంత్రి రోజాను టార్గెట్ చేయాలని జనసేన కేడర్ ప్రయత్నిస్తోంది. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్పై ఘాటు విమర్శలు చేసే రోజాపై పోటీ చేసి తీరాలంటూ నాగబాబుపై కేడర్ ఒత్తిడి తెచ్చింది. ఇక నాగబాబు పర్యటన సైకిల్ నేతల్లో కూడా గుబులు పుట్టిస్తోంది. పొత్తులో భాగంగా తమ సీట్లలో జనసేన కర్చీఫ్ వేస్తుందేమోనని టీడీపీ నేతలు బెంబేలెత్తిపోతున్నారు. జనసేనతో పొత్తు తమ కొంప ముంచుతుందని భావిస్తున్న కొందరు ఇన్చార్జీలు తమ సీటుకు ఎక్కడ ఎసరు వస్తుందోనని టెన్షన్ పడుతున్నారు.

# మానసికంగా సిద్ధమవుతున్న బ్రాహ్మణి

తెలుగు ట్రాక్,రాజమండ్రి

టీడీపీ శ్రేణుల్లో ఎప్పటి నుంచో వినిపిస్తున్న పేరు.. నారా బ్రాహ్మణి . తెలుగుదేశం అధినేత.. చంద్రబాబును అరెస్ట్ చేయడం.. యువనేత లోకేష్ ను అరెస్టు చేస్తారని చెబుతుండటంతో.. ఎప్పటి నుంచో అడపా దడపా వినిపిస్తున్న ఆ పేరు మరి కాస్త ఎక్కువుగా లౌడ్ గా వినిపిస్తోంది. ఆమె ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని.. పార్టీలో లీడ్ రోల్ ప్లే చేయాలని చాలా సందర్భాల్లో చర్చకు వచ్చినా.. తెలుగుదేశం అధినాయకత్వం మాత్రం ఆమెను ముందుకు తీసుకురాలేదు. తెలుగుదేశం పార్టీలో జూనియర్ ఎన్టీఆర్ పరిస్థితి ఏంటన్నది.. దాదాపు 15ఏళ్లుగా ప్రశ్నార్థకమే. 2009 తర్వాత జూనియర్ పార్టీకి దాదాపు దూరం అయ్యారు. పార్టీకి దగ్గరగా లేరు... అలాగని దూరం జరిగినట్లూ చెప్పలేదు. తెలుగుదేశం పూర్తిగా ఢీలా పడిపోయిన పరిస్థితి వచ్చినప్పుడు.. పార్టీ బాధ్యతలను ఆయన తీసుకుంటారని.. చంద్రబాబు ఉన్నంత కాలం రాజకీయాల్లోకి రారని.. జూనియర్ అభిమాన వర్గం, తెలుగుదేశం వ్యతిరేక వర్గం ప్రచారం సాగిస్తూ ఉన్నాయి. జూనియర్ చాన్స్ కోసం చూస్తున్నారన్నది వీళ్ల అంచనా.. అయితే బ్రహ్మణితో జూనియర్ కు చెక్ పెట్టొచ్చు అని ఆమె రాకను కోరుకునే వారు ఆశిస్తున్నారు. చంద్రబాబు పార్టీని ఎన్టీఆర్ నుంచి లాక్కున్నారనే విమర్శ ఉన్నందున నందమూరి వారసురాలిగా ఆమె వస్తే.. దానిని ప్రశ్నించే సాహసం ఇంకెవరూ చేయరు అని ఆమె సపోర్టర్స్ భావిస్తున్నారు. బ్రహ్మణి ఇంత వరకూ పెద్దగా యాక్టివ్ రాజకీయాల్లో లేరు. 2019లో లేకష్ మంగళగిరి నుంచి పోటీ చేసినప్పుడు.. కొన్ని సభల్లో పాల్గొని ఓట్లు అడిగారు. అలాగే విజయవాడ, గుంటూరు లోక్ సభ నుంచి ఆమె పోటీ చేస్తారని ఎన్నికలప్పుడు వినిపిస్తూ ఉంటుంది తప్పితే.. అవి నిజం కాలేదు. మరి ఇప్పుడు పరిస్థితులు ఆమె రావలసిన అవసరాన్ని సృష్టించాయి. బ్రహ్మణి కూడా అందుకు సిద్ధమైనట్లుగా ఆమె రియాక్షన్స్ చెబుతున్నాయి.రాష్ట్రంలో అంగన్ వాడీ కార్యకర్తలపై పోలీసుల దాడులను తప్పు పడుతూ చేసిన పోస్ట్ అది... తన మామ చంద్రబాబు అరెస్ట్ అయినప్పుడు.. కుటుంబ సభ్యురాలిగా ఆమె బయటకు వచ్చి..టీడీపీ శ్రేణులతో కలిసి నిరసనల్లో పాల్గొన్నారు. చంద్రబాబుకు మద్దతుగా వచ్చిన వారితో కలిసి మాట్లాడారు. అంతవరకూ అర్థం చేసుకోదగిందే. కానీ బ్రహ్మణి ఇప్పుడు చేసిన ఈ ట్వీట్ ... పూర్తిగా రాజకీయాలకు సంబంధించింది. అసలు మూడేళ్లుగా ట్విటర్ లో యాక్టివ్ గా లేని బ్రహ్మణి ఓ పది పదిహేను రోజులుగా చంద్రబాబు అరెస్టుకు సంబంధించిన విషయాలను మాత్రమే పోస్టు చేస్తున్నారు. కానీ రెండు రోజుల కిందట ఈ పోస్టు చూస్తే..అది ఆయన అరెస్టుకు సంబంధం లేనిది. జగన్ ప్రభుత్వాన్ని తప్పు పడుతూ ఓ మహిళా అంశాన్ని ఎంచుకున్నారు. ఇక నుంచి ఇలాంటి వాటిపై ఆమె నుంచి మరిన్ని రావొచ్చని భావించొచ్చేమో.. ?ఎప్పటి నుంచో బ్రహ్మణి బయటకు రావాలని.. ఆమె పార్టీకి ట్రంప్ కార్డు అవుతుందని భావిస్తున్న క్యాడర్.. ఆ సంఘటనతో ఫుల్ ఖుషీ అయిపోయారు. కొన్ని రోజులు రాజకీయ సభల్లో పాల్గొంటే ఆమె మరింత రాటుదేలుతారని.. నందమూరి వారసురాలిగా ఆమె రాక పార్టీని మరో మెట్టు ఎక్కిస్తుందని వారంతా ఆశిస్తున్నారు. అయితే బ్రహ్మణి రాజకీయాలను సీరియస్ గా తీసుకుంటున్నట్లు ఎప్పుడూ చెప్పలేదు. చంద్రబాబు కుటుంబ సభ్యులు కూడా ఆ సంకేతాలు ఇవ్వలేదు. హెరిటేజ్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ గా ఆ బాధ్యతలను ఆమె సమర్థంగా నిర్వహిస్తున్నారు.. కానీ నారా బ్రాహ్మణి టీడీపీ తరపున యాక్టివ్గా రాజకీయాలు చేయాలని క్యాడర్ నుంచి డిమాండ్ పెరుగుతోంది. జరగబోయే దానిపై ఓ స్పష్టత వచ్చినందునేమో.. నారా బ్రాహ్మణి ఎగ్రెసివ్ గా ప్రజాసమస్యలపై స్పందిస్తున్నారు. అంగన్వాడి మహిళలు, టీడీపీ మహిళా నేత పరిటాల సునీత పై పోలీసుల వ్యవహరించిన తీరుపై ఘాటుగా స్పందించారు. ఏపీలో శాంతియుతంగా జరుగుతున్న ర్యాలీల్లో ప్రభుత్వ ప్రేరేపిత హింస చూసి షాక్ కు గురవుతున్నానన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయమని అడిగితే అంగన్వాడి కార్మికులపై దాడులు దుర్మార్గమన్నారు. బ్రాహ్మణి సోషల్ మీడియాలో వ్యక్తం చేసిన స్పందనలు క్షణాల్లో వైరల్ అవుతున్నాయి. ఇప్పటికే బ్రాహ్మణి రాజకీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. సంఘీభావం తెలిపేందుకు వస్తున్న నేతలతో రాజకీయాలు చర్చిస్తున్నారు. జనసేన నేతలు వచ్చి మాట్లాడుతున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ఐటీ ఉద్యోగులతో మాట్లాడారు. దాదాపుగా ప్రతి రోజూ రాజకీయాలపై మాట్లాడుతున్నారు ఇక ముందు ఈ రాజకీయం కంటిన్యూ అయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు.

# కొత్త కొత్త అవతారాలతో రాహుల్

తెలుగు ట్రాక్,న్యూఢిల్లీ,



కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ ఢిల్లీలోని కీర్తినగర్లోని ఫర్నిచర్ మార్కెట్ను సందర్శించారు. అక్కడి కార్పెంటర్లు, కార్మికులతో ముచ్చటించారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. జీవనం ఎలా సాగుతోందంటూ ఆరా తీశారు. ఆ వీడియోలు, ఫొటోలను కాంగ్రెస్ పార్టీ షేర్ చేసింది. అందులో రాహుల్ గాంధీ హస్తకళాకారులతో కలిసి పనిచేశారు. వారితో ముచ్చటించారు. సోషల్ మీడియా సైట్ ఎక్స్ (ట్విటర్)లో రాహుల్ గాంధీ షేర్ స్పందిస్తూ.. 'ఆసియాలోనే అతిపెద్ద ఫర్నిచర్ మార్కెట్ అయిన ఢిల్లీలోని కీర్తి నగర్కు వెళ్లాను. అక్కడ కార్పెంటర్ సోదరులను కలిశాను. వారు చాలా కష్ట పడి పనిచేస్తున్నారు, అద్భుతమైన కళాకారులు, నాణ్యమైన, దృఢమైన, అందమైన వాటిని రూపొందించడంలో వీరు ప్రవీణులు!' అంటూ రాసుకొచ్చారు. కొన్ని ఫొటో కూడా పోస్ట్ చేస్తూ.. కార్మికులతో చాలా సంభాషణలు జరిగాయని చెప్పారు. వారి నైపుణ్యాల గురించి కొంచెం తెలుసుకోవడానికి యత్నించానని, కొంచెం నేర్చుకోవడానికి ప్రయత్నించానని అన్నారు. తెలంగాణ సహా ఈ ఏడాది ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఆయా రాష్ట్రాల్లో అధికారంలోకి రావాలని కాంగ్రెస్ పార్టీ పట్టుదలతో ఉంది. అందుకు అనుగుణంగా భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుంటోంది. అంతే కాదు ప్రణాళికలను పక్కాగా ఎగ్జిక్యూట్ చేయడానికి కసరత్తు పూర్తి చేస్తోంది. రాజస్థాన్, ఛత్తీస్గఢ్లల్లో అధికారాన్ని నిలబెట్టుకోవడంతో పాటు తెలంగాణ, మధ్యప్రదేశ్, మిజోరంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు వ్యూహాలు రచిస్తోంది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యాలయంలో వరుస భేటీలు ఏర్పాటవుతున్నాయి. ఈ పరిణామాల మధ్య- రాహుల్ గాంధీ విస్తృతంగా పర్యటిస్తున్నారు. సాధారణ పౌరుడిలా గురువారం మధ్యాహ్నం ఢిల్లీలోని కీర్తినగర్కు వెళ్లారు. కార్పెంటర్ షాపులను సందర్శించారు. వడ్రంగులతో ముచ్చట్లు పెట్టారు. వారి సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు. వారికి అందుతోన్న వేతనాల గురించి ఆరా తీశారు. కొద్దిసేపు చెక్కలకు తోప్డా పట్టారు. సెప్టెంబర్ 21న ఢిల్లీలోని ఆనంద్ విహార్ రైల్వే స్టేషన్లో రాహుల్ గాంధీ పోర్టర్లతో మమేకం అయ్యాడు. వాళ్లతో చాలా సేపు మాట్లాడారు. వారి సమస్యల గురించి తెలుసుకున్నారు. ఆ తరవాత పోర్టర్ డ్రెస్ వేసుకున్నారు. బ్యాడ్జ్ కూడా పెట్టుకున్నారు. అంతే కాదు. కూలీలా ఓ సూట్కేసుని కూడా మోశారు రాహుల్. చుట్టూ వందలాది మంది కూలీలు సందడి చేశారు. ఆ వీడియోలు వైరల్ అయ్యాయి. ఛత్తీస్గఢ్లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. రోడ్ షోలను నిర్వహించారు. ఆ సమయంలో బిలాస్పూర్ నుంచి రాయ్పూర్ వరకు రైలులో ప్రయాణించారు. ఆగస్టులోనూ రాహుల్ ఢిల్లీలోని ఆజాద్పూర్ మండీకి వెళ్లారు. అక్కడ పండ్లు, కూరగాయలు అమ్ముకునే వ్యాపారులను కలిసి మాట్లాడారు. కూరగాయల ధరలు పెరుగుదలపై మాట్లాడేందుకు వెళ్లారు. జులైలో ఢిల్లీ నుంచి షిమ్లాకు వెళ్తున్న సమయంలో హరియాణాలోని రైతులను కలిశారు రాహుల్. పొలంలోకి దిగి రైతులతో మాట్లాడారు. వారితో పాటు నాట్లు కూడా వేశారు. ట్రాక్టర్తో దున్నారు. రైతు కూలీలతోనూ మాట్లాడారు. కన్యాకుమారి నుండి కశ్మీర్ వరకు తాను చేపట్టిన భారత్ జోడో యాత్రలో భాగంగా రాహుల్ గాంధీ మెకానిక్ల నుంచి విద్యార్థుల వరకు సమాజంలోని వివిధ వర్గాలతో మమేకం అవుతున్నారు. వారి కష్టసుఖాలు తెలుసుకుంటున్నారు.

# వలంటీర్ ఉద్యోగాలపై సందిగ్ధత

తెలుగు ట్రాక్,విజయవాడ

రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటు, నిర్వహణపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) చేసిన వ్యాఖ్యలు ఏపీలో కలకలం రేపుతున్నాయి. వాటి ఏర్పాటు రాజ్యాంగ విరుద్ధమని కాగ్ స్పష్టం చేసింది. స్థానిక ప్రజాప్రతినిధులను.. పౌరులను భాగస్వామ్యం చేయకుండా సచివాలయాల వ్యవస్థ రూపుదిద్దుకోవడం స్థానిక స్వపరిపాలనకు ఉద్దేశించిన రాజ్యాంగ స్ఫూర్తిని నీరుగార్చడమేనని కాగ్ చెప్పింది. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థకు చట్టబద్ధతపై ఇప్పటికీ స్పష్టత లేదు. కోర్టుల్లోనూ పిటిషన్లు దాఖలయ్యాయి. గ్రామ సచివాలయాల్లో అధికారాల్ని సర్పంచ్ లు, కార్యదర్శుల నుంచి వీర్వోలకు బదిలీ చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్ని హైకోర్టు కొట్టి వేసింది. మహిళా పోలీసుల అంశంపైనా వ్యతిరేక తీర్పులు వచ్చాయి. గ్రామ, వార్డు సచివాలయాల శాఖకు కూడా చట్టబద్ధత కల్పించాలని గతంలో ప్రభుత్వం నిర్ణయించింది. ఈ వ్యవస్థ ఏర్పాటు అత్యవసరమైనందున దీనిని తీసుకొచ్చినట్లు ఆర్డినెన్స్ జారీ చేశారు. ఆర్డినెన్స్ కాలపరిమితి తీరింది. కానీ అసెంబ్లీలో బిల్లు పెట్టి ఆమోదించలేదు. ఎందుకంటే ఈ వ్యవస్థ రాజ్యాంగ వ్యతిరేకం. రాజ్యాంగ వ్యతిరేకంగా బిల్లు ఆమోదిస్తే.. మొదటికే మోసం వస్తుంది. అందుకే చట్టబద్ధత లేని వ్యవస్థలను అలా కొనసాగిస్తున్నారు. ఇప్పుడు వీటిపై రాజ్యాంగ పరిశీలన జరిగే ప్రమాదం ఏర్పడటంతో.. అందులో ఉన్న ఉద్యోగులు టెన్షన్ పడుతున్నారు. తమ ఉద్యోగాలు ఉంటాయా ఊడుతాయా అని ఆందోళన చెందుతున్నారు.

# జస్టిస్ బేలా త్రివేదీ ధర్మాసనం ముందుకు బాబు కేసు

తెలుగు ట్రాక్,విజయవాడ

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పిటీషన్ పై సుప్రీంకోర్టులో వచ్చే నెల 3వ తేదీన విచారణ జరగనుంది. అయితే ఈ విచరణ చేపట్టే ధర్మాసనం ఖరారయింది. జస్టిస్ బేలా త్రివేది ధర్మాసనం ఎదుట చంద్రబాబు పిటీషన్ విచారణకు రానుంది. చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ ఈ నెల 3వ తేదీకి విచారణను వాయిదా వేసిన నేపథ్యంలో మరొక బెంచ్ కు మారుస్తానని తెలియజేశారు. క్వాష్ పిటీషన్ ను... ఈ నేపథ్యంలోనే చంద్రబాబు క్వాష్ పిటీషన్ ఈ నెల 3న జస్టిస్ బేలా త్రివేదీ ధర్మాసనం ఎదుట విచారణకు రానుంది. స్కిల్ డెవలెప్‌మెంట్ స్కామ్ కేసుకు సంబంధించి తనపై నమోదయిన ఎఫ్ఐఆర్‌లను కొట్టివేయాలంటూ చంద్రబాబు వేసిన క్వాష్ పిటీషన్ ను హైకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో ఆయన తరుపున న్యాయవాదులు సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. మరో వైపు
త్వరలో చంద్రబాబు పిటిషన్ మరోసారి విచారణకు వచ్చే అవకాశం ఉండగా ఏపీ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. గురువారం సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. చంద్రబాబు పిటిషన్‌పై తీర్పు ఇచ్చే ముందు తమ తరపు వాదనలు కూడా వినాలని పిటిషన్ లో ప్రస్తావించింది. స్కిల్ స్కామ్ కేసులో చంద్రబాబు పాత్రపై ఎన్నో ఆధారాలున్నాయని తెలిపింది. విద్యార్థులకు శిక్షణ ఇస్తామని కోట్ల కుంభకోణం చేశారని? నిధులను షెల్ కంపెనీల ద్వారా రూటు మళ్లించి ఎన్‌క్యాష్ చేసుకున్నారని పేర్కొంది. కేంద్ర దర్యాప్తు సంస్థలు ఇప్పటికే ఈ అంశాన్ని దర్యాప్తు చేస్తున్నాయని? ఈ కేసులో మొదట సమాచారం ఇచ్చింది కేంద్ర పరిధిలోని జీఎస్టీనే అని చెప్పింది. ఈ కేసులో తమ తరపున వాదనలను వినిపిస్తామని కేవియట్ పిటిషన్ లో సుప్రీంకోర్టును కోరింది.స్కిల్ డెవలప్మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు దాఖలు చేసిన ఎస్ఎల్పీ పిటిషన్ బుధవారం సుప్రీంకోర్టు ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. అయితే ఈ బెంచ్‌లో తెలుగు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీఎన్ భట్టి కేసు విచారణకు విముఖత వ్యక్తం చేశారు.ఈ విషయాన్ని చంద్రబాబు లాయర్ సిద్ధార్థ లూథ్రా సీజేఐ ధర్మాసనం ముందుకు తీసుకెళ్లారు. మరో ధర్మాసనం లేదా సీజేఐ ధర్మాసనం విచారించాలని ఆయన కోరడంతో... ఈ పిటిషన్ పై విచారణకు సీజేఐ అంగీకరించారు. విచారణను మరో బెంచ్‌కు బదిలీ చేస్తామని సీజేఐ తెలిపారు. ఈ పిటిషన్ పై తదుపరి విచారణను అక్టోబర్ 3వ తేదీకి వాయిదా వేశారు.

We Don't Just Print... We Create
వాసు డిజిటల్స్
VD Vasu Digitals
Large Format Digital Printing
FLEX FRONT LIT BACK LIT VINYL STICKER
PH : 9160353535, 9885768468

# పవర్ స్టార్ 'ఉస్తాద్ భగత్ సింగ్' షెడ్యూల్ పూర్తి



పవన్ కళ్యాణ్, హరీష్ శంకర్ క్రేజీ కాంబినేషన్ లో పవర్-ప్యాక్డ్ మాసీవ్ యాక్షనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్' పవర్ స్టార్ పవర్ ఫుల్ పెర్ఫార్మెన్స్ తో యాక్షన్-ప్యాక్డ్ షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. రానున్న రోజుల్లో ఎక్సయిటింగ్ అప్‌డేట్‌లతో వస్తామని మేకర్స్ అనౌన్స్ చేశారు. వర్క్ జరుగుతున్న తీరుతో చిత్ర బృందం ఆనందం వ్యక్తం చేస్తోంది.గబ్బర్ సింగ్ లాంటి సెన్సేషనల్ హిట్ తర్వాత పవన్ కళ్యాణ్, హరీష్ శంకర్ కాంబినేషన్ లో వస్తున్న చిత్రం కావడంతో పాటు సినిమా గ్లింప్స్ కి అన్నివైపుల నుంచి అద్భుతమైన స్పందన రావడంతో ఉస్తాద్ భగత్ సింగ్ హ్యూజ్ బజ్ ని క్రియేట్ చేస్తోంది.
ముఖ్యంగా, పవన్ కళ్యాణ్ మళ్లీ పోలీసుగా అలరించబోతున్నారు. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ ఎంటర్‌టైనర్ లో శ్రీలీల హీరోయిన్ గా నటిస్తున్నారు.అయనంక బోస్ సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ చిత్రానికి రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం సమకూరుస్తున్నారు. ఛోటా కె ప్రసాద్ ఎడిటింగ్ చేస్తుండగా, రామ్-లక్ష్మణ్ మాస్టర్స్ యాక్షన్ కొరియోగ్రఫీ చేస్తున్నారు.



# యాక్షన్ థ్రిల్లర్‌గా "హిట్లర్"

పలు వైవిధ్యమైన చిత్రాలతో సౌత్ ఆడియెన్స్ ను ఆకట్టుకుంటున్న హీరో విజయ్ ఆంటోనీ తన కొత్త సినిమా హిట్లర్ తో తెరపైకి రాబోతున్నాడు. విజయ్ ఆంటోనీతో గతంలో విజయ్ రాఘవన్ అనే మూవీని నిర్మించిన చెందూర్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ సంస్థ తమ 7వ ప్రాజెక్ట్ గా హిట్లర్ సినిమాను నిర్మిస్తోంది. డీటీ రాజా, డీఆర్ సంజయ్ కుమార్ నిర్మాతలు. హిట్లర్ సినిమాను యాక్షన్ థ్రిల్లర్ కథతో దర్శకుడు ధన రూపొందిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్ ను రిలీజ్ చేశారు.ట్రైన్ జర్నీలో ఉన్న హీరో విజయ్ ఆంటోనీ ఒక క్రైమ్ ఇన్సిడెంట్ ను ఎదుర్కొన్నట్లు మోషన్ పోస్టర్ లో చూపించారు. ఇదే ట్రైన్ లో హీరోయిన్ రియా సుమన్ హీరో కలుసుకుంటాడు. గన్ పేలుస్తోన్న గౌతమ్ మీనన్ ఓ కీలక పాత్రలో కనిపించారు. మోషన్ పోస్టర్ లో విజయ్ ఆంటోనీ ఫ్రెష్ లుక్ లో ఉన్నారు. చివరలో ఆయన జోకర్ గెటప్ లో కనిపించడం ఆసక్తికరంగా ఉంది. ట్రైన్ జర్నీ నేపథ్యంగా రూపొందించిన మోషన్ పోస్టర్ సినిమా మీద క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది.ప్రజాస్వామ్యం పేరుతో కొందరు పాలకులు నియంతల్లా వ్యవహరిస్తున్నారు. అలాంటి నియంతను ఎదుర్కొనే ఓ సాధారణ పౌరుడి కథే హిట్లర్. హిట్లర్ ఒక పేరు కావొచ్చు కానీ ఇప్పుడున్న ప్రజాస్వామ్య పరిస్థితుల్లో ఆ పేరు నియంతలకు మారుపేరుగా మారింది. అందుకే సినిమాకు ఈ టైటిల్ యాప్ట్ అనుకున్నాం అని మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం చిత్రీకరణ తుది దశలో ఉన్న హిట్లర్ మూవీని త్వరలో పాన్ ఇండియా స్థాయిలో హిందీతో పాటు తమిళ,తెలుగు,మలయాళ, కన్నడ భాషల్లో థియేటర్స్ లో రిలీజ్ చేయబోతున్నారు.నటీనటులు- విజయ్ ఆంటోనీ, రియా సుమన్, గౌతమ్ వాసుదేవ్ మీనన్ తదితరులు

# ఆసియా క్రీడల్లో భారత్ హవా

తెలుగు ట్రాక్,న్యూఢిల్లీ

ఆసియా క్రీడల్లో భారత్ కు పతకాల పంట పండుతోంది. ఆసియా క్రీడలు 2023 చైనాలోని హాంగ్‌జౌలో సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ 8 వరకు భారత అథ్లెట్లు 39 క్రీడలలో పోటీ పడుతున్నారు. కాగా ఇప్పటి వరకు భారత్ ఖాతాలో 8 స్వర్ణాలతో సహా మొత్తం 33 పతకాలు వచ్చి చేరాయి. దీంతో పతకాల పట్టికలో భారత్ నాల్గవ స్థానంలో నిలిచింది. ఇక ఆతిథ్య చైనా 100 బంగారు పతకాల మార్కును దాటింది.తాజాగా టెన్నిస్ మిక్స్ డబుల్స్ లో బోపన్న, రుతుజా భోసలే టీమ్ బంగారు పథకం సాధించింది. 2-6, 6-3, 10-4తో చైనీస్ తైపీపై వారు విజయం సాధించారు. చైనాలోని హాంగ్‌జౌలో ఆసియా క్రీడలు జరుగుతుండగా.. ప్రతిష్టాత్మకమైన ఈ గేమ్స్‌లో భారత ప్లేయర్లు సత్తా చాటుతున్నారు. వరుసగా మెడల్స్ సాధిస్తూ దూసుకుపోతున్నారు.భారత షూటర్లు పతకాల వేట కొనసాగిస్తున్నారు. అలాగే 10 మీటర్ల పిస్తోల్ మిక్స్ ఈవెంట్ లో దివ్యా టీఎస్, సరత్ బోత్ సింగ్ జోడి సిల్వర్ పతకాన్ని కైవసం చేసుకుంది. గోల్డ్ మెడల్ కోసం ఇండియన్ టీం తీవ్రంగా పోరాడింది. అయితే ఫైనల్ లో చైనా జోడి బంగారు పతకాన్ని ఎగరేసుకుపోయింది.షూటింగ్ విభాగంలో ఇండియాకు ఇది 19వ మెడల్ కావడం విశేషం. ఫైనల్ స్కోర్ లో 16-14 తేడాతో ఇండియాను బీట్ చేసింది. చైనీస్ షూటర్లు జాంగ్ బోవెన్, జియాంగ్ కాంగ్జిన్ లు తమ ఖాతాలో గోల్డ్ మెడల్ వేసుకున్నారు. ఇప్పటి వరకు షూటింగ్ విభాగంలో ఇండియాకు ఆరు స్వర్ణాలు, 8 వెండి, 5 రజత పతకాలు దక్కాయి. క్వాలిఫికేషన్ రౌండ్ లో సరబ్ జోత్ 291 పాయింట్లు స్కోర్ చేయగా.. దివ్య 286 స్కోర్ చేసింది. ఇద్దరు కలిసి 577 పాయింట్లు సాధించారు. ఆ రౌండ్ లో చైనీయులకన్నా ఇండియన్ బృందం బెటర్ గా పర్ఫార్మ్ చేసింది.

**Printed, Published and Owned by** KIRAN KUMAR UDARA and **Printed** at Arunodaya Notebook Manufacturers Private Limited. D. No. 33-5-9, Papaiah Street, Seethramapuram, Vijayawada-520002 (Andhrapradesh) and **Published at:** D.No. 54-17-15, ITI road, Vijayawada - 520008, A.P.,Ph:**8340909999**
**Mail:**editor@telugutrack.in **Editor** : **KIRAN KUMAR**